అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 4-9-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 245 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

భారత ఐక్యతపై దాడి

'ఒకేదేశం - ఒకే ఎన్నికలు' పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : 'ఒకే దేశం - ఒకేసారి ఎన్నికలు.. భారత్ ఐక్యతపై , రాష్ట్రాలపై దాడిగా" కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత్ అంటే రాష్ట్రాల సమాఖ్య అని, ఒకే దేశం, ఒకే ఎన్నికలు ఆలోచన దానిపై దాడి చేయడమేనని ఎక్స్ (ట్విటర్)లో ఆదివారం పోస్ట్ చేశారు.

'జమిలి ఎన్నికలపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయడం నామమాత్రపు ప్రక్రియే. దీన్ని ఏర్పాటు చేసిన సమయంపైనా అనుమానాలున్నాయి. దాని నియమ నిబంధనలను ...13లో

జమిలిపై మీ వైఖరేంటి..?

అనుకూలమంటూ 2018లో బీఆర్ఎస్ లేఖ



- ఇప్పుడూ అదే వైఖరితో ఉన్నారా..?
- జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికే ప్రమాదం
- రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి ఆటంకం
- ఓటమి భయంతోనే తెరపైకి వన్ నేషన్ -వన్ ఎలక్షన్ : రేవంత్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికే ప్రమాదమని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ వైఖరేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. 2018లో జమిలీకి అనుకూలమంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తికి బీఆర్ఎస్ లేఖ రాసిందని గుర్తు చేశారు. రాష్ట్రాల హక్కులను హరించేందుకు బీజేపీ తీసుకొస్తున్న జమిలి ఎన్నికల పట్ల ఇప్పటికీ అదే వైఖరితో ఉన్నారో, లేదో ప్రజలకు ...13లో

జమిలి ఎన్నికలు మంచిదే...

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జమిలి ఎన్నికల నిర్ణయం మంచిదేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. అయితే దీనిపై లోతుగా చర్చ జరగాలని 2018లోనే తాము లా కమిషన్‌కు చెప్పామని వివరించారు. ఈ మేరకు ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జమిలి ఎన్నికలపై అధ్యయనం కోసం మాజీ రాష్ట్రపతితో కమిటీ వేయడం ఆశ్చర్యకరమని అన్నారు. ఆ కమిటీలో అంతా ఉత్తర భారత దేశ సభ్యులే ఉన్నారనీ, దక్షిణ భారత దేశం నుంచి ఒక్కరు కూడా లేరని ఆక్షేపించారు. జమిలి ఎన్నికలపై ఇప్పటికే రిపోర్ట్ రెడీ అయ్యి ఉందా... ఇప్పుడు వేసిన కమిటీ నామ్ కే వాస్తే నేనా...అనే అనుమానాలు వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో రెండు రాష్ట్రాల అసెంబ్లీల్లో సభ్యుల సంఖ్య పెంచాలని ఉందనీ, కానీ ఇప్పటి వరకు దానికి అతీగతీ లేదన్నారు. ఐదు రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు పెట్టి ప్రధాని మోడీ దేశాన్ని గందరగోళంలోకి నెట్టారని విమర్శించారు.





బీఆర్ఎస్ బాస్ కేసీఆర్.. పక్కా పొలిటీషియన్. అందరూ మరిచిపోయిన విషయాన్ని ఎలా తెరపైకి తీసుకురావాలో.. అంతటా మాట్లాడుకుంటున్న అంశాన్ని ఏ విధంగా తెరమరుగు చేయాలో ఆయనకు తెలిసినంతగా మరొకరికి తెలియదంటే అతిశయోక్తి కాదేమో. ప్రత్యేకించి ఎత్తులు జిత్తులకు ఆయన పెట్టింది పేరు. అయితే ప్రతిపక్షాలను గందరగోళంలో, అంతకు మించిన అయోమయంలో పడేయాలనే ప్లాన్‌తో కేసీఆర్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు సొంత పార్టీ నేతలనే అయోమయానికి, ఆవేదనకు గురి చేస్తోంది. ఏమిటా నిర్ణయం అంటారా..? అదేనండీ... అందరికంటే ముందే తొందరపడి, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకుండానే 115 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేయటం. నవంబరు చివరి వారంలోనో, డిసెంబరు మొదటి వారంలోనో నిర్వహించబోయే శాసనసభ ఎన్నికలకు ఆయన ఆగస్టులోనే జాబితాను విడుదల చేయటం బీఆర్ఎస్‌కు మేలు చేస్తుందో లేదో తెలియదుగానీ, అభ్యర్థులకు మాత్రం లేనిపోని తలనొప్పులు తెచ్చిపెడుతోంది. ఎన్నికల ప్రక్రియ మొదలవకుండానే ఒక్కో నియోజకవర్గంలో ఖర్చు తడిసి మోపెడవుతోంది. దీంతో తమకు టిక్కెట్ దక్కిందన్న ఆనందం కంటే అభ్యర్థుల్లో ఆందోళనే ఎక్కువగా కనిపిస్తోంది.

తడిసి మోపెడు

బీఆర్ఎస్ ముందస్తు అభ్యర్థులకు నోటు కష్టాలు ..అయినా సీటు డౌటే..?

బి.వి.యన్.పద్మరాజు

బీఆర్ఎస్ అభ్యర్థుల తొలి జాబితాను సీఎం కేసీఆర్ ఆగస్టు 21న ప్రకటించారు. అది కూడా ఒకేసారి 115 మంది పేర్లతో కూడిన లిస్టును వెలువరించారు. ఆ జాబితాలో చోటు దక్కిన వారి మోముల్లో ఆ రోజు వెయ్యి మతాబులు వెలిగాయి. సిట్టింగులు, సీటు దక్కిన వారు వెనువెంటనే రంగంలోకి దిగి, క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని పార్టీ అధినేత ఆదేశించారు. ఇక మూణ్నెల్లపాటు హైదరాబాద్‌లో ఎవరూ ఉండొద్దు.. నియోజవర్గాలకు వెళ్లండి, జనంతో మమేకం కండి... ప్రతి ఒక్కరినీ కలవండి, తద్వారా ఇప్పటి నుంచే ఓటర్ల మనసులను గెలుచుకోండి అంటూ ఆయన వారికి దిశా నిర్దేశం చేశారు. అధినేత ఆదేశాలతో అభ్యర్థులందరూ 'ఎలక్షన్ గ్రౌండ్'కి వెళ్లిపోయారు. అభివృద్ధి కార్యక్రమాల్లో కొన్నింటికి ప్రారంభోత్సవాలు, మరికొన్నింటికి శంకుస్థాపన రాళ్లు పడ్డాయి. సామాజిక సేవా కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఒక వారం రోజులు ఇదంతా బాగానే జరిగింది. ఇక అక్కడి నుంచే సీన్ సితారవుతూ వస్తోంది.

అనుకున్నదొకటయితే.. అవుతోంది మరోటి...

తమ పరిస్థితి 'అనుకున్నదొక్కటీ.. అయినది ఒక్కటీ...' అన్నట్టుగా తయారైందని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. 'టిక్కెట్ దక్కిందనే జోష్‌లో మేముంటే.. అది దక్కింది ...2లో

దాడులు అమానుషం

చెన్నూర్‌లో తాగునీటి చెలిమెలో మూత్ర విసర్జన మానవత్వానికే మచ్చ

- పేదలపై దాడి చేసినవారికే వంతపాడుతున్న పోలీసులు, అధికారులు
- దీని అంతర్యమేమిటీ.?
- భయపెడితే పేదలు పారిపోరు..
- మరింత తెగువతో పోరాడతారు
- ఎర్రజెండా వారికి అండగా ఉంటుంది : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, మల్లు లక్ష్మి
- జగిత్యాలలో సీపీఐ(ఎం) నాయకులపై అక్రమ కేసులు



జగిత్యాల ఘటనాస్థలంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, మల్లు లక్ష్మి


నవతెలంగాణ- చెన్నూర్ / జగిత్యాల

ప్రభుత్వ అసైన్డ్ భూమిలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలపై దాడి ఒక అమానవీయమైన చర్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, మల్లు లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం బావురావుపేట శివారు సర్వే నెంబర్ 8లో పేదలు వేసుకున్న గుడిసెలపై దాడి చేసి, తాగునీటి చెలిమెలో మూత్ర విసర్జన చేయడం మానవత్వానికి మాయని మచ్చని అభివర్ణించారు. అదే విధంగా, జగిత్యాల జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలోని తిమ్మాపూర్, మోతే గ్రామాల మధ్య ఉన్న ప్రభుత్వం భూమిలో వారం రోజులుగా ఇండ్ల స్థలాల కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్న వారిపై గ్రామ ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు గాయపడ్డారు. ఆదివారం మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో జరిగిన ఈ దాడుల్లో గాయపడిన వారిని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య, మల్లు లక్ష్మి ...2లో

కేంద్రమంత్రి అలా...రైల్వే ఇలా!

ఎమ్ఎమ్‌టీఎస్‌కు రాష్ట్ర ప్రభుత్వం సహకరించట్లేదన్న కిషన్‌రెడ్డి

- 10వ తేదీ వరకు సర్వీసులు రద్దు చేస్తూ ద.మ.రైల్వే ప్రకటన



South Central Railway
Press Release
PR No. 405 Dt: 03rd September, 2023

Cancellation of MMTS Trains/Revision of Timings

Due to Infrastructural Maintenance Works over Hyderabad and Secunderabad Divisions from 04.09.2023 to 10.09.2023, the following trains MMTS trains are cancelled as follows:

1. Cancellation

Sl No.	Train No.	From-TO	J.C.O
1	47132	Lingampalli - Hyderabad	04.09.2023 to 10.09.2023
2	47133	Lingampalli - Hyderabad	04.09.2023 to 10.09.2023
3	47135	Lingampalli - Hyderabad	04.09.2023 to 10.09.2023
4	47136	Lingampalli - Hyderabad	04.09.2023 to 10.09.2023
5	47108	Hyderabad - Lingampalli	04.09.2023 to 10.09.2023
6	47109	Hyderabad - Lingampalli	04.09.2023 to 10.09.2023
7	47110	Hyderabad - Lingampalli	04.09.2023 to 10.09.2023
8	47112	Hyderabad - Lingampalli	04.09.2023 to 10.09.2023
9	47189	Lingampalli - Falaknuma	04.09.2023 to 10.09.2023
10	47179	Lingampalli - Falaknuma	04.09.2023 to 10.09.2023
11	47158	Falaknuma - Lingampalli	04.09.2023 to 10.09.2023
12	47214	Umdanagar - Lingampalli	04.09.2023 to 10.09.2023
13	47157	Umdanagar - Lingampalli	04.09.2023 to 10.09.2023
14	47181	Lingampalli - Umdanagar	04.09.2023 to 10.09.2023
15	47137	Lingampalli - Hyderabad	04.09.2023 to 10.09.2023
16	47114	Hyderabad - Lingampalli	04.09.2023 to 10.09.2023

ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేస్తూ ప్రకటన..



మీడియాతో మాట్లాడుతున్న కిషన్ రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎమ్ఎమ్‌టీఎస్ రెండో దశ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించట్లేదనీ, అందువల్ల కేంద్ర ప్రభుత్వమే వందశాతం నిధులతో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తుందని కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. సరిగ్గా ఆయన ఈ ప్రకటన చేస్తున్న టైంలోనే మరోసారి 16 ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లను ఈనెల 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటన జారీ చేశారు. యాధృచ్ఛికమో...ఉద్దేశ్యపూర్వకమో తెలీదు కానీ, కేంద్ర మంత్రి ప్రకటనకూ, క్షేత్రస్థాయి పరిస్థితులకు ఏమాత్రం పొంతన లేదనే విషయం స్పష్టమైపోయింది. 'ఎమ్ఎమ్‌టీఎస్‌కు మంగళం' శీర్షికతో ఆగస్టు 28వ తేదీ నవతెలంగాణలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. తొలి దశ ఎమ్ఎమ్‌టీఎస్ సర్వీసుల్నే ఇష్టానుసారం రద్దు చేస్తున్నారంటూ పూర్తి ఆధారాలతో ...2లో

భారత్ వెలిగిపోతుందట!

- 2047 నాటికి ఆరోగ్యం, విద్య, సామాజిక రంగాల్లో ప్రపంచంలోనే మిన్నగా.. : పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోడీ గొప్పలు



పీటీఐకి ఇంటర్వ్యూ ఇస్తున్న ప్రధాని మోడి

న్యూఢిల్లీ: 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా ఉంటుందని ప్రధాని నరేంద్ర మోడీ వక్కాణించారు. కులం పేరుతో, మతం పేరుతో మారణహోమం సృష్టించే సంఘ్‌పరివార్ మూకలను వెనకేసుకొచ్చే మోడీ ఆదివారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కులం, మతం, అవినీతి రహిత భారత్ గురించి లెక్చరిచ్చారు. 2047 నాటికి ఆరోగ్యం, విద్య, సామాజిక రంగాల ఫలితాలు ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉంటాయని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో ...13లో



బీజేపీ డౌన్‌ఫాల్ షురూ..

అందుకే జమిలి ఎన్నికల అస్త్రం

- 'ఇండియా' కూటమికి పెరుగుతున్న ఆదరణే కారణం
- కేంద్రం వేసిన కమిటీ ఓ బోగస్
- బీజేపీని గెలిపించటమే బీఆర్ఎస్, ఎంఐఎం లక్ష్యం : సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ వ్యాప్తంగా బీజేపీ డౌన్ ఫాల్‌మొదలైందనీ, మళ్లీ బతికేందుకే ఆ పార్టీ అడ్డదారులు తొక్కుతోంది."ఇండియా కూటమి"కి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణతో బీజేపీకి గుబులు పట్టుకున్నదనీ, అందుకే ఆ పార్టీ ముందస్తుగా జమిలి ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నర్సింహతో కలిసి ఆదివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో నారాయణ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంబయిలో నిర్వహించిన 'ఇండియా కూటమి' సమావేశం ప్రభావంతోనే ప్రధాని మోడీ 'ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని ' ఏర్పాటు చేశారన్నారు. మూడో ఫ్రంట్ పేరుతో ...13లో

సోనియాకు అనారోగ్యం



- ఢిల్లీలోని గంగారాం హాస్పిటల్‌లో చికిత్స
- పరిస్థితి నిలకడగా ఉందన్న వైద్యులు

వివరాలు 13లో

సనాతనను నిర్మూలించాలి

- అది సామాజిక న్యాయానికి వ్యతిరేకం: తమిళనాడు రాష్ట్రమంత్రి ఉదయనిధి స్టాలిన్



వివరాలు 13లో

కేసీఆర్ వేగులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు ప్రత్యేక ఇంటెలిజెన్స్ బృందాల సంచారం

- వేగంగా మారుతున్న రాజకీయాలు
- ప్రత్యర్థితో పాటు సొంత పార్టీ నేతలపైనా అనుమానం
- కీలక నేతలు, ప్రధాన అనుచరుల ఫోన్‌లు, కదలికలపై నిఘా
- ఎప్పటికప్పుడూ సీఎంకు సమాచారం.. ఇద్దరు అభ్యర్థులను మార్చే చాన్స్



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

వేగంగా మారుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ పరిణామాలు తెలంగాణ వ్యాప్తంగా ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖరరావు అప్రమత్తమైనట్టు తెలుస్తోంది. దీనిలో భాగంగా హైదరాబాద్ నుంచి రెండు ప్రత్యేక ఇంటెలిజెన్స్ బృందాలను 10 నియోజకవర్గాల్లో తిప్పుతున్నట్టు సమాచారం. వీరు ప్రత్యర్థి పార్టీల కీలక నేతలు వారి ప్రధాన అనుచరులతో పాటు బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు, కీలక నేతలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంస్థల చైర్మెన్ల ఫోన్లు, కదలికలపై నిఘా పెడుతున్నట్టు తెలుస్తోంది.

ఫిరాయింపు నేతలపై దృష్టి

ఇంటెలిజెంట్స్ బృందాలు ఫిరాయింపు నేతలపై దృష్టి సారించినట్టు సమాచారం. బీఆర్ఎస్ వీడుతున్న నేతలకు టచ్‌లో ఉంటున్నది ఎవరు? ఏ అంశాలపై చర్చిస్తున్నారు..? దానిలో కీలక అంశాలను ఎప్పటికప్పుడూ సీఎం దృష్టికి తీసుకెళ్తున్నారని వినికిడి. ముఖ్య నేతల కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. వారు ఎప్పుడెప్పుడు ఎక్కడికి వెళ్తున్నారు? ఏం చేస్తున్నారు? ఎవరిని కలుస్తున్నారనే వివరాలను సేకరిస్తున్నారు. రోజూ రెండుపూటలా ఈ సమాచారాన్ని హైదరాబాద్‌కు చేరవేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముఖ్యంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయన అనుచరగణం కదలికలపై నిఘా ఉంచుతున్నట్టు సమాచారం. కొద్దిరోజులుగా తుమ్మల నాగేశ్వరరావు కార్యకలాపాలపై కూడా నిఘా అధికంగా ...13లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

తడిసి మోపెడు

(మొదటిపేజీ తరువాయి)

కాబట్టి ఇక ప్రతీరోజూ ఒక ఊపు ఉపాల్సిందే అనే రీతిలో క్యాడర్ ఉంది...' అని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ అభ్యర్థి వాపోయారు. ఇది వినటానికి బాగానే ఉన్నా... ఇప్పటి నుంచే 'అన్నీ చూసుకోవాలి.. అన్నీ భరించాలి...' అంటే ఖర్చే తడిసిమోపెడవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాపం... తెల్లవారకముందే తలుపు తడుతున్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలను చూసి నవ్వాలో ఏడవాలో అర్థం కాని పరిస్థితి వారిది. ఏ మాత్రం కటువుగా మాట్లాడినా, వారు 'అడిగిన దానికి నో చెప్పినా...' అలకపాన్పు ఎక్కుతారామోనన్న భయం వెంటాడుతోందని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత ఆందోళన వ్యక్తం చేశారు. అలకపాన్పు ఎక్కినా ఫరవాలేదు, కానీ కోపానికొచ్చి... మాకు హ్యాండిచ్చి... ఇంకో పార్టీ 'హస్తం' అందుకుంటారేమోనని భయంగా ఉందంటూ మరో సీనియర్ ఆవేదన వ్యక్తం చేశారు. టిక్కెట్ దక్కిందనే ఆనందం కంటే... ఇప్పటి నుంచి పెట్టాల్సిన ఖర్చు చూస్తేనే ఏడుపొస్తోందని హైదరాబాద్‌కు చెందిన మరో ముఖ్య నేత నెత్తి పట్టుకున్నారు.

ముందుంది మొసళ్ల పండగ...

జాబితా వచ్చి నెలరోజులు కాకముందే చోటా మోటా నేతలు, కార్యకర్తలను కాపాడుకునేందుకు, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నానా తిప్పలు పడాల్సి వస్తుంటే..ఈనెలతోపాటు అక్టోబరు, నవంబరు నెలల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవటానికే కష్టంగా ఉందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఆయా నెలల్లో వరసగా వినాయక చవితి, బతుకమ్మ దసరా, దీపావళి పండుగలు ఉండటమే దీనికి కారణం. వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గాల్లోని ప్రతీ ఊరుకి గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పూజలు, ఊరేగింపులు, భజనల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇదే ఇప్పుడు వారిని మరింత కలవరపాటుకు గురి చేస్తోంది. ఓట్ల పండుగ రాకముందే ఈ పండుగలు మాకు గుండు గీయిస్తాయని అభ్యర్థులు దిగులుపడుతున్నారు.

చంటి పాపలు.. కంటి పాపలు...

'ఎన్నికలు అయిపోయేంత వరకూ కార్యకర్తలు, నాయకులను చంటి పాపల్లా చూసుకోవాలి. ఏ ఒక్కరినీ చేజార్చుకోవద్దు. ఇగోలు, ప్రెస్టేజీలన్నింటినీ పక్కన పెట్టండి. అవసరమైతే మీకు వ్యతిరేకంగా ఉన్న వారి కడుపులో తలకాయపెట్టి మరీ బతిమాలుకోండి...' అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్... అభ్యర్థులకు మొదటి నుంచీ చెబుతూ వస్తున్నారు. వారితోపాటు ఓటర్ల అవసరాలు గుర్తించి, వారిని ఇప్పటి నుంచే కంటి పాపల్లా చూసుకోవాల్సి వస్తోందని ఓ యువనేత చెప్పారు. ఇదే ఇప్పుడు తమకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని ఆయన వ్యాఖ్యానించటం గమనార్హం. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత 'ఖర్చు' సంగతేమోగానీ, అది వచ్చేదాకా.. ఈ రెండు, మూడు నెలల కాలం ఎలా గడుస్తుందోనని కారు పార్టీ అభ్యర్థులు మదనపడిపోతున్నారు. ఇంత చేసినా బీ-ఫామ్ దక్కేదాకా సీటుకు గ్యారెంటీ లేదని వారు వాపోతుండటం కొసమెరుపు.

ఒడిశాలో వర్ష బీభత్సం

- పిడుగులు పడి 12 మంది మృతి
- మరో రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు



భువనేశ్వర్ : ఒడిశాలో భారీ వర్షాలు, పిడుగులు బీభత్సం సృష్టించాయి. పిడుగులు పడి వేర్వేరు ప్రాంతాల్లో 12 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. మరణించిన వారిపై ఆధారపడిన కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఖుర్దా జిల్లాలోనే నలుగురు మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బోలన్‌గిర్‌లో ఇద్దరు, అంగుల్, బౌద్, జగత్‌సింగ్‌పూర్, దేన్‌కనాల్, గజపతి, పూరీ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. ఒడిశా తీర ప్రాంతంతో పాటు జంట నగరాలైన భువనేశ్వర్, కటక్ పట్టణాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాబోయే నాలుగు రోజుల పాటు ఒడిశా వ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరించింది. తుపానుతో పాటు రుతుపవనాలు కూడా తోడవడంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది. నారాజ్‌లో 13 సెంటీమీటర్లు, పిపిలిలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే సమయంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించింది. చెట్లు, నీటి వనరులకు దూరంగా ఉండాలని కోరింది.

ఇంటర్‌నెట్ నిషేధం ఓ భారీ తప్పిదం

మెయితీల గుప్పెట్లోనే మీడియా | ఎడిటర్స్ గిల్డ్ నివేదిక



Editors Guild of India

న్యూఢిల్లీ : మణిపూర్‌లో మైనార్టీ కుకీలపై పెద్దయెత్తున దాడులు, హింస చోటుచేసుకున్న సమయంలో ఇంటర్‌నెట్‌ను రాష్ట్రవ్యాపితంగా నిషేధించడం పెద్ద తప్పిదమని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఈజీఐ) పేర్కొంది. ఇంటర్‌నెట్ నిషేధంతో రాష్ట్రంలో పరిస్థితులు మరింతగా దిగజారాయని తెలిపింది. ఇజిఐకు చెందిన నిజనిర్ధారణ బృందం ఆగస్టు 7 నుంచి 10 వరకూ మణిపూర్‌లో పర్యటించింది. ఈ బృందంలో సీమా గుహ, భరత్ భూషణ్, సంజయ్‌కపూర్ సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం ఇటీవల 24 పేజీలతో కూడిన నివేదికను ఆదివారం నాడిక్కడ విడుదల చేసింది. 'మణిపూర్‌లో మెయితీ ప్రభుత్వం, మెయితీ పోలీసులు, మెయితీ అధికారులు ఉన్నారు. కొండల్లో నివసించే ఆదివాసీ ప్రజలకు వీరిపై విశ్వాసం లేదు' అని నివేదిక పేర్కొంది. మణిపూర్ అంటే మెయితీ మీడియా అని పేర్కొంది. ఈ మెయితీ మీడియా భద్రతా బలగాలపై, ముఖ్యంగా అస్సాం రైఫిల్స్‌పై విష ప్రచారాన్ని వ్యాప్తి చేసిందని నివేదిక వెల్లడించింది. 'మణిపూర్‌లో మీడియా తన ప్రజల అభిప్రాయాలుగా చెబుతూ అస్సాం రైఫిల్స్‌కు వ్యతిరేకంగా నిరంతరం ప్రచారం చేస్తూ తన విధి నిర్వహణలో విఫలమైంది. వాస్తవాలను వెల్లడించడంలోనూ వైఫల్యాన్ని మూటగట్టుకుంది' అని స్పష్టం చేసింది. అస్సాం రైఫిల్స్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి తమ పోలీసుల్ని అనుమతించడం ద్వారా మణిపూర్‌లోని బిజెపి ప్రభుత్వం ఈ దుర్మార్గానికి నిశ్శబ్దంగా మద్దతు ఇచ్చిందని నివేదిక పేర్కొంది. ఈ వివాదం, ఇంటర్‌నెట్‌పై నిషేధంతో రాష్ట్రంలో ఒక చోట ఏం జరుగుతుందో.. మరో చోట తెలియకుండా పోయిందని తెలిపింది. దేశంలో పురాతనమైన పారామిలటరీ బలగాలు అస్సాం రైఫిల్స్, మణిపూర్ పోలీసులకు మధ్య వివాదం దేశంలోనే తొలిసారని నివేదిక తెలిపింది. అస్సాం రైఫిల్స్‌కు వ్యతిరేకంగా మణిపూర్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో 'కుకీ మిలిటెంట్లు పారిపోవడానికి అనుమతించారు' అని స్పష్టంగా ఉంది. ఈ నెల 1న అస్సాం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ పిసి నాయర్ మాట్లాడుతూ మణిపూర్‌లో లాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ తమకు ఎదురుకాలేదని చెప్పారు.ఇంటర్‌నెట్ నిషేధంతో వార్తల క్రాస్-చెకింగ్, మానిటరింగ్‌పై తీవ్ర ప్రభావం చూపిందని నివేదిక తెలిపింది. మే 3న మణిపూర్‌లో ఇంటర్‌నెట్‌పై తొలిసారి నిషేధం విధించారు. ఆ తరువాత దానిని పొడిగిస్తూ వచ్చారు. ఇంటర్‌నెట్ నిషేధంతో జర్నలిస్టులు రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన వార్తలనే అనుసరించాల్సి వచ్చిందని, రాష్ట్రంలో మెజారిటీ ప్రజలైన మెయితీల పక్షం వహించాల్సి వచ్చిందని నివేదిక తెలిపింది. ప్రభుత్వం ద్వారా సమాచారంపై దిగ్బంధనం రాష్ట్రంలో జర్నలిజంపై హానికరమైన ప్రభావం చూపిందని విమర్శించింది. హింసాకాండ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మెయితీ గ్రూపునకు పక్షపాతిగా మారిందని స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని నివేదిక తెలిపింది. ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వంగా తన విధిని నిర్వర్తించడంలో బీరేన్‌సింగ్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించింది.

మేకను ఎత్తుకెళ్లారనే కారణంతో దౌర్జన్యం


- అమానుషంగా ప్రవర్తించిన దుండగులు
- వారిని కఠినంగా శిక్షించాలి : కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మేకను ఎత్తుకెళ్లారనే కారణంతో అమానుషంగా దౌర్జన్యానికి పాల్పడ్డ దుండగులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం యాపల్ ప్రాంతంలో చాకలి రాములు అనే యాజమానికి మేకల కాపరిగా ఉన్న తేజతో పాటు అతడి స్నేహితుడు చిలుముల కిరణ్ అనే దళిత యువకుడిని మేకలు ఎత్తుకెళ్లారనే కారణంతో చెట్టుకు కట్టేసి తలకిందులుగా వేలాడదీసిఅమానుషంగా దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు జరిగితే పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేయాలి కానీ.. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని మధ్యయుగాల నాటి అమానుషాలకు పాల్పడటమేంటని ప్రశ్నించారు. ఒక దళితుడు నా మేకను దొంగలిస్తాడా? అనే కుల దురహంకారంతో బాధితులను తలకిందులుగా చెట్టుకి వేలాడదీసి, కింద అగ్గి మంట పెట్టి చిత్రహింసలకు గురి చేశారని పేర్కొన్నారు. అవమానం భరించలేక కిరణ్ ఎవరికి చెప్పకుండా పారిపోయాడని తెలిపారు. తక్షణమే మేకల యజమాని చాకలి రాములు పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి

లక్ష్యం దిశగా ఆదిత్య

- మొదటి విన్యాసం విజయవంతం
- మరొక విన్యాసానికి షెడ్యూలు నిర్ణయించిన ఇస్రో
- నాలుగు నెలల్లో నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశించనున్న ఆదిత్య ఎల్ -1



న్యూఢిల్లీ : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) సూర్యునిపై పరిశోధనకు ప్రయోగించిన ఆదిత్య ఎల్ -1 ఆదివారం మరొక మైలురాయిని అధిగమించింది. తన మొదటి అడుగును విజయవంతంగా వేసినట్టు ఇస్రో తెలియజేసింది. ఆదిత్య ఎల్ -1 ఉపగ్రహం ఆరోగ్యవంతంగా ఉందని, సాధారణంగా తెరుచుకుందని ఇస్రో తన తాజా ప్రకటనలో వివరించింది. తదుపరి విన్యాసాన్ని మంగళవారం ఉదయం 3 గంటలకు షెడ్యూల్ చేసినట్టు తెలిపింది. శ్రీహరి కోట నుంచి ప్రయోగించిన ఆదిత్య ఎల్-1 సూర్యుని మీద సవివరమైన అధ్యయనం జరపడానికి ఏడు వేర్వేరు పేలోడ్లను మోసుకెళుతున్న విషయం తెలిసిందే.



వీటిలో నాలుగు పేలోడ్లు సూర్యుని నుంచి వచ్చే కాంతిని పరిశీలించనుండగా, మరో మూడు సూర్యుని ప్లాస్మా , అయస్కాంత క్షేత్రాలను అధ్యయనం చేయనున్నాయి. ఆదిత్య ఎల్ - 1 మిషన్ సూర్యుని దిశగా భూమి నుండి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక వర్తులాకార కక్ష్య అయిన లాంగ్రేంగియన్ పాయింట్ 1 (ఎల్1)లో పరిభ్రమించనుంది. ఈ కక్ష్య సూర్యునికి, భూమికి మధ్య దూరంలో 1 శాతం ఉంటుంది. ఈ కక్ష్యలోకి ప్రవేశించడానికి ఆదిత్య ఎల్ - 1 మిషన్ కు 4 నెలల వ్యవధి పట్టనుంది. ఆదిత్య ఎల్-1 సూర్యుని వెలుపలి వాతావరణాన్ని అధ్యయనం చేస్తుందని, సూర్యుడిని సమీపించడం గాని, సూర్యునిపై ల్యాండ్ కావడం గాని జరగదని ఇస్రో వెల్లడించింది. ప్రస్తుతం నిర్ణయించిన కక్ష్య గ్రహణాలు గాని, మరే ఇతర ఆటంకాలు గాని లేకుండా సౌర కార్యకలాపాలు, అంతరిక్ష వాతావరణంపై వాటి ప్రభావాలను వాస్తవ సమయం ఆధారంగా అధ్యయనం చేయడానికి శాస్త్రవేత్తలకు వీలుకల్పించనుంది. ఆదిత్య ఉపగ్రహం పంపే డేటా సౌర విస్ఫోటన ఘటనల ప్రక్రియల వరుస క్రమాన్ని గుర్తించి, అంతరిక్ష వాతావరణాన్ని ప్రభావితం చేసే కారకాలను మరింత లోతుగా అవగాహన చేసుకోవడానికి ఉపయోగపడనుంది.

సూర్యుని వెలుపలి పొర అయిన కరోనా, దాని ఉష్ణ యంత్రాంగం భౌతిక ధర్మాలను అధ్యయనం చేయడం, సౌర పవన త్వరణం, సౌర వాతావరణ గతిశీలత, సౌర వాయువుల వ్యాప్తి, ఉష్ణోగ్రత లక్షణాలు, కరోనా మాస్ ఎజెక్షన్స్, జ్వాలలు, భూమికి సమీపంలో ఉన్న అంతరిక్ష వాతావరణాన్ని అధ్యయనం చేయడం కోసం ఆదిత్య మిషన్‌ను ఇస్రో ప్రారంభించిన సంగతి తెలిసిందే.

భూగర్భ జలాలు అడుగంటుతయ్

- 2080 నాటికి భారత్‌లో మూడు రెట్లు నీటిని కోల్పోయే ప్రమాదం
- మిచిగాన్ విశ్వవిద్యాలయం అధ్యయనం

న్యూఢిల్లీ : భారత్‌లోని భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదమున్నదని మిచిగాన్ విశ్వవిద్యాలయం నేతృత్వంలోని ఒక అధ్యయనం హెచ్చరించింది. భారతీయ రైతులు ప్రస్తుత రేటుతో భూగర్భ జలాలను వినియోగిస్తే భూగర్భజలాల క్షీణత రేటు 2080 నాటికి మూడు రెట్లు పెరుగుతుందని తెలిపింది. ఇది దేశ ఆహారం, నీటి భద్రతతో పాటు జీవనోపాధిపై తీవ్ర ప్రభావాలను కలిగిస్తుందని వివరించింది. భూగర్భజలాల క్షీణత, వాతావరణ మార్పుల కారణంగా భారత్‌లో తగ్గిన నీటి లభ్యత దేశంలోని ప్రజలలో మూడింట ఒక వంతు మంది జీవనోపాధికి ముప్పు కలిగిస్తుందని వెల్లడైంది.

ఈ అధ్యయనం వెల్లడించిన సమాచారం ప్రకారం.. భారత్‌లో వేడెక్కుతున్న వాతావరణం రైతులను భూగర్భ జలాలను అధికంగా వినియోగించేలా చేసింది. ఈ అధ్యయనాన్ని సైన్స్ అడ్వాన్సెస్ జర్నల్‌లో ప్రచురించారు. "భూగర్భ జలాల వినియోగంలో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారు. ప్రాంతీయ, ప్రపంచ ఆహార సరఫరాకు కీలకమైన వనరుగా ఉన్నందున ఇది ఆందోళన కలిగిస్తుంది" అని యూనివర్సిటీ స్కూల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టైనబిలిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రచయిత్రి మేహా జైన్ అన్నారు. భారత్ అంతటా భూగర్భజలాల నష్టాన్ని అంచనా వేయడానికి భూగర్భజల స్థాయిలు, వాతావరణం, పంట నీటి ఒత్తిడిపై చారిత్రక సమాచారం ఆధారంగా అధ్యయనం విశ్లేషించింది.అధ్యయనంలో భాగంగా చాలా నమూనాలు భారత్‌లో పెరిగిన ఉష్ణోగ్రత, పెరిగిన రుతుపవనాల (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు) అవపాతం, శీతాకాలపు అవపాతం తగ్గడం వంటి వాటిని పరిశీలించారు. వివిధ వాతావరణ మార్పుల పరిస్థితులలో, 2041 నుంచి 2080 మధ్య భూగర్భజలాల స్థాయి క్షీణత గురించి వారి అంచనాలు సగటున ప్రస్తుత క్షీణత రేటు కంటే మూడు రెట్లు ఎక్కువ అని వారు చెప్పారు. వాతావరణ మార్పుల నేపథ్యం భారత్‌లో ఆహారం, నీటి భద్రతను మరింత సవాలు చేస్తుందనిని భట్టారాయ్ చెప్పారు.

విశ్రాంతి మోడ్ లోకి ప్రజ్ఞాన్ రోవర్

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక చంద్రయాన్ 3 లో భాగంగా చంద్రునిపై 14 రోజుల పాటు తన యాత్రను కొనసాగించిన ప్రజ్ఞాన్ రోవర్ ఆదివారం నుంచి 'విశ్రాంతి' తీసుకోనుంది. చంద్రుని పగటి పూట ముగియడంతో మరో 14 రోజుల పాటు రాత్రి వేళ కొనసాగనుంది. ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 1 వరకు విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లు తమకు అప్పగించిన పనిని విజయవం తంగా నిర్వర్తించినట్టు ఇస్రో పేర్కొంది. సల్ఫర్, ఐరన్, ఆక్సిజన్ మూలకాలను కనుగొనడంతో పాటు సాపేక్ష ఉష్ణోగ్రతలను కూడా నమోదు చేశాయి. ప్రజ్ఞాన్ రోవర్ తన పనిని పూర్తి చేయడంతో సురక్షితంగా పార్కు చేసి, 'స్లీప్' మోడ్ లోకి పంపినట్టు ఇస్రో ట్వీటర్ లో పేర్కొంది. ప్రస్తుతం బ్యాటరీ పూర్తిగా చార్జింగ్‌లో ఉందని, సెప్టెంబర్ 22న మరలా సూర్యోదయం ప్రారంభమైన తరువాత కాంతిని స్వీకరించే విధంగా సోలార్ ప్యానెల్ ను సన్నద్ధం చేసినట్లు తెలిపింది. మరొకసారి తనకు అప్పగించే లక్ష్యాలను నెరవేర్చవచ్చని ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రజ్ఞాన్ రోవర్ చంద్రునిపై భారత రాయబారిగా అక్కడే ఉండిపోనుందని వెల్లడించింది.

కేంద్రమంత్రి అలా...రైల్వే ఇలా!

(మొదటిపేజీ తరువాయి)

కథనాన్ని ప్రచురించింది. శనివారం కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి రాష్ట్రంలో అమలవుతున్న రైల్వే ప్రాజెక్టుల వివరాలతో విలేకరుల సమావేశం నిర్వహించారు. అయితే దీనిలో ఎమ్ఎమ్‌టీఎస్ సర్వీసుల్ని ఎందుకు రద్దు చేస్తున్నారనే వివరణ మాత్రం ఇవ్వలేదు. రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే ప్రధాని నరేంద్రమోడీకి పేరొస్తుందనే ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తున్నదని ఆరోపించారు. అవసరం లేని మార్గాల్లో వేల కోట్ల రూపాయల వ్యయంతో మెట్రోరైల్ నిర్మిస్తున్నారని విమర్శించారు. ఎంఎంటీఎస్ - ఫేజ్ 2లో ఘట్‌కేసర్ నుంచి యాదాద్రిని అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం చాలా కాలంగా ఆలోచిస్తున్నదనీ, కానీ దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస సహకారం అందడం లేదని చెప్పారు. రూ.980 కోట్ల అంచనా వ్యయంతో 40 కి.మీ., నిర్మితమయ్యే ఈ మార్గాన్ని వందశాతం నిధులు కేటాయించి కేంద్ర ప్రభుత్వమే పూర్తిచేయాలని నిశ్చయించిందని తెలిపారు. అలాగే ఘట్ కేసర్ నుంచి వంగపల్లి వరకు నాలుగు లైన్ల పనులు కూడా ఈ ప్రాజెక్టులో భాగంగానే జరుగుతాయని వివరణ ఇచ్చారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకూ రైల్వే కనెక్టివిటీ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూసేకరణ, నిధుల కేటాయింపులో రాష్ట్రమే ముందుకు రావట్లేదనీ, ఈ సహాయ నిరాకరణ వల్ల దాదాపు 700 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ల పనులు నిలిచిపోయాయని చెప్పారు. రాష్ట్రంలో 40 రైల్వేస్టేషన్ల ఆధునీకరణకు కేంద్రం రూ.2,300 కోట్ల నిధుల్ని విడదల చేసిందనీ, వీటిలో 21 స్టేషన్లకు ప్రధానమంత్రి వర్చువల్ మోడ్‌లో శంకుస్థాపన చేశారని వివరించారు. ప్రాజెక్టుల వారీగా ఆయా స్టేషన్లు, లైన్లు, నిధుల కేటాయింపు అంశాలను మరోసారి వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం రూ.83వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు.



టైం ఛేంజ్

ఎమ్ఎమ్‌టీఎస్ 16 సర్వీసుల్ని ఈనెల 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు ఉందానగర్-లింగంపల్లి (ట్రైన్ నెంబర్.47165) సర్వీసు టైం టేబుల్‌ను మారుస్తున్నట్టు ప్రకటించింది. ఉందానగర్‌లో ఉదయం 8.50కు బయల్దేరి, ఉదయం 10.50కి లింగంపల్లికి చేరుకుంటుందని తెలిపారు. మౌలిక వసతుల నిర్వహణ పనుల వల్ల ఎమ్ఎమ్‌టీఎస్ సర్వీసుల్ని రద్దు చేస్తున్నామని ఆ ప్రకటనలో వివరించారు.

దాడులు అమానుషం

(మొదటిపేజీ తరువాయి)

పరామర్శించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం బావురావుపేట శివారు సర్వే నెంబర్ 8లో పేదలు వేసుకున్న గుడిసెలను సందర్శించి ఎస్. వీరయ్య మాట్లాడారు. పేదలు గుడిసెలు వేసుకొని ఐదు నెలలకు పైగా నివాసముంటుంటే, పక్కా ప్లానింగ్‌తో 200 మందిని తీసుకొచ్చి వేసుకున్న గుడిసెలను, అందులో ఉన్న సామగ్రిని కాల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది భూ కబ్జాదారులకు వత్తాసు పలికి, మామూళ్లకు తలొగ్గి అక్రమంగా పట్టా చేయించారన్నారు. పేదలు వేసుకున్న గుడిసెలు కూల్చి కాల్చి వేస్తుంటే.. ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిసెలన్నీ ఒక గంటలోపే కూల్చి, కాల్చి వేయడమే కాకుండా, మంచినీటి కోసం తవ్వుకున్న చెలిమలో మూత్ర విసర్జన చేశారని మండిపడ్డారు. పట్టణానికి కూతవేటు దూరంలోనే ఈ ఘటన జరుగుతుంటే పట్టి పట్టనట్టుగా పోలీసులు ఆలస్యంగా రావడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. ఒక వైపు పేదలకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామంటూనే మరోపక్క ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తూ, భూ కబ్జాదారులకు వంతపాడుతున్నారని విమర్శించారు. ఏది ఏమైనా పేదలు వెను తిరిగి పోరని, ఇంటి జాగాకి పట్టాలిచ్చేంత వరకు సీపీఐ(ఎం) అండదండలతో పోరాడుతారని స్పష్టం చేశారు. అనంతరం మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. ఐదు నెలలుగా ఇక్కడే ఉంటూ అన్ని సమకూర్చు కున్నారని, వాటన్నింటినీ కూల్చి, కాల్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి గుడిసెవాసులకు రూ.2 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కబ్జాకోర్లను ఎదుర్కొని పోరాటం సాగించాలని, పార్టీ అండగా ఉంటుందని భూ పోరాట భాదితులకు స్పష్టంచేశారు. మంచినీళ్ల చెలిమలో మూత్ర విసర్జన చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు, గుడిసెవాసులు పాల్గొన్నారు. జగిత్యాల కేంద్రానికి కూత వేటు దూరంలోని తిమ్మాపూర్, మోతే గ్రామాల మధ్య ఉన్న ప్రభుత్వం భూమిలో వారం రోజులుగా ఇండ్ల స్థలాల కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శాంతియుతంగా పోరాటం చేస్తున్న పేదలపై దాడి హేయమైన చర్య అని సీపీఐ(ఎం) నేతలు అన్నారు. ధర్నా చేస్తున్న వారిలో సీఐటీయూ కన్వీనర్ సులోచనతో పాటు మరో ఆరుగురిపై గ్రామ ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి దాడి చేయగా, గాయపడిన వారిని పరామర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో ఇల్లు లేని పేదలకు 120గజాల స్థలంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.5లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం లో ఇప్పటికే 64 కేంద్రాల్లో ఇండ్ల స్థలాల కోసం పోరాటం జరుగుతో ందని తెలిపారు. జగిత్యాలలో 65వ కేంద్రంగా పోరాటం చేస్తున్న వారిపై దాడి చేయడం హేయమైన చర్య అని తెలిపారు. తిమ్మాపూర్,మోతే గ్రామాల మధ్యలో ఉన్న స్థలం ధరణిని అనుసరి ంచి ప్రభుత్వ భూమిగా నిర్ధారణ చేసుకున్న తర్వాతనే ఇండ్ల స్థలాల కోసం గుడిసెలు వేశామని వివరించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్, రెవెన్యూ అధికారులు దాడి చేసిన వారికే కొమ్ముకాస్తున్నారని తెలిపారు. పైగా, పేదల ఇండ్ల కోసం పోరాడుతున్న నాయకులపై భూముల ఆక్రమణ, హత్యాయత్నం వంటి కేసులు నమోదు చేశారు. సీపీఐ(ఎం) స్థానిక నాయకులు తిరుపతి నాయక్, కడకుంట్ల నాగరాజు, గర్వందుల రమేష్, సులోచన, పోచయ్య, సుధారాణి, రఫీ, వెలుగొండ శ్రీను, శ్రీకాంత్, సమ్మయ్య, పూచెర్ల అంకుశ్, లావణ్యపై పోలీసులు కేసు నమోదు చేసినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ అస్తవ్యస్తం..!

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అవకతవకలు

- కొందరు ఉద్యోగుల చేతివాటం..!
- త్వరలో ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలు
- ప్రభావం చూపే ఛాన్స్..?
- ఎలక్షన్‌పై అనుమానాలెన్నో..?



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ అస్తవ్యస్తంగా తయారైంది. పైసలు ఉంటేనే పని జరుగుతుందన్నట్టుగా మారింది. ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకోవాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు అయ్యే ఖర్చు కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అక్కడ పని చేసే కొందరు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. మరి..! ఈ ఎన్నికలు సజావుగా జరుగతాయో..? లేదో..? వేచి చూడాలి..!

2018లో తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ఏర్పాటైంది. ఈ కౌన్సిల్‌లో ఇప్పటి వరకు దాదాపు 55వేల మంది రిజిస్టర్ చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 145 వరకు ఫార్మసీ కాలేజీలుండగా, ప్రతి ఏడాదీ సుమారు 10వేల మంది విద్యార్థులు బయటకు వస్తుంటారు. డిప్లొమా ఇన్ ఫార్మసీ, బ్యాచ్‌లర్ ఆఫ్ ఫార్మసీ, డాక్టర్ ఆఫ్ ఫార్మసీ చదివిన రాష్ట్రానికి చెందిన విద్యార్థులు.. వెంగళ్‌రావు నగర్‌లో ఉన్న తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు రూ.560 ఫీజు చెల్లించాలి. రిజిస్టర్ అయిన తర్వాతే వారికి గుర్తింపు దక్కుతుంది. ఫార్మసీలో ఉద్యోగం పొందాలన్నా.. మెడికల్ హాల్ ప్రారంభించాలన్నా.. ఈ రిజిస్టర్ నెంబర్‌ను ఖచ్చితంగా అడుగుతారు. కౌన్సిల్‌లో పనిచేసే కొందరు సిబ్బంది ఈ నిబంధనను అడ్డుపెట్టుకుని రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకునే సమయంలో అధిక డబ్బును వసూలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ అసలు ఫీజు రూ.560 ఉంటే, ఈ డబ్బులు ఆన్‌లైన్‌లో చెల్లించినప్పటికీ అదనంగా ఇతరాత్ర సాకులు చెప్పి మరో రూ.1,000, రూ.1,500, రూ.2,000, రూ.3,000, రూ.4,000 వరకు గుంజుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

నెలకు రూ.30 లక్షలకు పైగా వసూలు..

డిప్లొమా ఇన్ ఫార్మసీ, బ్యాచ్‌లర్ ఆఫ్ ఫార్మసీ, డాక్టర్ ఆఫ్ ఫార్మసీ చదివిన వారు సగటున రోజూ 150 మంది ఈ ఫార్మసీ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. వీరందరి వద్ద కొంత మంది సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.వెయ్యి అధికంగా గుంజుతున్నారనుకున్నా.. రోజూ దాదాపు రూ.లక్షకు పైగా అక్రమంగా సంపాదిస్తున్నారు. ఇలా నెలకు దాదాపు 3,900 మంది వరకు రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ఒక్కొక్కరి నుంచి రూ.వెయ్యి చొప్పున లెక్కేస్తే.. నెలకు దాదాపు రూ.30 లక్షలకు పైగా అధికంగా వసూలు చేస్తున్నారు. డాక్యుమెంట్స్ సరిగా లేవని, ఇతరాత్ర పత్రాల సాకు చూపి ఎక్కువ డబ్బులు లాగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన అభ్యర్థులు ఆలస్యమైతే బయట ఖర్చు పెరుగుతుందనే భయంతో వారు అడిగినంత ముట్టజెప్పి రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించుకుంటున్నారు. ఇలా విద్యార్థుల అవసరాన్ని క్యాష్ చేసుకుంటున్న ఫార్మసీ కౌన్సిల్‌లోని కొందరు ఉద్యోగులు రూ.నెలకు రూ.లక్షలు సంపాదిస్తున్నారని వినికిడి. అడిగేవారు, పట్టించుకునే వారు లేకపోవడంతో వారి బిజినెస్ 'మూడు పువ్వులు, ఆరు కాయలు' అన్నట్టుగా సాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నికలపై అనుమానాలెన్నో..?

త్వరలో ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడింది. అక్టోబర్ 19వ తేదీ నుంచి 21 మధ్య బ్యాలెట్ పేపర్‌ను డిస్‌ప్యాచ్ చేస్తారు. నవంబర్ 10వ తేదీ నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ ఎన్నికలకు ఐఏఎస్ అధికారి దాసరి హరిచందనను ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌గా నియమించారు. కేవలం కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవడానికే లంచం అడుగుతు న్నారంటే, త్వరలో జరుగబోయే ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరన్న గ్యారంటీ ఏముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో ఎన్నికలు సజావుగా జరుగుతాయో.. లేదో.. అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. పోస్టల్ బ్యాలెట్ పేపర్లను అమ్ముకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఎన్నికలకు ముందే సంబంధిత అధికారులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్పందించి అవకతవకలపై ఆరా తీసి చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

గతంలో ఫేక్ రిజిస్ట్రేషన్ ఫార్మసీ సర్టిఫికెట్లు తయారీ..



తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో పని చేసే కొందరు ఉద్యోగులు గతంలో ఫేక్ రిజిస్ట్రేషన్ ఫార్మసీ సర్టిఫికెట్లు తయారు చేస్తూ పట్టుబడ్డారు. ఫార్మసీ రిజిస్ట్రేషన్‌కు ఫేక్ సర్టిఫికెట్లు విక్రయించి జైలుకు వెళ్లిన వారు కూడా ప్రస్తుతం ఈ కౌన్సిల్‌లో ఉద్యోగులుగా పని చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు ఉన్న కౌన్సిల్‌లో రేపు జరుగబోయే ఎన్నికలు సజావుగా జరుగుతాయనే నమ్మకం ఏముంది..? చిన్నపాటి రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కే అవకతవకలకు పాల్పడిన వారు, ఫేక్ బ్యాలెట్ పేర్లను తయారు చేసి ఎన్నికలను తప్పుదోవ పట్టించరనే గ్యారెంటీ ఏముంది..? ఫేక్ బ్యాలెట్ పేపర్లను విక్రయించి సొమ్ము చేసుకున్నా.. ఆశ్చర్యపోనక్కర్లేదు. ఎన్నికలకు ముందే సంబంధిత అధికారులు స్పందించి, గతంలో జరిగిన అవకతవకలపై ఆరా తీసి, ఈ ఎన్నికలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

7న నగరానికి కేటీఆర్


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికా పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ తిరిగి హైదరాబాద్‌కు రావటానికి ఇంకా రెండు మూడు రోజుల సమయం పడుతుందా..? అంటే అవుననే సమాధానమే ఆ పార్టీ వర్గాల నుంచి వస్తున్నది. బీఆర్ఎస్ తొలి జాబితా నేపథ్యంలో.. అలకలు, అసంతృప్తులకు దూరంగా ఉండేందుకే ఆయన గత నెల 19న అమెరికా ఫ్లయిటెక్కిన విషయం విదితమే. దీంతోపాటు పలు అధికారిక, కుటుంబ పనుల నిమిత్తం మంత్రి ఆ దేశంలో పర్యటించారు. ఈ క్రమంలో షెడ్యూల్ ప్రకారం ఆయన ఈనెల ఒకటిన హైదరాబాద్‌కు తిరిగి రావాల్సి ఉంది. కానీ రాలేదు. దీంతో రెండో తేదీన కేటీఆర్ తిరుగు ప్రయాణమవు తారనే వార్తలొచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఆయన బుధవారం రాత్రికి విమానమెక్కి..గురువారం ఉదయాని(ఈనెల7)కి హైదరాబాద్‌లో దిగనున్నారు. బీఆర్ఎస్ నుంచి టిక్కెట్లు ఆశించిన ఆయన సన్నిహితులు, స్నేహితులు మంత్రి రాక కోసం ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే.

సీట్లు ఇవ్వకుంటే కేటీఆర్‌ను ఓడిస్తాం

- సిరిసిల్లలో ముదిరాజుల భారీ ధర్నా



నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం చేసిన ముదిరాజులకు రానున్న ఎన్నికలోష్ఠు సరైన స్థానం కల్పించాలని ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కనీసం మూడు చోట్ల శాసనసభ టికెట్లు కేటాయించాలని, లేకుంటే సిరిసిల్లలో కేటీఆర్‌ను చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆదివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కళాశాల మైదానంలో ఐదువేల మందితో ముదిరాజులు మహాధర్నా నిర్వహించారు. కళాశాల మైదానం నుంచి నేతన్న చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్ మీదుగా ప్రదర్శన చేపట్టారు. భారీ వానలో తడుస్తూ ధర్నా, ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముదిరాజుల సంఘం జిల్లా అధ్యక్షులు రానవేని లక్ష్మణ్, కోర్ కమిటీ సభ్యులు పిట్టల భూమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60లక్షల మంది జనాభా ఉన్న ముదిరాజులకు శాసనసభ సీట్లు కేటాయించాలని కోరారు. అత్యధిక ముదిరాజ్ కులస్తుల జనాభా ఉన్న మునుగోడు, పఠాన్ చెరువు, సంగారెడ్డి అసెంబ్లీ స్థానాలను తమకు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహా ధర్నాలో వివిధ పార్టీలకు చెందిన ముదిరాజ్ నాయకులు రెడ్డవేని గోపి, రేగుల మల్లికార్జున్, చొక్కాల రాము, గొడుగు నరసయ్య, ఉత్తమ్ అంజయ్య పిట్ల రాము, గోపాల్, కీసరి నాగరాజు, తుపాకుల రవి, బోయిని చంద్రయ్య న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో 819 గ్రాముల బంగారం పట్టివేత



నవతెలంగాణ-శంషాబాద్

విదేశాల నుంచి అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబాయ్ నుంచి ఇండిగో విమానం 6ఈ1466లో ఓ ప్రయాణికుడు అక్రమంగా బంగారాన్ని తరలిస్తున్నాడు. అనుమానంతో అతన్ని అధికారులు తనిఖీ చేశారు. రూ.49.79 లక్షల విలువైన 819 గ్రాముల బంగారం గుర్తించారు. వెంటనే బంగారాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు.. నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.



తుమ్మలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించాం

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

నవతెలంగాణ-దమ్మపేట

కాంగ్రెస్ పార్టీలో తుమ్మల నాగేశ్వరరావు చేరిక లాంఛనమే అంటూ సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్న వాదనకు బలాన్ని చేకూర్చే విధంగా ఆదివారం మధిర ఎమ్మెల్యే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తుమ్మలను కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని తుమ్మల నాగేశ్వరరావు స్వగ్రామమైన గండుగలపల్లిలో అతని ఇంటి వద్ద భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల భట్టిని సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. అనంతరం ఇరువురు నేతలు సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తుమ్మలను కాంగ్రెస్ పార్టీలోకి రావాల్సిందిగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆహ్వానించారు. దీనిపై తుమ్మల స్పందిస్తూ తన అనుచరులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో చర్చలు జరిపిన అనంతరం తన నిర్ణయాన్ని వెల్లడిస్తానని భట్టికి తెలిపారు. ప్రజల పక్షాన పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయని భట్టి విక్రమార్క విలేకర్లకు తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, డాక్టర్ నరసింహారావు, అశ్వారావుపేట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బండి పుల్లారావు పాల్గొన్నారు.



నాణ్యమైన ఉత్పత్తులు వాడండి...
అధిక దిగుబడి సాధించండి

- నీటి పారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ డా. వేణుగోపాలచారి

నవతెలంగాణ - హైదరాబాద్ బ్యూరో

నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు వాడి అధిక దిగుబడి సాధించాలని రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ డా. సముద్రాల వేణుగోపాల చారి రైతులకు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ జరిగిన హార్మోనీ ఎకోటెక్ కంపెనీ అగ్రీ ఇన్పుట్స్ ప్రీ లాంచింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంలో నాణ్యమైన కొత్త ఉత్పత్తులు ఉపయోగించి రైతులు అధిక లాభాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్స్ నరసింహారావు తోలేటి, పెన్మత్స విజయవరసింహరాజు, ఐవీఎం స్వరూప్, పెన్మత్స హర్షవర్ధన్, నడింపల్లి శ్రీను,పెన్మెత్స శేఖర్ వర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంపెనీకి సంబంధించిన కొత్త, కొత్త ఉత్పత్తులను ఆయన ప్రారంభించారు. గత పదేళ్ళుగా హార్మోనీ ఇకో టెక్ హైదరాబాద్ కేంద్రంగా ఫిరోమొన్ లూర్లు, ఇన్సెక్ట్ ట్రాపులు తయారు చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నదని తెలిపారు. ఈ సంవత్సరం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఆపరేషన్స్ మొదలు పెట్టినట్టు కంపెనీ ప్రతినిధులు చెప్పారు. రైతుకు అవసరమైన అన్ని రకాల అగ్రి ఇన్పుట్స్ - మైక్రో న్యూట్రియెన్స్, నీటిలో కరిగే ఎరువులు, బయోఫర్టిలైజర్లు, బయో పెస్టిసైడ్లు, బయో స్టిమ్యులెంట్లు, గ్రోత్ ప్రమోటర్లు, హెర్బిసైడ్లు, ఫంగిసైడ్లు, ఇన్సెక్టి సైడ్లు లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కంపెనీలు మార్కెట్ లో వందలకొద్దీ ఉన్నప్పటికీ, ఆర్గానిక్, ఇనార్గానిక్, నాన్ కెమికల్, కెమికల్ ఇన్ పుట్స్ అన్నింటినీ ఒకే చోట రైతుకి ఒకే కంపెనీ అందుబాటులోకి తీసుకురావడమనేది చాలాఅరుదుగా ఉందన్నారు.. దీనివల్ల రైతుకు, డీలర్లకు కూడా చాలా సౌలభ్యంగా వుంటుందని తెలిపారు. వాటిని తయారుచేయడానికి, పరీక్షించడానికి శాస్త్రవేత్తలు, లాబొరేటరీ కూడా ఉన్నట్టు తెలిపారు. ఉత్పత్తులను పరీక్షించేందుకు పీహెచ్డీ, పీజీ చేసిన ప్రతిభావంతులతో ఐదెకరాల వ్యవసాయ క్షేత్రంలో ఆర్ అండ్ డీ డెమో ఫార్మ్ కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో డీలర్లు., కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోధనా వైద్యుల చలో హైదరాబాద్ : టీటీజీడీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బోధనా వైద్యుల డిమాండ్ల సాధన కోసం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీటీజీడీఏ) నిర్ణయించింది. ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో అన్ని మెడికల్ కాలేజీల బాధ్యుల రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం టీటీజీడీఏ నాయకులు డాక్టర్ జలగం తిరుపతిరావు ఒక ప్రకటన విడుదల చేశారు. చలో హైదరాబాద్ తేదీ, వేదిక నిర్ణయించి త్వరలోనే వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీకి తెలుపుతామని వెల్లడించారు. తమ సమస్యలను పరిష్కరించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు, ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినట్టు గుర్తుచేశారు. గతేడాది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. దీంతో అనివార్య పరిస్థితిలో మెజారిటీ సభ్యుల సూచన మేరకు చలో హైదరాబాద్ నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయకుమార్


మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

- బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం

నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యార్థుల మధ్య సఖ్యత పెంచాలని, ఉత్తమంగా మానవులు పరిమళించే సంస్కృతిని విద్యార్థుల్లో పెంచాలని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయకుమార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో 'ఉపాధ్యాయ దినోత్సవ వేళ ఆటపాటల మేళ'ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ జనాభాలో మూడో వంతు జనాభా బాల బాలికలు ఉన్నారని అన్నారు. భారతదేశంలో ప్రతిరోజూ సగటున 70 వేల మంది జన్మిస్తున్నారని, వారందరికీ విద్య బోధనలు చెప్పి విజ్ఞానవంతులుగా.. నేటి బాలలే రేపటి భవిష్యత్తుగా తీర్చిదిద్దే కార్యక్రమమే ఉపాధ్యాయ దినోత్సవ ఆటపాటల మేళా అన్నారు. కొన్ని విద్యాలయాల్లో విద్యార్థులకు విష బీజాలు నాటుతున్నారని, మతపరమైన, కుల ఆలోచనలు పసి హృదయాల్లో నాటుతూ వారిని కల్మషులుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాలయాలు విష వలయాలుగా మారకూడదన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మానవతా విలువలను, మేధో శక్తిని ఉపాధ్యాయులు పెంపొందించాలన్నారు. ఉపాధ్యాయుల్లో ఉన్న మేధో పరిజ్ఞానం, శాస్త్రీయ ఆలోచన, మానవీయ విలువలను వెలికి తీయడం కోసం విద్యావనాలు విజ్ఞాన నిలయాలుగా మారాలన్నారు. విద్యను ఒక శాస్త్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. పిల్లల్లో వైఫల్య బలం ఎదుర్కొనే మనస్తత్వాన్ని ఉపాధ్యాయులు బోధించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవ జనరల్ సెక్రెటరీ సోమయ్య, ఉపాధ్యక్షులు సుజావతి, సహాయ కార్యదర్శి మమత, సైన్స్ శాస్త్రవేత్త హరిబండి ప్రసాద్ రావు, జన విజ్ఞాన వేదిక కోయ వెంకటేశ్వర్, శాంతారావు, రమేష్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగానికే విరామం..ఉద్యమానికి కాదు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ- ఖమ్మం

గుత్తా సాంబశివరావు ఉద్యోగానికే విరామం ఇచ్చారని, ఉద్యమానికి కాదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గుత్తా సాంబశివరావు బీఎస్ఎన్ఎల్‌లో పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం ఖమ్మంలోని స్వర్ణ భారతి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళానికి తమ్మినేని హాజరై మాట్లాడారు. సాంబశివరావు కుటుంబం మొదటి నుంచి వామపక్ష భావజాలంతో ఉందన్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొంటూ దాన్ని ముందుకు తీసుకెళ్లడంలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ వామపక్ష భావంతోనే ముందుకు సాగారన్నారు. సాంబశివరావు ఉద్యోగ విరమణ చేశారే తప్ప ఉద్యమానికి కాదని, నమ్ముకున్న సిద్ధాంతం కోసం పనిచేయాలని, అదే విధంగా పెన్షనర్స్ తరపున కూడా పోరాటాలకు ముందుండాలని ఆకాంక్షించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. సాంబశివరావు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత ఉద్యమాల్లో పాల్గొనేందుకు వెసులుబాటు కలిగిందని అన్నారు. అష్టగుర్తి గ్రామంలో వారి కుటుంబం మొత్తం వామపక్ష భావజాలాలతోనే ఉందని తెలిపారు. సాంబశివరావు విద్యార్థి దశ నుండి ఎన్నో పోరాటాలు నిర్వహించారని అన్నారు. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సాంబశివరావు ఉద్యోగ సంఘం నాయకుడిగా నూటికి నూరు శాతం మార్కులు సంపాదించి, ఉద్యోగుల అభిమానం పొందిన వ్యక్తి సాంబశివరావు అన్నారు. ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశారని, ఎన్నో సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. సాంబశివరావు సతీమణి అలివేలు కూడా ఖమ్మం ఖానాపురం హవేలీ పరిధిలో మహిళా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని అన్నారు. ఇద్దరు కూడా భవిష్యత్తులో ప్రజల తరపున, ఉద్యోగులు, కార్మికులు పక్షాన నిలబడతారని ఆశిస్తున్నామన్నారు. నవతెలంగాణ అసిస్టెంట్ ఎడిటర్ వేణుమాధవ్ మాట్లాడుతూ.. సాంబశివరావు ఉద్యోగ విరమణ తప్ప ఏ సమస్యల పరిష్కారం కోసం అయితే పోరాడుతున్నారో దానికి విరమణ కాదని అన్నారు. భవిష్యత్‌లోనూ మరిన్ని పోరాటాలు చేస్తూ సాంబశివరావు, భార్య అలివేలు అందరికీ ఆదర్శప్రాయంగా ఉండాలని తన ఆకాంక్ష అని అన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఈయూ జె.సంపత్ రావు, ఈయూ ఆల్ ఇండియా నాయకులు పి..అశోక్‌బాబు, ఏబీడీపీఏ రాష్ట్ర అధ్యక్షులు బీఆర్ వీరస్వామి, కార్యదర్శి రామచంద్రుడు, ఏపీ కార్యదర్శి బోస్, సీసీడబ్ల్యూఎఫ్ తెలంగాణ కార్యదర్శి బి.పరిపూర్ణాచారి, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి ప్రభాకర్, సీసీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి.తిరుమలచారి, సాంబశివరావు సోదరుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేండ్లుగా ఉద్యోగం కోసం పోరాటం!

రిజిస్టర్‌లో సంతకం, వేతనమివ్వకుండా అధికారుల వివక్ష

- కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు
- ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనం, ఉద్యోగం కల్పించాలని నిరాహార దీక్ష

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో ఉన్న సీమాంధ్రుల కాలికి ముల్లు గుచ్చుకుంటే తాను పంటితో తీస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ అంటూ ఉంటే అధికారులు మాత్రం వారి పట్ల అక్కసు వెళ్లగక్కుతూ.. ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారు. సీమాంధ్ర ఉద్యోగి కావడం, అధికారులను ప్రశ్నించడమే దళిత కాంట్రాక్టు ఉద్యోగి పట్ల శాపంగా మారింది. ఉద్యోగం నుంచి తొమ్మిదేండ్లు పక్కన పెట్టడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. నాంపల్లిలోని ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్, హైకోర్టును ఆశ్రయించినా, రాష్ట్రంలోని ముఖ్య అధికారులు, మంత్రులకు, రాష్ట్రపతికి లేఖలు రాసినా అధికారులు మాత్రం అతన్ని ఉద్యోగంలోకి తీసుకోకుండా వివక్షకు గురిచేస్తున్నారు. ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ అప్పట్లోనే వేతనం చెల్లించాలని సూచించినా కమిషన్ సూచనలు అధికారులు పట్టించుకోలేదు. అతని తిరిగి ఉద్యోగంలో తీసుకునే ప్రసక్తే లేదనట్టుగా మల్లేపల్లి ఐటీఐ ఉన్నతాధికారుల వ్యవహార శైలి కనిపిస్తోంది.

నగరం నడిబోడ్డున ఉన్న మాసబ్ ట్యాంక్ విజయనగర కాలనీలోని ప్రభుత్వ పారిశ్రామిక సంస్థ ఐటీఐ కాలేజీ మల్లేపల్లిలో ఆగస్టు 1, 2008లో నూకతోటి పెద కొండయ్య(దళితుడు) అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్‌గా అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం సాధించారు. 2011లో ఆనాటి లేబర్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ సెక్రటరీ డాక్టర్ దాసరి శ్రీనివాసులు ఐఏఎస్ వీరిని అవుట్‌సోర్సింగ్ నుంచి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్స్‌గా మార్చారు. ఇలా కాంట్రాక్ట్ ద్వారా ప్రతేడాది రెన్యూవల్ చేస్తూ.. 2014 జూన్ 30 వరకు ఐటీఐ కాలేజీ ప్రిన్సిపల్ కొండయ్య జీతభత్యాలు ఇచ్చారు. జూన్ 2, 2014న తెలంగాణ ఏర్పాటు తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగుతున్న 320 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్స్(ఏటివో)ను జీ.ఓ.ఆర్.నెం 43, తేదీ 19 జులై 2014 ప్రకారం 01 జులై 2014 నుంచి 30 జూన్ 2015 వరకు కొనసాగిస్తామని అప్పట్లో తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం గవర్నమెంట్ ఐటీఐ కాలేజీ మల్లేపల్లిలో నూకతోటి పెద కొండయ్య విధులు నిర్వహించారు. తదుపరి సంవత్సరాల్లో ఏటీవోలను కొనసాగిస్తూ వస్తున్నారు.

తెలంగాణ ఏర్పాటు తర్వాత.. ఉమ్మడి రాష్ట్రంలో డిపార్టుమెంట్ ఆఫ్ లేబర్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్‌లో కొనసాగుతున్నటువంటి ఏటీవోలను కొనసాగించామని 1, జూన్ 2014న జీవో 13ను అప్పటి ప్రభుత్వ కార్యదర్శి నాగిరెడ్డి జారీ చేశారు. 2014 నుంచి 2015 వరకు 320 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్స్(ఏటివో)ను కొనసాగించామని జీవో నెం 43 జారీ చేయగా.. ఇందులో కేవలం లోకల్ కాంట్రాక్టు ఏటీవోలను అయిదుగురిని మాత్రమే గవర్నమెంట్ ఐటీఐ కాలేజీ మల్లేపల్లి అప్పటి ప్రిన్సిపాల్, ప్రస్తుత డిప్యూటీ డైరెక్టర్ అటెండెన్సు రిజిస్టర్‌లో సంతకాలు చేసేందుకు అనుమతి ఇచ్చి.. వారికి వేతనాలు చెల్లించారు. నలుగురు నాన్ లోకల్, కాంట్రాక్ట్ ఏటీవోలకు తెలంగాణ ఉత్తర్వుల ప్రకారం మార్గదర్శకాలను పాటించకుండా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయడానికి అనుమతి ఇవ్వలేదు. ఈ నలుగురిలో ప్రకాశం జిల్లాకు చెందిన నూకతోటి పెద కొండయ్య (వర్క్‌షాప్ క్యాల్‌క్యులేషన్ అండ్ వోకేషనల్ సైన్ (ట్రేడ్) కూడా ఉన్నారు. విద్యార్హతలు లేనివారు మరో నలుగురిని పక్కకు పెట్టారు. కాగా మొత్తం 13 మంది కాంట్రాక్టు ఏటీవోలకు సంవత్సరానికి సుమారు రూ. 15 లక్షల బడ్జెట్‌లో రూ.10 లక్షలు రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించారు. అయినప్పటికీ ఐటీఐ విద్యార్థులకు అకాడమీక్ ప్రకారం తరగతులు నిర్వహించారు. జీవో 43 ప్రకారం తరగతులు బోధించినా తమకు వేతనాలు ఇవ్వడం లేదని.. 2015లో ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించడంతో.. దాన్ని పరిశీలించిన కమిషన్ వెంటనే వేతనాలు చెల్లించాలని చెప్పినా పట్టించుకోలేదు. అదే ఏడాదిలో దీనిపై హైకోర్టు కూడా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి వేతనాలు చెల్లించాలని ఆదేశాలిచ్చింది. సదరు ఉత్తర్వులను అమలు చేయాలని ప్రిన్సిపాల్‌ను కోరగా.. 'నామీదనే నీవు కోర్టుకు వెళ్తావా! నీ జీవితాంతం మల్లేపల్లి ఐటీఐ నుంచి వేతనం గాని, నీ ఉద్యోగాన్ని కొనసాగించనని' నూకతోటి పెద కొండయ్యపై కోపోద్రుక్తుడైనాడు. జడ్జీ ఆర్డర్‌ను తిరస్కరించి.. కేవలం అందులోని ముగ్గురు నాన్-లోకల్ అభ్యర్థులకు వేతనాలు చెల్లించారు. అదే సంవత్సరంలో కోర్టు ధిక్కరణ కింద అప్పటి ప్రిన్సిపాల్‌పై కేసు కూడా నమోదు చేశారు. 2015 అక్టోబర్ నుంచి విద్యార్థులకు క్లాసులు బోధించకుండా కొండయ్యను అడ్డుకున్నారు. ఇందుకు అప్పటి విద్యార్థులే సాక్షులుగా ఆయన చెబుతున్నారు. కాగా, 2014-15, 2015-16, 2016-17, 2017-18, 2018-19, 2019-20, 2020-21, 2021-22, 2022-23 అనగా 9 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఏటీవోలలో నూకతోటి పెద కొండయ్య పేరు మీద కూడా బడ్జెట్ అలాట్‌మెంట్‌తో పాటు ఆయన పోస్టును తెలంగాణ ప్రభుత్వం కొనసాగించింది. అయినప్పటికీ మల్లేపల్లి ఐటీఐ కాలేజ్ ప్రిన్సిపాల్ తొమ్మిదేండ్లుగా అతనికి వేతనాలు చెల్లించడం లేదు. ఇప్పటికైనా అతనికి వేతనం ఇప్పించి, జీవనోపాధి కల్పించి, ఆదుకోగలరని విజ్ఞప్తి చేస్తున్నారు. నూకతోటి పెద కొండయ్య ఏపీకి చెందిన వాడనే కారణంగా కనీస మానవత్వం చూపకుండా మానసికంగా, దుర్మార్గంగా ఒక కాంట్రాక్టు ఉద్యోగం చేసుకోనివ్వకుండా డిపార్టుమెంట్ ఆఫ్ లేబర్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ప్రస్తుత డిప్యూటీ డైరెక్టర్ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు, మంత్రులు, రాష్ట్రపతికి వరకు వెళ్లి తన బాధను మొరపెట్టుకున్నా.. వాటిని అడ్డుకుంటూ తనపైనే లేనిపోని నిందలు మోపుతున్నాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఒకవైపు తల్లిదండ్రులను కోల్పోయి.. తమ్ముడిని కోల్పోయి... 49 ఏండ్ల వయసులో తొమ్మిదేండ్లుగా సుదీర్ఘమైన పోరాటం చేస్తూ.. ఒంటిరివాడి జీవనం సాగిస్తూ.. చేతిలో డబ్బులేక ఆర్థికంగా మానసిక, శారీరక ఇబ్బందులకు గురవుతున్నానని తెలిపారు. కాగా, మల్లేపల్లి ఐటీఐ కాలేజీ ఎదుట వారం రోజులుగా నిరహార దీక్ష చేస్తున్నారు. తన ప్రాణాలు పోయిన పర్వాలేదు కానీ.. న్యాయం కావాలని కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోసం ప్రస్తుత డిప్యూటీ డైరెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



హాయ్ మామ... మా చల్లని చందమామ

అమ్మ గోరుముద్దలు పెడుతూ
మామ వస్తాడు కొండెక్కి వస్తాడు
నీకు బహుమానం తెస్తాడు
అని అన్నం పెడితే
మా ఎదుగుదలకు మా కంటి నిద్రకు
నీవు కారణమయ్యావు జాబిలి

ఈరోజు ప్రపంచం ముందు
మా నూట నలభై కోట్ల ప్రజల
విజ్ఞాన వికాసాన్ని
మా జ్ఞాన పరిమళాన్ని మా ప్రజ్ఞను
ప్రపంచానికి చూపించుటకు
నీవు మా విజ్ఞాన కాంతివయ్యావు

ఓ వెలుగు వెన్నెల
ఓ చల్లని జాబిలి
నువ్వు రాక
మా కల కల గాక
మేము నిన్ను మరవక
చంద్రయాన్ 3 ప్రయోగంతో
మా ఇస్రోతో విశ్వాన్ని చుట్టి
మా ల్యాండర్ విక్రంతో ల్యాండ్ అయ్యి
విజయం పొంది
మా అమ్మల కలలను నిజము చేసి
జాబిలిపై మా జాడలు
ప్రపంచానికే మా విజ్ఞాన రేఖలుగా చూపుతూ
మా ర్యాడర్ ప్రగ్యాన్ అస్త్రంతో
నీతో పోరుచేసి
నిన్ను శోధించి
నీ విలువను ప్రపంచానికి చూపుతూ
మా జ్ఞాన తత్వమును
మా ఘనతను చాటుతాము

మామ ఓ చందమామ
మేము నీపై ఉన్నంతవరకు
మమ్మల్ని ఓడించేవారు లేరు మామ
నీతో మా ప్రయాణం
మా భారత జాతికి గర్వకారణం
ప్రపంచానికే మా దేశం ఆదర్శం
మా శాస్త్రవేత్తల ప్రజ్ఞకు
ప్రపంచమంతా చెందెను విస్మయము
మా భారత జాతి కీర్తి నింగికెగిసెను
మా కల సాకారమయ్యెను
జయహో భారత్ ...విజయహో భారత్

- తెలుగు తిరుమలేష్ (సవ్వడి),
9908910398

చిమ్నీలు

1
మనసులో అదుపు
మాటలలో పొదుపు
చేతలలో మెరుపు
చేకూర్చును గెలుపు!!

2
అంతర్ముఖానికి...
ముసుగేసి అందలము
తెలుసు మనస్సాక్షికి
ఆ బతుకు వ్యర్థము !!

3
అలలకు అలుపు లేదు
తీరం చేరకున్న..
తలపులకలుపు లేదు
ఎప్పుడు తలుచుకున్న !!

4
దిగంతమనె ఇరుసుకు
ఇరువైపులిద్దరము
చక్రాల్ల కాలముకు
పగలు-రేయిగ మనము!!

5
జన్మనిచ్చిన మాత
మొదటి దైవము
నడత నేర్పిన పిత
గురువుతో సమానము!!

6
భరించేది ఆలి
బతుకునిచ్చెది ఆలి
చెలిమినిచ్చెది ఆలి
చేరదీసెది ఆలి !!

7
భావోద్వేగాలు
రాగద్వేషాలు
ఈర్ష్య-అసూయలు
వీడు... స్థితప్రజ్ఞులు !!

8
శరీర కదలికల
వ్యాయామముగ
మేధ, ఆత్మశక్తిల
కలయిక యోగ !!

9
భక్తి మనసులో...
రక్తి మాటలలో...
యుక్తి చేతలలో...
ముక్తి బతుకులో !!

10
ఓటు అంటే మనసు
లొంగకు 'తాయిలా' కు
తెలివిగవాడు త్రాసు...
మంచిది నీ భవితకు !

- న్యాలకంటి నారాయణ,
9550833490

ఇన్సానియత్ కో జగావో... ఉర్దూ ఫెస్ట్ 2023





ఇద్దరు మనుషులు కలుసుకున్నప్పుడు ఏం... మాట్లాడుకుంటారు...?! సంసార బాధలు, సుఖాలు, సమాజ పోకడలు.... ఎన్నో... అలాగే ఇద్దరు కవులు కలుసుకున్నప్పుడు కూడా అంతే.... ముచ్చట్లు.... అవే ముచ్చట్లు... కుదిరితే రెండు కవితలు...

ఏ భాష కవులు అయినా అలాగే... యాదృచ్ఛికంగా కలుసుకుంటే ఆ షార్ట్ టైంలోనే ప్రపంచాన్ని చుట్టేసినంత సంబరపడతారు. అలాంటిది అందరూ అనుకుని ఒకచోట చేరితే.., ఇంకేమీ.. ముచ్చట్లకు అవధులు ఉండవు. అలాంటి ప్రయత్నమే తెలంగాణ సాహితి ఉర్దూ ఫెస్ట్- 2023. ఆగస్టు 25న మఖ్దూం వర్థంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి యాభైకి పైగా షాయర్లు పాల్గొని మఖ్దూం యాదిలో ఈ ఫెస్ట్‌ని జరుపుకున్నారు. అరబిక్, సంస్కృతం, ఫార్సీ, హిందీ, మరికొన్ని భారతీయ భాషలతో కలుపుకొని అంతర్జాతీయ భాషగా ఒక కమ్మని, ఓ తీయని భాషగా ఉర్దూ వెలిగొందిందని భాషావేత్తలు కొనియాడారు.

తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ఫెస్ట్ ప్రారంభ సభలో దక్కని ఉర్దూ గోల్కొండలోనే పుట్టి ప్రత్యేకమైన మాండలికంలో తన స్థానాన్ని పదిలపరుచుకున్నది. తెలంగాణ ఉర్దూలో మొదటి కవితని రాసింది కులీఖుతుబ్‌షా. అతను గొప్ప ఉర్దూ భాషా పండితుడని ప్రముఖ కవి, భాషావేత్త అయిన ఏనుగు నరసింహారెడ్డి తెలియజేశారు.

ఉర్దూ అందరి భాష, భారతదేశంలో పుట్టిన భాష, మాండలికలు ఉన్నప్పటికీ దక్కని ఉర్దూ ప్రజల భాషగా నిలిచిందన్న అభిప్రాయం ఫెస్టు వ్యక్తపరిచింది. మఖ్దూం మొహియుద్దీన్ వర్థంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ ఫెస్ట్ గంగా, జమున తహజీబ్‌ను సాహిత్యంలో కొనసాగిస్తుందని ప్రముఖ కవి యాకూబ్ కొనియాడారు. మఖ్దూం మొహియుద్దీన్ జీవితాన్ని, సాహిత్యాన్ని, ఆశయాలను, ఆదర్శాలను స్మరించుకుంటూ జమీలా నిషాత్, డాక్టర్ రవూఫ్ ఖైర్‌లు తమ సందేశాలు ఇచ్చారు. మఖ్దూం నాటకకర్తగా, నటుడిగా, ప్రజాకవిగా, నాటి నిజాం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కార్మిక నాయకుడిగా, చిరస్థాయిని నిలుపుకున్నారు. ఉర్దూ సాహిత్యం నేడు ఆ దిశగా పయనించాలని వక్తలు పునరుద్ఘాటించారు. ప్రజల వైపు నుండి కలాన్ని నిలబెట్టడంలో, గళాన్ని విప్పడంలో ఏ చిన్న అవకాశాన్ని కూడా మఖ్దూం వదులుకోలేదనేది వాస్తవం. అందుకే జైలు జీవితాన్ని అనుభవించాడు. దాశరథి, పీవీ నరసింహారావు, బూర్గుల రామకృష్ణారావు, కాళోజి వంటి మహారథులు ఉర్దూ సాహిత్యంలో కృషి చేశారు. ఇది సత్యం. తెలంగాణ సాహితి ప్రతి ఏటా జరుపుతున్న లిటరరీ ఫెస్టుల్లో భాగంగా నిర్వహించిన ఈ ఉర్దూ ఫెస్ట్ ఐదవది. "అన్నదమ్ముల వలెను జాతులు మతములన్ని మెలగవలెను" నినాదంతో ఈ ఫెస్ట్‌ని మొదటిసారిగా నిర్వహించి ముందుకు తీసుకెళ్లాలని సంస్థ భావిస్తుందని, ఫెస్ట్ ఉద్దేశాలు, సంస్థ ప్రధాన కార్యదర్శి ఆనందాచారి, అధ్యక్షులు వల్లభాపురం జనార్ధన తెలియజేశారు.

"నఫ్రత్ కి ఆగ్ మే
ఇన్సానియత్ జల్ రహా హై
ఇన్సాన్ కో జగావో...
ఇన్సాన్ కో జగావో..."

కొన్ని వాహ్... వాహ్ లు మరికొన్ని కంటి తూడుపులు... ప్యార్, దిల్, ఖుషి, గమ్, బహెక్ తే నదియాన్, చమక్ తే సీతారే... ఏక్ దూస్ రేక సహారా, భాయ్ చారా, అమన్, చమన్, అంశాల పై షాయరీలు, గజల్లు అలరించాయి.

ప్రముఖ కవి, అనువాదకులు, ఫెస్ట్ కన్వీనర్ మహమ్మద్ అబ్దుల్ రషీద్ సూచనలు, సలహాలు, మార్గదర్శిలో ఉర్దూ సాహిత్య సమ్మేళనం గొప్పగా సాగింది.

సయ్యద్ రియాజ్ తన్హ ఈ ఫెస్ట్‌కు హోస్ట్‌గా వ్యవహరించి, ముషాయిరాను అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. డాక్టర్ మోత్కూరి నరహరి, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్, తెలంగాణ సాహితి నాయకులు షేక్ సలీమా, వహీద్ ఖాన్, నస్రీన్ ఖాన్ , ఖాజమైనుద్దీన్, తంగిరాల చక్రవర్తి, మోహన కృష్ణ, మేగోటి రేఖా , ముజాహిద్‌లు నిర్వాహకులుగా వ్యవహరించారు. సయ్యద్ నవీద్, అబూ నబిల్ ఖాజా మసిఉద్దీన్, మిన్హాజ్ అహ్మద్ ఖాన్, అత్యబ్ ఎజాజ్, నవీద్ జాఫరీ, బెలం నిజాది, ఆరిఫ్ మసూద్ సిద్ధికీ, తన్వీర్ రజాకీ, డా.నయీమ్ వంటి సీనియర్ షాయర్లు, అబ్బాస్, ఫర్హాన్, యువ షాయర్లతో పాటు ప్రముఖ షాయర్లు మూడు షెషన్లుగా ముషాయరాలో పాల్గొన్నారు. హిమ్మత్ అఫ్జాహిని శాలువాలతో మోసుకెళ్ళుతూ ఫెస్ట్ ముగిసింది.

- వహీద్ ఖాన్, 9441946909

ఇది అందరి భాష



ఉర్దూ సాహిత్యంలో అనేక ప్రక్రియలు ఉన్నాయి. గజల్, రుబాయి, నజమ్, షాయరీ మొ॥. నేను రుబాయిలు రాయడానికి ఉర్దూలో ఉన్న రుబాయి పక్రియ చాలా ఆకర్షించింది. మత్తు లొలికించే, మైమరిపించే తన్మయత్వం చెందించే షాయరీలు ఉర్దూలో చాలా వున్నాయి. సినారె గజల్ అద్భుతంగా రాయడానికి ఉర్దూ గజల్లే కారణం. ఉర్దూ కేవలం ముస్లింల భాష కాదు ఇది అందరి భాష.

- ఏనుగు నరసింహా రెడ్డి
(ప్రముఖ తెలుగు కవి, రచయిత, వ్యక్తిగత కార్యదర్శి లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్, తెలంగాణ)

వారి స్ఫూర్తితోనే...



మఖ్దూం మొహియుద్దీన్ మా కుటుంబానికి సన్నిహితులు. వారి ఇంతెఖాల్ అప్పుడు నాది చిన్న వయస్సు. మా ఇంట్లో అందరూ విచారంలో మునిగారు. నాన్న దగ్గరకు తరచూ వస్తూ వుండే వారు. షాయిరీలు, కార్మికుల సమస్యలు, చర్చిస్తుండేవారు. నాన్న, మఖ్దూం స్ఫూర్తి నన్ను ఒక సమాజ సేవకురాలిగా చేసింది. షాయిరీలు రాయడం, రాయించడం, తర్ఫీదు ఇవ్వడం, ఉర్దూ భాష పెంపొందుటకు కార్యక్రమాలు నిర్వహించడం వారి ద్వారానే నేర్చుకున్నాను.

- జమీలా నిషాత్, ప్రముఖ ఉర్దూ కవయిత్రి

నిధులు కేటాయించాలి



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉర్దూకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. కాని రెండవ అధికార భాషగా కేవలం కార్యాలయాల బోర్డులపై మాత్రమే కనిపిస్తుంది. ఉర్దూ అకాడమీ ఏర్పాటు చేశారు కానీ నిధులు ఇవ్వడం లేదు. అకాడమీ పనులు ఎలా జరుగు తాయి. ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలు లేవు. దాని వల్ల విద్యార్థులకు ఉర్దూపై ఇష్టం ఉండటం లేదు. ఉర్దూ అందరి భాష. తగినన్ని నిధులను కేటాయించి ఉర్దూ ఘర్‌లను ఏర్పాటు చేస్తే కాని ఉర్దూ అభివృద్ధి కాదు. ఉర్దూ నేర్చుకున్న వారికి ఉపాధి లభిస్తే ఉర్దూ సజీవంగా ఉంటుంది.

- అబ్బాస్
ఆవాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మరింత విస్తృతంగా...

తెలుగు సాహిత్యం, తెలుగు భాష, కవులు, రచయి తలు, తెలుగు పాట, కాన్సెప్ట్‌లతో తెలంగాణ సాహితి తరపున ఫెస్ట్‌లను నిర్వహించాం. తెలంగాణ, ఉర్దూ సాహిత్యానికి కూడా పేరుగాంచింది. మన దగ్గర అపాం˘మైన ఉర్దూ సాహిత్యం ఉన్నది. హైద్రాబాద్ ఉర్దూ సాహి త్యానికి కేంద్రం. ఉర్దూ ఫెస్ట్‌ను నిర్వహిద్దామని తెలంగాణ సాహితి కమిటీ నిర్ణయం చేసింది. రాబోయేకాలంలో ఉర్దూఫెస్ట్‌ను విస్తృతంగా నిర్వహించుకుందాం. తెలుగు, ఉర్దూ సాహిత్య పండుగలు జరగాలి.

- కె. ఆనందాచారి
తెలంగాణ సాహితి రాష్ట్ర కార్యదర్శి

వారి బాటలోనే...



ఉర్దూ యువ కవులంటే మఖ్దూంకి చాలా ఇష్టం. వారి షాయరీల్లో చైతన్యం కలిగించే పదాలను వెతికేవారు. సరిదిద్దేవారు. ప్రోత్సహించేవారు. నా షాయారీని విని భుజం తట్టి చెప్పారు. "బహుత్ ఖూబ్ ..." వారి బాటలోనే షాయారీ రాస్తున్నాను.

- డా. రవూఫ్ ఖైర్
పార్శి, ఉర్దూ భాష వేత్త

ఆచరణకు బలం వస్తుంది



నేను... తెలుగు చదువుతాను, రాస్తాను, తెలుగు కవులకు శిక్షణ ఇస్తాను. కాని ఉర్దూలో రాయలేదు. తెలుగు, ఉర్దూ కవుల సమ్మేళనం జరగాలి. ఇద్దరి ప్రక్రియల, పద బంధాల నిర్మాణం, సంస్కృతుల అలాయి బలాయి అవుతుంది. దీనితో గంగ, జమున తహజీబ్ ఆచరణకు బలం వస్తుంది. ఇది సమాజ నిర్మాణానికి అవసరం.

- యాకూబ్, ప్రముఖ కవి రచయిత

నివాళి
స్థానికతను చాటిన ప్రపంచ కవి



జయంత మహాపాత్ర ఒరిస్సాలోని కటక్‌లో దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి, భౌతిక శాస్త్రం చదువుకుని అనేక ప్రభుత్వ కళాశాలల్లో మూడున్నర దశాబ్దాలకుపైగా దాన్నే బోధించాడు. ఆలస్యంగా, తన 38వ ఏట అభౌతిక కవిత్వం వైపు దృష్టి మరల్చాడు. 40వ ఏట అతని కవిత్వం తొలిసారిగా వెలువడింది. ఆ తర్వాత 27 సంపుటాలుగా వెల్లువెత్తింది. 'రిలేషన్‌షిప్' దీర్ఘ కవితకు 1981లో సాహిత్య అకాడమీ అవార్డు పొంది, ఇంగ్లీషు భాషా విభాగంలో ఆ బహుమతి సొంతం చేసుకున్న తొలి భారతీయుడిగా నిలిచాడు. (2009లో పద్మశ్రీ వచ్చినప్పటికీ దేశంలో చెలరేగుతున్న అసహనానికి నిరసనగా 2015లో తిరిగి ఇచ్చేశాడు.) ఎ.కె.రామానుజన్, ఆర్.పార్థసారథిలతో కలిసి భారతీయ ఆంగ్ల కవిత్వానికి పునాదులు వేసిన మహాకవి జయంత మహాపాత్ర తన 94వ ఏట మరో లోకంలోని నదులతో ఏకాంత జ్ఞాపకాలను కలబోసుకోవడానికి తరలిపోయారు. వాల్ట్ విట్మన్, రవీంద్రనాథ్ టాగూర్ సహా ఎవరి కవిత్వాన్నీ పెద్దగా చదవకపోయినా, ఒరియా సామాజిక, సాంస్కృతిక జీవితంలోని సామాన్యుల భావోద్వేగాలతో పెనవేసుకున్న ఆయన కవిత్వం స్వచ్ఛమైన స్థానీయతను ప్రపపంచానికి చాటిచెప్పింది.

- దేశరాజు, 9948680009


ఆకలి

నా వెన్నుపై ఇంత మదపు భారముందని
నమ్మడం చాలా కష్టం
చేపలవాడు అన్నాడు : ఆమె కావాలా, నిర్లక్ష్యంగా-
తన వలలనీ, నరాలనీ కూడదీసుకుంటూ.
అలాగే అతడి మాటలు..
తనకు తాను ఎదుర్కొంటున్న సందర్భానికి
పవిత్రతను చేకూర్చేందుకు యత్నిస్తున్నాయి
తెల్లని ఎముక అతడి కళ్లలో గిర్రున తిరగడం చూశా
విశాలమైన ఇసుక తిన్నెల మీదుగా అతడిని
అనుసరించా
నా మనసు మాంసపు జోలెలో ఓలలాడుతోంది
బహుశా, నేను నివసించిన ఇంట్లో ఆశను
తగులబెట్టేయొచ్చు.
నిశ్శబ్దం నా భుజాలను చుట్టుకుందిబీ
నురుగు వద్ద శరీరం పంజాలా వంగింది.
సముద్రం నుంచి కేవలం అతడి పాత వలలే
బయటపడ్డాయి
మినుకుమినుకుమనే చీకటిలో
అతడి గుడిసె గాయంలా తెరుచుకుంది
కొన్ని పగళ్లు, రాత్రుల ముందటి గాలిని నేనే
తాటాకులు నా చర్మానికి గీరుకున్నాయి
గుడిసె లోపల నూనె దీపం వేళ్లుసాచి
గంటల తరబడి గోడలను కమ్ముకుంటోంది
అంటుకున్న మసి నా మెదడులోని డొల్లతనాన్ని
అధిగమిస్తోంది
అతడు చెప్పడం విన్నా : నా కూతురు, కేవలం
పదిహేనేళ్లే.
దాన్ని అనుభవించండి, నేను కాసేపట్లో మళ్లీ వస్తా.
మీ బస్సు తొమ్మిదిగంటలకు బయల్దేరుతుంది
నాపై ఆకాశం విరిగిపడింది, ఒక తండ్రి అసహాయపు
కుతంత్రం కూడా.
పొడవైన, సన్నని ఆమె వయసు రబ్బర్లా చల్లగా
వుంది
ఆమె పుల్లల్లాంటి తన కాళ్లను వెడల్పు చేసింది
నేను అక్కడ ఆకలిని గ్రహించాను,
మరోవైపు చేప జారి, లోపల తిరుగుతోంది.

ఇంగ్లీషు : **జయంత మహాపాత్ర**
తెలుగు : **దేశరాజు**

బాలికల తొలి కవితా సంకలనం
'కొత్త కలాలు'

బాలల మానసిక వికాసానికి తోడ్పడే చక్కని బాల సాహిత్యాన్ని అందించాల్సిన బాధ్యత ప్రధానంగా కుటుంబం, పరిసరాలు, ఉపాధ్యాయులతో పాటు బాల సాహిత్యకారుల మీద ఎంతో ఉంది. ఏ దేశమైతే బాలల్ని, వారి సాహిత్యాన్ని నిర్లక్ష్యం చేస్తుందో, ఆ దేశం ఆ జాతి అభివృద్ధిని ఊహించలేం. రేపటి తరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే మహత్తరశక్తి బాల సాహిత్యానికి ఉంది. పిల్లల్లో జ్ఞాన పిపాస ఎక్కువగా ఉంటుంది. వినాలని, తెలుసుకోవాలని, ఏదో చేయాలని, గుర్తించ బడాలని రకరకాల ఆసక్తులు ఉంటాయి. ముఖ్యంగా పిల్లల్లో అనుకరణ గుణం ఎక్కువగా ఉంటుంది.



బాల్యం అమూల్యమైనది. అట్టి బాల్యానికి భరోసాని ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నది. ఆటలు, పాటలు, మాటలు ఇలా వినూత్నమైన కార్యక్రమాల ద్వారా బాలలను ప్రోత్సహించాలి. అందులో భాగంగా బాలల వికాసానికి దోహదపడేది బాలసాహిత్యం. అందులో భాగంగానే పిల్లలను ప్రోత్సహిస్తూ వారిలో సృజనాత్మకతను వెన్ను తట్టి వారి ప్రతిభను వెలికి తీసే ప్రయత్నం చేశారు సిద్దిపేట జిల్లా దుబ్బాక బాలికోన్నత తెలుగు ఉపాధ్యాయిని శివునూరి లతా కృష్ణ. కేవలం బాలికల చేత 82 కవితలు రాయించి ఒక దగ్గరకు చేర్చి "కొత్త కలాలు" పేరుతో తొలి కవితా సంకలనం వెలువరించారు .

"మనిషికి ఉండాలి మంచితనం
తెస్తుంది అది గొప్పతనం
అందరికీ ఉండాలి విద్యా ధనం" అంటూ మంచితనం గురించి చిన్నారి విజయశ్రీ "నిండుదనం" కవితలలో చక్కగా వివరించింది.

ఓటమి మలుపు
గెలుపును కలుపు
గురువుల తెలుపు
మన మేలుకొలుపు అంటూ చిన్నారి మానస "మేల్కొలుపు" కవితను చక్కగా రాసింది.


చదువుల తల్లి రావమ్మా
చదువును మాకు ఇవ్వమ్మా
జ్ఞానం నాకు ఇవ్వమ్మా అంటూ అఖిల "చదువుల తల్లిని" స్తుతించింది.

తెలుగులోని మాటలు
బంగారు మాటలు అంటూ తెలుగు గొప్పతనాన్ని కే అశ్విత తెలియజేసింది.

నల్లని రంగులో మిల మిల మెరుస్తూ
తెల్లని అక్షరాలతో చెరిపేసి
విషయాలను వివరించే
ఉపాధ్యాయుల అస్త్రం అని నల్లబల్ల గురించి స్రవంతి తన "నల్లబల్ల" కవితలో చక్కగా ఆవిష్కరించింది.

దేశ సరిహద్దుల్లో జవాన్
ఊరి పొలిమేరలో కిసాన్
బ్రతుకు నిచ్చేది జవాన్
మెతుకు నిచ్చేది కిసాన్ "జై జవాన్ జై కిసాన్" లో వర్షారెడ్డి చక్కగా సైనికుడు, రైతు గురించి తెలియజేసే ప్రయత్నం చేసింది.

ఇలా చెప్పుకుంటూపోతే ప్రతి కవిత ఒక ఆణిముత్యం లాంటిది. చిన్న కవితలైన కూడా చక్కటి సందేశాన్ని చిన్నారి విద్యార్థులు తెలియ జెప్పే ప్రయత్నం చేశారు ఇప్పుడే సాహిత్యంలోకి వస్తున్నారు కాబట్టి ఇక ముందు ముందు మంచి కవితలు ఎన్నో రాయాలని చిన్నారులను అభినందిస్తూ, వారికి ఆశీస్సులు. అలాగే వారిని నిత్యం వెన్నంటి ఇలాగే మరెన్నో కవితలు రాసే విధంగా లలితకృష్ణ ప్రోత్సహించాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేద్దాం.



- యాదవరం చంద్రకాంత్ గౌడ్
9441762105

ఫీచర సునీతారావు సాహిత్య పురస్కారాలకు
కథలు, కవితలు, విమర్శలు ఆహ్వానం

ఫీచర సునీతారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీచర సునీతారావు పేరుతో పురస్కారాలు అందించనున్నారు. ఇందుకు కవిత్వం, కథలు, విమర్శ అనే మూడు సాహిత్య విభాగాల నుంచి సంపుటులను ఆహ్వానిస్తున్నారు. మార్చి 2020 నుంచి మార్చి 2023 వరకు వెలువడిన రచనలే పంపించాలి. ఎంపికైన ప్రతి సంపుటానికి రూ.15,000/- పురస్కారం అందివ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు అక్టోబర్ 15 లోగా ఫీచర సునీతారావు ఫౌండేషన్, కేర్ ఆఫ్ విజయేందర్ రావు, ప్లాట్ నం. 505, బ్లాక్ -డి, భీమా ప్రైడ్ అపార్ట్‌మెంట్స్, సుచిత్ర సర్కిల్ దగ్గర, జీడిమెట్ల, హైదరాబాద్- 67, తెలంగాణ చిరునామాకు పంపాలి. వివరాలకు 9866043441, 9848698699 నంబర్ల నందు సంప్రదించవచ్చు.

పెందోట బాల సాహిత్య పీఠం
పురస్కారాల విజేతలు

సాహితీ వార్తలు

పెందోట బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన బాల సాహిత్య పురస్కారాల ఫలితాలు వెల్లడించారు. విశిష్ఠ పురస్కారాల విభాగంలో డాక్టర్ వాసరవేణి పరుశరామ్ (సిరిసిల్ల జిల్లా), మంగళంపల్లి రామచంద్రమూర్తి (చేర్యాల); పురస్కారాల విభాగంలో శైలజ మిత్రా (హైదరాబాద్ జిల్లా), డాక్టర్ బి.సుధాకర్ (సిద్దిపేట జిల్లా), దారం గంగాధర్ (నిజామాబాద్ జిల్లా), పటరాయుడు కాశీ విశ్వనాథం (విజయ నగరం జిల్లా), బాలకవి పురస్కారాల విభాగంలో వేల్పుల శ్రీలత (రపెద్దపల్లి జిల్లా), చంద్రశేఖర్ (అనంతపురం జిల్లా) కు ఎంపికయ్యారు. ఈ నెల 9 శనివారం నాడు సిద్దిపేటలో నిర్వహించే కార్యక్రమంలో బాల సాహిత్య పురస్కారాలను అందివ్వనున్నారు.

- పెందోట వెంకటేశ్వర్లు

9న 'వెలుగు సంతకం' ఆవిష్కరణ

కోట్ల వెంకటేశ్వరరెడ్డి కవితా సంపుటి 'వెలుగు సంతకం' తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఎస్ఎస్ఆర్ పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న శనివారం సాయంత్రం 5 గంటలకు వనపర్తిలోని కేడీఆర్ నగర్, ఎంవైఎస్ బాంకెట్ హాల్‌లో నిర్వహించనున్నారు. విశ్రాంత ఉపన్యాసకులు డా. వీరయ్య అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వ్యవసాయ మార్కెటింగ్ సహకార శాఖామాత్యులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరు కానున్నారు.

498-ఏని దుర్వినియోగం చేస్తున్నారట

- మహిళలపై న్యాయస్థానాల వ్యాఖ్యలు
- తప్పుడు ఆరోపణల కేసులు తక్కువేనంటున్న ఎన్‌సీఆర్‌బీ
- ఇప్పటికీ గృహిణులకు అదే సెక్షన్ కింద రక్షణ



న్యూఢిల్లీ : భర్త లేదా అతని తరపు బంధువులు వేధింపులకు పాల్పడుతున్నారంటూ కొందరు మహిళలు తప్పుడు కేసులు పెడుతున్నప్పటికీ వారికి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన ఐపీసీ 498-ఏ సెక్షన్‌కు ఉన్న ప్రాధాన్యత విస్మరించరానిది. ఇటీవలి కాలంలో ఐపీసీ సెక్షన్ 498-ఏ దుర్వినియోగంపై న్యాయస్థానాలు విచారం వ్యక్తం చేస్తూనే మహిళలకు వ్యతిరేకంగా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నాయి. దీనిపై మహిళా హక్కుల కోసం పోరాడుతున్న సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు లేఖ కూడా రాశారు. సమస్యను సార్వత్రికం చేస్తూ కొందరు న్యాయ మూర్తులు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. ఐపీసీ 498-ఏ సెక్షన్‌ను ఆధారంగా చేసుకొని ఓ మహిళ దాఖలు చేసిన కేసులో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ షుబేందు సామంత్ చేసిన వ్యాఖ్యలను ఇందిరా జైసింగ్ ఆ లేఖలో ప్రస్తావించారు. ఇంతకీ సామంత్ ఏమన్నారంటే...మహిళలు ఆ సెక్షన్‌ను దుర్వినియోగం చేస్తూ చట్టపరంగా అత్తింటి వారిని భయపెడుతున్నారట.

తప్పుడు కేసులు తక్కువే

జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక-2021 ప్రకారం మహిళలపై నేరాలకు సంబంధించి 4,28,278 కేసులు నమోదు కాగా వాటిలో 1,36,234 కేసులు (33%) సెక్షన్ 498-ఏకు సంబంధించినవే. వీటిలో కేవలం 6,938 మాత్రమే తప్పుడు కేసులని పోలీసుల విచారణలో తేలింది. అంటే నమోదైన కేసులలో తప్పుడు కేసులని తేలినవి చాలా తక్కువ. తాజాగా జరిపిన కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5) ప్రకారం దేశంలో 18-49 సంవత్సరాల మధ్య వయసున్న మహిళల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు భర్త చేతిలో ఏదో ఒక రూపంలో అవమానాలకు గురవుతున్నారు. వివాహిత మహిళల్లో 32% మంది భర్త నుండి వేధింపులు ఎదుర్కొంటున్నారు.

కఠిన నిబంధనలు

భార్య పట్ల అమానుష ప్రవర్తన, వరకట్న సంబంధమైన మరణాలు వంటి ఘటనలు పెరగడంతో 1983లో ఐపీసీలో 498-ఏ సెక్షన్‌ను చేర్చారు. 2005లో గృహ హింస చట్టం అమలులోకి వచ్చే వరకూ ఈ సెక్షనే మెట్టింటి వారి వేధింపుల నుంచి మహిళలకు రక్షణ కల్పించింది. ఈ సెక్షన్ కింద కేసు పెడితే నిందితుడికి బెయిల్ లభించదు. వారెంట్ లేకుండానే పోలీసులు అరెస్ట్ చేయవచ్చు. భర్త లేదా అతని బంధువులు మహిళను వేధించినట్లు రుజువైతే మూడు సంవత్సరాల కారాగార శిక్ష పడుతుంది. వరకట్న వేధింపుల నుంచి కాకుండా అమానుష చర్యల నుండి కూడా ఈ సెక్షన్ మహిళను కాపాడుతోంది. ఇలాంటి సెక్షన్ దుర్వినియోగం కాకుండా చూడడానికి గత కొన్ని సంవత్సరాలుగా న్యాయస్థానాలు అనేక ఆదేశాలు జారీ చేశాయి. అయితే ఈ ఆదేశాలు చట్టం యొక్క ప్రాధాన్యతను ఏ మాత్రం తగ్గించలేదు.

దుర్వినియోగంపై వ్యాఖ్యలు

సెక్షన్ 498-ఏ దుర్వినియోగంపై కొన్ని న్యాయస్థానాలు చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తే... ఈ సెక్షన్‌ను దుర్వినియోగం చేయడం ద్వారా మహిళలు చట్టపరంగా మెట్టింటి వారిని భయపెడుతున్నారని కలకత్తా హైకోర్టు తెలిపింది. భర్త బంధువులు వారితో కలసి నివసించకపోయినప్పటికీ ఇలాంటి అనేక కేసులలో వారిని కూడా నిందితులుగా చేరుస్తున్నారని బాంబే హైకోర్టు ఎత్తిపొడిచింది. శారీరక హింస, వరకట్న డిమాండ్లపై భర్య చెబుతున్న మాటలలో వైరుధ్యాలు కన్పిస్తున్నాయని, భర్త కుటుంబంపై కక్ష తీర్చుకోవడానికే ఇలాంటి కేసులు పెడుతున్నారని ఉత్తరప్రదేశ్‌లోని ఓ కోర్టు వ్యాఖ్యానించింది. ఓ కేసులో అలహాబాద్ హైకోర్ట్ ఏం చెప్పిందంటే...'ప్రతి కేసులోనూ వరకట్న వేధింపుల ఆరోపణలు చేస్తున్నారు. అనేక మంది సహజీవనానికి ఇష్టపడుతున్నారు. దీనికి ఎలాంటి చట్టబద్ధమైన కట్టుబాట్లు, ఒత్తిడులు ఉండవు'.

అనేక అవరోధాలు

మెట్టింటి వారి వేధింపులకు గురవుతున్న గృహిణులు కోర్టులో 498-ఏ సెక్షన్ కింద కేసు పెట్టడం అంత సులభమైన విషయమేమీ కాదు. ఎందుకంటే పోలీసులు ఇలాంటి కేసులను కుటుంబంలో తలెత్తిన వివాదంగానే పరిగణిస్తున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందే భార్యాభర్తలకు నచ్చచెప్పి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొన్ని సందర్భాలలో కుటుంబ పరువు పోతుందనో, ప్రజలలో తలవంపులు తప్పవనో భయపడి బాధిత మహిళలు కేసులను వెనక్కి తీసుకుంటున్నారు. ఒకవేళ కేసు ముందుకు సాగినా, సరైన ఆధారాలు లేక వీగిపోతోంది.

ఎందుకంటే మహిళలను మానసికంగా, భావోద్వేగపరంగా హింసించినట్లు నిరూపించడం చాలా కష్టం. సామాజికంగా ఒత్తిడులు వచ్చినప్పుడు లేదా విడాకులు మంజూరైన సందర్భాలలో మహిళలు విధిలేని పరిస్థితుల్లో పుట్టింటికి వెళతారు. అలాంటప్పుడు కేసును ముందుకు తీసికెళ్లడం మహిళలకు కష్టమవుతుంది. విచారణ నత్తనడక నడుస్తుంది. నిందితుడికి శిక్ష పడడం చాలా కష్టం. వీటన్నింటి కంటే ముఖ్యమైన విషయం ఏమంటే చాలా మంది మహిళలకు న్యాయ పోరాటం చేయడం అంత తేలికైన విషయం కాదు. పైగా వారి ఆర్థిక పరిస్థితి అందుకు సహకరించదు. వాస్తవాలు ఇలా ఉంటే మహిళలు ఐపీసీ 498-ఏని దుర్వినియోగం చేస్తున్నారంటూ అభాండాలు మోపడం ఏ విధంగా చూసినా సమర్థనీయం కాదు.

లైంగిక వేధింపులు భరించలేక..ట్యూటర్‌ను పొడిచి

న్యూఢిల్లీ: తనను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న 28 ఏండ్ల ప్రయివేట్ ట్యూటర్ వసీంను ఓ బాలుడు కత్తితో పొడిచి చంపాడు. ఢిల్లీలోని జామియా నగర్ ప్రాంతంలో జరిగిందీ ఈ ఘటన. నిందితుడైన బాలుడిని పోలీసులు నిన్న అదుపులోకి తీసుకున్నారు. బాలుడు నేరాన్ని అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు. ఆగస్టు 30న ఓ ఇంట్లో మృతదేహం పడి ఉందన్న సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడిని వసీంగా గుర్తించారు. ఆ ఇల్లు అతడి తండ్రిదని, కొన్ని రోజులుగా అది ఖాళీగా ఉందని తెలిసింది. బాధితుడు తన కుటుంబంతో కలిసి జకీర్‌నగర్‌లో ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు జరిపిన దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. బాలుడిని కొన్ని రోజులుగా వసీం లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. అంతేకాదు, ఆ ఘటనను వీడియో కూడా తీసి బయటకు చెబితే వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరించాడు. ఆగస్టు 30న ఉదయం 11.30 గంటల సమయంలో బాలుడిని మరోమారు పిలిచాడు. అప్పటికే అతడి చేష్టలతో విసిగిపోయిన బాలుడు.. వసీంను చంపాలని నిర్ణయించుకున్నాడు. పేపర్ కటర్‌ను వెంట తీసుకెళ్లిన బాలుడు.. వసీం తనపై లైంగికదాడికి యత్నించిన వెంటనే కత్తితో పొడిచి చంపేసినట్టు పోలీసులు తెలిపారు.

షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు..

- జమిలి ఎన్నికలపై ఠాకూర్ ఆసక్తికర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : ఒకే దేశం-ఒకే ఎన్నిక అంశంపై కేంద్ర ప్రభుత్వం కమిటీ వేసిన నేపథ్యంలో దేశంలో జమిలి ఎన్నికలపై చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం తమ అధికారాన్ని పొడిగించుకునేందుకే వన్ నేషన్-వన్ ఎలక్షన్ విధానాన్ని తెరపైకి తెచ్చిందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ స్పందించారు. దేశంలో ముందస్తు ఎన్నికలు రావడం, లేదా ఆలస్యం కావడం జరగని పని అని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ తన పదవీకాలం చివరి రోజు వరకు సేవలు అందిస్తారని, షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలకు వెళతామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు చేపట్టేందుకు వీలుగా, రాబోయే అసెంబ్లీ ఎన్నికలను ఆలస్యం చేయాలని తమ ప్రభుత్వం కోరుకోవడం లేదని అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఇవన్నీ మీడియా ఊహాగానాలేనని స్పష్టం చేశారు.

బురదలో 70 వేల మంది

- అమెరికా బర్నింగ్ మ్యాన్ ఫెస్టివల్ లో..

న్యూయార్క్ : అమెరికాలో బర్నింగ్ మ్యాన్ ఫెస్టివల్‌కు హాజరైన 70 వేల మంది బురదలో చిక్కుకుపోయారు. నెవడాలోని బ్లాక్‌రాక్ ఎడారిలో ఆగస్టు 27న ఈ ఫెస్టివల్ మొదలైంది. ఆ తర్వాతి రోజు రాత్రంతా భారీ వర్షం కురవడంతో ఆ ప్రాంతమంతా బురదగా మారింది. మూడు నెలల్లో కురవాల్సిన వర్షం మొత్తం ఒక్క రాత్రిలోనే కురవడంతో ఆ ప్రాంతం బురదతో నిండిపోయింది. దీంతో చాలా ఈవెంట్లు రద్దయ్యాయి. మరోవైపు, వర్షం కారణంగా ఆ ప్రాంతమంతా బురదమయంగా మారడంతో ఫెస్టివల్‌కు హాజరైన 70 వేలమంది అందులో చిక్కుకుపోయారు. వాహనాలు బురదలో చిక్కుకుని మొరాయిస్తున్నాయి. కాళ్లు కిందపెడితే కూరుకుపోతున్నాయి. చుట్టూ కొన్ని మైళ్ల దూరం వరకు ఎటుచూసినా బురదే కనిపిస్తోంది. లోపలున్న వారు బయటకు రావడానికి, బయట ఉన్నవారు లోపలికి వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. దీంతో బ్లాక్‌రాక్ సిటీని మూసివేసినట్టు అధికారులు తెలిపారు. భూ ఉపరితలం ఎండే వరకు వాహనాలను అనుమతించబోమని నిర్వాహకులు పేర్కొన్నారు. సందర్శకులు ఆహారం, నీరు వాడుకుని పొడిగా, వెచ్చగా ఉండే ప్రదేశం కనిపిస్తే తలదాచుకోవాలని సూచించారు.

కోతల్లేని కరెంట్ ఇస్తున్న కేసీఆర్‌కు థ్యాంక్స్

- మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంతరాయం లేని విద్యుత్‌ను అందిస్తూ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నందుకు సీఎం కేసీఆర్ కు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ ఈ వానాకాలంలో 57.51 లక్షల ఎకరాల్లో వరి, 44.73 లక్షల ఎకరాల్లో పత్తి, 5.28 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 4.61 లక్షల ఎకరాల్లో కందులతో కలుపుకుని రాష్ట్రంలో 1.18 కోట్ల ఎకరాల్లో వివిధ రకాల వ్యవసాయ పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. భూగర్భ జలాలు పెరగడం, గతేడాది సెప్టెంబర్ ఒకటిన 11,198 మెగావాట్లుంటే, ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటిన 14,747 మెగావాట్లు అత్యధిక డిమాండ్ నమోదైందని చెప్పారు.

టీఎస్‌ఎంసెట్ (బైపీసీ) ప్రవేశాలకు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌ఎంసెట్ (బైపీసీ)-2023 ప్రవేశాల తొలి దశ కౌన్సిలింగ్ కోసం ఆదివారం నాటికి 16,717 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నట్టు టీఎస్‌ఎంసెట్ (బైపీసీ) -2023 అడ్మిషన్స్ కన్వీనర్ తెలిపారు. ఈ మేరకు కన్వీనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. దీనికి సంబంధించి సెప్టెంబర్ 4, 5 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్, 4 నుంచి 7 తేదీల వరకు ఆప్షన్ల ఎంపిక ఉంటుంది. 11న సీట్లను కేటాయిస్తారు.

కరెంటే ఆధారం...

- దేశంలో సాగునీటి వనరుల్లో మూడొంతులకు విద్యుత్ వినియోగం
- మైనర్ ఇరిగేషన్ సెన్సస్ తాజా నివేదిక



న్యూఢిల్లీ : దేశంలో నీటిపారుదల వనరుల్లో నాలుగింట మూడొంతులకు విద్యుతే ఆధారం. విద్యుత్‌పై ఆధారపడిన సాగునీటి వనరులపై రైతులు వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. మైనర్ ఇరిగేషన్ సెన్సస్ (ఎంఐసి) తాజా ఎడిషన్ ఈ విషయాన్ని వెల్లడించింది. రైతులు, ఇతర ప్రయివేట్ యాజమాన్యం వినియోగించే బోర్‌వెల్‌లు, ట్యూబ్‌వెల్‌లు విద్యుత్‌పై ఆధారపడుతున్నాయని నివేదిక తెలిపింది. నీటిని వెలికి తీయడానికి డీజిల్, గాలి మరలు, సోలార్ కంటే విద్యుత్‌పై ఎక్కువ ఆధారపడుతున్నారని చెప్పింది. తాజాగా విడుదల చేసిన 6వ ఎడిషన్ ఎంఐసి నివేదిక ప్రస్తుత ఏడాది గణాంకాలకు సంబంధించినది కాదు. 2017-18లో నీటి పారుదల పరిస్థితులను తాజా నివేదిక ప్రతిబింబిస్తుంది. 2017లో విడుదల చేసిన ఐదో ఎడిషన్ ఎంఐసి నివేదిక 2013-14 పరిస్థితులు ప్రతిబింబిస్తుంది. బ్లాక్ స్థాయి నుంచి సమాచారం సేకరించాల్సి రావడం, సమాచారాన్ని కంపైల్ చేయడానికి, పబ్లిక్ చేయడానికి కొన్ని సంవత్సరాల వ్యవధి పడుతుంది కాబట్టి నివేదికలు ఆలస్యమవుతుంటాయి. సాగునీటి వనరుల్లో విద్యుత్ వినియోగం 2011లో 56 శాతం ఉండగా, గతవారం విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం 2017 నాటికి ఈ వినియోగం 76 శాతానికి పెరిగింది. భూగర్భ జలాలను వెలికితీయడానికి బోర్‌వెల్‌లు, ట్యూబ్‌వెల్‌లును ఉపయోగిస్తారు. విద్యుత్ వినియోగం పెరుగుదలకు అనుగుణంగానే ట్యూబ్ వెల్‌లు, బోర్‌వెల్‌లు సంఖ్య కూడా పెరుగుతూ వస్తుంది. బోర్‌వెల్‌లు, ట్యూబ్‌వెల్‌ల కంటే ఎక్కువ లోతు నుంచి (సుమారు 15 మీటర్ల కంటే ఎక్కువ) నీటిని తోడే డగ్ వెల్స్ సంఖ్య తగ్గింది. 2011లో 87 లక్షలుగా ఉన్న వీటి సంఖ్య 2017కు 82 లక్షలకు తగ్గింది. 35 మీటర్ల నుంచి కూడా నీటిని వెలికితీసే షలో ట్యూబ్‌వెల్స్ సంఖ్య కూడా 59 లక్షల నుంచి 55 లక్షలకు తగ్గింది.

పెరిగిన బావుల సంఖ్య

అయితే నీటిని తోడుకునే బావుల సంఖ్య పెరిగింది. 70 మీటర్ల లోపు గల బావుల సంఖ్య 31 లక్షల నుంచి 43 లక్షలకు పెరిగింది. 70 మీటర్ల కంటే ఎక్కువ లోతు గల బావుల సంఖ్య 26 లక్షల నుంచి 37 లక్షలకు పెరిగింది. భూగర్భ జలాలను తోడుకోవడం ఎక్కువకావడం ఆందోళన కలిగించే అంశమే అయినా.. ఈ ట్యూబ్‌వెల్‌లు, బోర్‌వెల్‌లు సంఖ్య పెరగడానికి గల కారణాలును ఈ నివేదిక వెల్లడించలేదు. వీటి సంఖ్య పెరగడానికి అనేక కారణాలు ఉంటాయని పేరు చెప్పడానికి నిరాకరించిన ఒక అధికారి తెలిపారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే పథకాలు, బావులను కొనుగోలు చేయడానికి రుణాల లభ్యత.. వంటి అంశాలు వీటిపై ప్రభావం చూపుతాయని చెప్పారు. ఈ నివేదిక ప్రకారం దేశంలోని 695 జిల్లాల్లోని 6,47,394 గ్రామాల నుంచి 23.14 మిలియన్ల మైనర్ ఇరిగేషన్ పథకాలు ఉన్నాయి. వీటిలో పథకాల్లో 21.93 మిలియన్లు (94.8 శాతం) భూగర్భ జలాల వెలికితీతకు, 1.21 మిలియన్లు (5.2 శాతం) ఉపరితల-నీటి వెలికితీతకు ఉద్దేశించబడినవి. దేశంలో అత్యధిక సంఖ్యలో మైనర్ ఇరిగేషన్ పథకాలను కలిగి ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్ (17.2 శాతం). తర్వాత మహారాష్ట్ర (15.4 శాతం), మధ్యప్రదేశ్ (9.9శాతం), తమిళనాడు (9.1శాతం) రాష్ట్రాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 5.1 శాతం పథకాలు అమల్లో ఉన్నాయి. భూగర్భజలాల వెలికితీసే పథకాల్లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు ముందు వరుసలో ఉండగా, మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్ ఉపరితల నీటి వెలికితీత పథకాల్లో ముందున్నాయి. ఐదో, ఆరవ ఎడిషన్ల మధ్య ఈ పథకాల సంఖ్య సుమారు 1.42 మిలియన్లు పెరిగింది. ఎక్కువ పథకాలు (96.6%) ప్రయివేట్ యాజమాన్యం లేదా రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమిని కలిగి చిన్న సన్నకారు రైతులు నిర్వహిస్తున్నారు.

అర్హతలేని వైద్యాన్ని అరికడతాం..

టీఎస్‌ఎంసీకి కొత్త భవనం

- వైద్యవిద్య ఫీజుల నియంత్రణ
- హెచ్‌ఆర్‌డీఏ ప్యానెల్ మ్యానిఫెస్టో విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి అర్హత లేకుండా వైద్యమందిస్తున్న వారిని అరికడతామని హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డీఏ) తెలిపింది. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్‌ఎంసీ)కి కొత్త భవనాన్ని నిర్మిస్తామనీ, వైద్య విద్య ఫీజులను నియంత్రమిస్తామని హామీనిచ్చింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డీఏ ప్యానెల్ డాక్టర్లు మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త భవనం నిర్మిస్తామనీ, వైద్య విద్య ఫీజుల నియంత్రణ దిశగా ప్రయత్నాలు చేస్తామని ప్రకటించారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అనేక కీలక నిర్ణయాలు తీసుకునే అధికారమున్న టీఎస్‌ఎంసీ గత 17 ఏండ్లుగా ప్రభుత్వంచేత నామినేట్ అయిన వ్యక్తుల చేతిలో నడుస్తోందని వివరించారు. దీంతో అర్హత లేని వ్యక్తుల చేతుల్లో ప్రజారోగ్యం ఇబ్బంది పడుతోందని విమర్శించారు.

దీనిపై హెచ్‌ఆర్‌డీఏ సుప్రీంకోర్టును ఆశ్రయించి ఎన్నికలు నిర్వహించేలా కృషి చేసిందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో హెచ్‌ఆర్‌డీఏ అధ్యక్షులు డాక్టర్ కె.మహేశ్ కుమార్‌తో పాటు డాక్టర్ ప్రతిభా లక్ష్మి, డాక్టర్ కుసుమరాజు రవి కుమార్, డాక్టర్ కిరణ్ కుమార్ తోటావర్, డాక్టర్ గుండగాని శ్రీనివాస్, డాక్టర్ సయ్యద్ ఖాజా ఇమ్రాన్ అలీ, డాక్టర్ ఎ.సన్నీ డెవిస్, డాక్టర్ యెగ్గన శ్రీనివాస్, డాక్టర్ నరేష్ కుమార్ వేములపల్లి, డాక్టర్ బండారి రాజ్ కుమార్, డాక్టర్ ఎస్.ఆనంద్, డాక్టర్ కున్ విష్ణు, డాక్టర్ శ్రీకాంత్ జూకురు పాల్గొన్నారు.



48,405 మంది ఓటర్లు....

ఎన్నికల ద్వారా రాష్ట్ర వైద్యమండలికి 13 మందిని పాలక మండలి రూపంలో ఎన్నుకోనున్నారు. రాష్ట్రంలో 48,405 మంది డాక్టర్లు ఓటు హక్కును కలిగున్నారు. కాగా వంద మందికిపైగా అభ్యర్థులు పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలను పోస్టల్ బ్యాలెట్ ద్వారా నిర్వహించనున్నారు. వచ్చే నెల నుంచి బ్యాలెట్ పేపర్ల పంపిణీ జరగనుండగా, ఓట్ల లెక్కింపును డిసెంబర్ ఒకటిన చేపట్టనున్నారు.

మాటల్లేవ్...టిక్ మార్కే..!

- హడావుడిగా ముగిసిన పీఈసీ
- ఇన్ని పేజీలు చదవాలా? రేణుకా చౌదరి అసహనం
- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క గైర్హాజర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ఆశావాహుల దరఖాస్తులను పరిశీలించేందుకు ఆదివారం సమావేశమైన ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ (పీఈసీ) హడావుడిగా ముగించింది. దరఖాస్తులను పరిశీలించకుండానే టిక్ మార్క్ చేసి వెళ్లిపోయారు. పర్సన్ టు పర్సన్ చర్చించి మూడు పేర్లు ఖరారు చేస్తారని భావించిన వారికి నిరాశే మిగిలింది. దరఖాస్తు చేసుకున్న వెయ్యి మందికి సంబంధించిన పూర్తి వివరాలను పొందుపరిచిన స్పైరల్ బైడింగ్ సభ్యులకు ఇచ్చినట్టు తెలిసింది. అందులో తెలిసినోళ్ల గురించి టిక్ మార్క్ చేయాలనీ, తెలియకపోతే వదిలేయాలంటూ పీఈసీ చైర్మెన్ సూచించడంతో సభ్యులు హడావుడిగా టిక్ మార్క్ చేసినట్టు తెలుస్తోంది. దీంతో మాటల్లేకుండానే టిక్‌మార్క్ చేయడంతో తొందరంగానే సమావేశం ముగిసింది. మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి మాత్రం ఇన్ని పేజీలు చదవాలా? అంటూ అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. మొత్తంగా అభ్యర్థుల గురించి చర్చించకుండానే పీఈసీ సమావేశాన్ని ముగించడంతో అభ్యర్థి ఎంపిక పారదర్శకంగా ఉండదనే ఆందోళన వ్యక్తమవుతున్నది. దీంతో పీఈసీ సభ్యులు ముందుగానే అభ్యర్థుల జాబితా రూపొందించి, తూ...తూ మంత్రంగా సమావేశాన్ని నిర్వహించారనే విమర్శలు వస్తున్నాయి. పీఈసీ సభ్యుడు ఏయే పేరుపై టిక్ మార్క్ చేశాడో వారికి గురించి పూర్తిగా సోమవారం జరగనున్న తెలంగాణ రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ ముందు చెప్పాల్సి ఉంది. అతనికి కచ్చితంగా టికెట్ ఇవ్వాలని చెప్పే హక్కు సభ్యుడికి లేదు...కానీ దరఖాస్తుదారుల్లో ఎవరికి గెలుపు అవకాశాలు ఉన్నాయో చెప్పడానికి స్క్రీనింగ్ కమిటీ అవకాశం కల్పిస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వాటన్నింటిని పూర్తిగా పరిశీలించిన తర్వాత నియోజకవర్గానికి మూడు పేర్ల చొప్పున ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీకి పీఈసీ పంపనుంది. సమావేశానికి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క గైర్హాజర్ అయ్యారు.

అభ్యర్థుల ఎంపికలో అపోహలకు గురి కావొద్దు
ఆశావహులకు రేవంత్ విజ్ఞప్తి3

ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) ఎంపిక చేసిన జాబితాను.. సీల్డ్ కవర్‌లో స్క్రీనింగ్ కమిటీకి అందజేస్తామని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చెప్పారు. పీఈసీ సమావేశానంతరం తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు స్క్రీనింగ్ కమిటీ హైదరాబాద్‌లోనే ఉంటుందని చెప్పారు. సోమవారం పీఈసీ సభ్యులతో వేర్వేరుగా స్క్రీనింగ్ కమిటీ సమావేశమై అభిప్రాయాలు తీసుకుంటుందని చెప్పారు. 'అభ్యర్థుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. ఈసారి అభ్యర్థుల్లో బీసీ సామాజిక వర్గానికి పెద్దపీట వేయబోతున్నాం. స్థానిక పరిస్థితులు, సామాజిక వర్గాలు ఆధారం చేసుకుని బీసీ అభ్యర్థులను ఎంపిక చేస్తాం. అభ్యర్థుల ఎంపికలో ఎవరూ ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదు' అని రేవంత్ వివరించారు. మంగళవారం డీసీసీ అధ్యక్షులు, సీనియర్ నాయకులతో కమిటీ సమావేశమవుతుందని తెలిపారు. ఈ నెల 6న స్క్రీనింగ్ కమిటీ ప్రత్యేకంగా సమావేశమై పీఈసీ ఇచ్చిన నివేదికపై క్షుణ్ణంగా అధ్యయనం చేస్తుందన్నారు. స్క్రీనింగ్ కమిటీ తయారు చేసిన జాబితా...సెంట్రల్ ఎలక్షన్ కమిటీకి నివేదిస్తుందని వివరించారు. వీలైనంత తర్వలో మొదటి జాబితా విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిటీ ప్రకటించే జాబితానే ఫైనల్ అనీ, అప్పటి వరకు పీసీసీ అధ్యక్షుడిగా తనకు కూడా సమాచారం ఉండదని చెప్పారు.

పాలేరులో పోటీ చేయడానికి ఇంకా ఎవరైనా మిగిలి ఉన్నారా?

- వైఎస్ షర్మిలపై రేణుకా చౌదరి సెటైర్లు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పాలేరు నుంచి పోటీ చేస్తామంటూ చాలా మంది నాయకులు చెబుతున్నారనీ, ఇంకా ఎవరైనా మిగిలి ఉన్నారా?అంటూ వైఎస్ఎస్ షర్మిలపై మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి సెటైర్లు వేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్నారా? అంటూ తనను కలిసి విలేకర్లతో ఆమె పై విధంగా స్పందించారు. పాలేరు కాదు...షర్మిల ముందు అమరావతి రైతుల సమస్యలపై మాట్లాడాలని సూచించారు.

తెలంగాణ కోడలన్న విషయం షర్మిలకు ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు. తెలంగాణలో షర్మిల ఎంతనో.. ఏపీలో తాను కూడా అంతేనని రేణుకా చౌదరి వ్యాఖ్యానించారు. తాను ఏపీ కోడల్ని అన్న ఆమె... తెలంగాణ బిడ్డనని గుర్తు చేశారు. తెలంగాణలో షర్మిల పోటీ చేసే విషయమై అధిష్టానం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. షర్మిల విషయంలో అధిష్టానం స్పష్టమైన నిర్ణయం తీసుకుంటుందని తాను భావిస్తున్నట్టు చెప్పారు.

కోదండరాం పోటీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు-టీజేఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రొఫెసర్ కోదండరాం పోటీపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలంగాణ జన సమితి (టీజేఎస్) తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరి రమేశ్, ధర్మార్జున్ ఒక ప్రకటన విడుదల చేశారు. కోదండరాం పోటీపై పార్టీలో ఎలాంటి చర్చ జరగలేదనీ, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నారని వస్తున్న వార్తలు ఊహాగానాలేనని స్పష్టం చేశారు. తమ పార్టీ కేసీఆర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ఆందోళనలను నిర్మించే పనిలో నిమగ్నమై ఉన్నట్టు తెలిపారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రజాస్వామిక శక్తులను ఐక్యం చేయాలని భావిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రయివేటు టీచర్లకు అవార్డులు ఇవ్వాలి

- టీఎస్‌టీసీఈఏ అధ్యక్షులు సంతోష్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చే ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపక అవార్డులను ప్రయివేటు ఉపాధ్యాయులకు అధ్యాపకులకు కూడా ఇవ్వాలని టీఎస్‌టీసీఈఏ అధ్యక్షులు సంతోష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 85 శాతం ఉన్నత విద్యను 60 శాతం పాఠశాల విద్యను అందిస్తున్న ఆధ్యాపక, ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు ఇవ్వాలని కోరారు.

సిర్పూర్ గడ్డపై నీలి జెండా ఎగరాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్.ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేసి రాబోయే ఎన్నికల్లో సిర్పూర్ గడ్డపై నీలి జెండా ఎగరవేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో ఆదివారం బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా అహర్నిశలు పార్టీ కోసం పనిచేయాలన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,అగ్రవర్ణ పేదలను పార్టీలోకి తీసుకురావడానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే యెన్నం సస్పెండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఆయన్ని సస్పెండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర శాఖ నిర్ణయం తీసుకుందనీ, సస్పెన్షన్ తక్షణం అమల్లోకి వస్తుందని వివరించారు.

దూప్‌గురిలో సీపీఐ(ఎం) విస్తృత ప్రచారం



దూప్‌గురి : పశ్చిమ బెంగాల్‌లోని దూప్‌గురి అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో సీపీఐ(ఎం) అభ్యర్థి ఈశ్వర్ చంద్రరాయ్‌కి మద్దతుగా ఆ పార్టీ ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించింది. పలు ప్రాంతాల్లో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించడంతోపాటు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో టీఎంసీ హింసాకాండను, బీజేపీ మతతత్వ రాజకీయాలను ఓడించాలని, సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు సుజన్ చక్రవర్తి, రాష్ట్ర నాయకులు జీవేష్ సర్కార్, సలీల్ ఆచార్య, మీనాక్షి ముఖర్జీ, ధృవజ్యోతి సాహ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో గులాబీ జెండా ఎగరాలి

- ఎమ్మెల్సీ కే కవిత ఆకాంక్ష



నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

వచ్చే ఎన్నికల్లో సింగరేణిలోని అన్ని స్థానాల్లో గులాబీ జెండా ఎగరేసి, సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణి ప్రయివేటీకరణను అడ్డుకున్న ఘనత ఆయనదేనని చెప్పారు. ఆదివారం సింగరేణి పాఠశాలల కాంట్రాక్ట్ టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆమెకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగరేణి, ఆర్టీసీ సంస్థల ప్రయివేటీకరణను నిలుపుదల చేసిన ఘనత కేసీఆర్‌దే అని చెప్పారు. వారి సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే సింగరేణి కార్మిక నాయకులతో సీఎంతో సమావేశం ఏర్పాటు చేయించడానికి ప్రయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ జనరల్ సెక్రెటరీ మిరియాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

జి 20 నేపథ్యంలో 207 రైళ్లు రద్దు

- 9 నుండి 11 వరకు రాకపోకలపై ఆంక్షలు



న్యూఢిల్లీ : జి 20 సదస్సు నేపథ్యంలో ఉత్తర రైల్వే 207 రైళ్లను రద్దు చేసింది. ఈ నెల 9 నుంచి 11 వరకు రైళ్ల రాకపోకలపై ఆంక్షలు విధించారు. దాదాపు 15 రైళ్ల రూట్‌ను మార్చామని, ఆరు రైళ్లను దారి మళ్లించామని రైల్వే శాఖ తెలిపింది. జమ్మూ తావీ – న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్, తేజస్ రాజధాని హజ్రత్ నిజాముద్దీన్, వారణాసి–న్యూఢిల్లీ తేజస్ రాజధానితో సహా అదనంగా 70 రైళ్లకు స్టాప్‌లు కేటాయించబడ్డాయి.న్యూఢిల్లీలో ముగియాల్సిన 36 రైళ్లు ఘజియాబాద్, నిజాముద్దీన్ స్టేషన్లలో ముగుస్తాయి. సెప్టెంబర్ 10న వంద ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. వీటిలో ఎక్కువ భాగం ఢిల్లీ నుండి దక్షిణ హర్యానాలోని సోనిపట్–పానిపట్, రోహ్‌తక్, రేవారి మరియు పల్వాల్ మార్గాల్లో నడుస్తాయి. సెప్టెంబర్ 11 న ఢిల్లీ–రేవారి ఎక్స్‌ప్రెస్ స్పెషల్, రేవారి–ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ స్పెషల్ రైళ్లు రద్దు చేయబడ్డాయి.

సిర్సా తిలక్ బ్రిడ్జ్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 9 నుండి 11 గంటల వరకు, బరేలీ జంక్షన్–న్యూ ఢిల్లీ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ – రోహ్‌తక్ జంక్షన్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఉదయం 8 నుండి 10 గంటల వరకు రద్దు చేయబడ్డాయి. రద్దు చేయబడిన రైళ్లలో న్యూఢిల్లీ – వీరాంగన లక్ష్మీబాయి తాజ్ ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ – లోహియాన్ ఖాస్ జంక్షన్ సర్బత్ ఎక్స్‌ప్రెస్, భివానీ – తిలక్ బ్రిడ్జ్ ఎక్స్‌ప్రెస్, గంగానగర్ – తిలక్ బ్రిడ్జ్ ఎక్స్‌ప్రెస్, ఢిల్లీ – హరిద్వార్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్, జలంధర్ సిటీ జంక్షన్ – న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో 9, 10 తేదీల్లో సమ్మిట్ జరగనుంది. సమ్మిట్ దష్ట్యా సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు ఢిల్లీలో పబ్లిక్ హాలీడే ప్రకటించారు. అన్ని ప్రభుత్వ, మున్సిపల్ కార్పొరేషన్, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు మూసివేయబడతాయి. ఈ మూడు రోజులు బ్యాంకులు, దుకాణాలు సహా ఆర్థిక సంస్థలు పని చేయవు.ప్రయాణికులు రైళ్ల సమాచారం, సమయాలను సరిగ్గా తనిఖీ చేసి ప్రయాణించాలని ఉత్తర రైల్వే ప్లాట్‌ఫారమ్ ఎక్స్‌లో పేర్కొంది.



ప్రేమోన్మాది ఘాతుకం

- ఎల్బీనగర్‌లో యువతి సోదరుడు మృతి.. ఆమెకు గాయాలు
- పోలీసుల అదుపులో నిందితుడు




నవతెలంగాణ–హయత్‌నగర్

హైదరాబాద్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ప్రేమోన్మాది ఘాతుకానికి యువతి సోదరుడు మృతి చెందగా.. యువతి తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన యువతి.. హైదరాబాద్‌లో ప్రయివేటు ఉద్యోగం చేస్తూ ఆమె తమ్ముడు పృథ్వి అలియాస్ చింటూ(25) కలిసి ఎల్‌బీనగర్‌లోని ఆర్టీసీ కాలనీ రోడ్ నెంబర్ 6లో ఉంటోంది. అయితే రామంతపూర్‌కు చెందిన శివకుమార్‌కు యువతికి 10వ తరగతి నుంచి పరిచయం ఉంది. కొద్ది కాలంగా వారు ప్రేమించుకుంటున్నట్టు తెలిసింది. అయితే నెల రోజుల నుంచి శివకుమార్ ఫోన్ నెంబర్‌ను యువతి బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. దాంతో కోపోద్రిక్తుడైన శివకుమార్.. ఆదివారం మధ్యాహ్నం ఆమె ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. దాంతో తన అక్కను శివకుమార్ ఏమైనా చేస్తాడేమోనన్న భయంతో.. ఆమె తమ్ముడు పథ్వి.. కత్తి తీసుకుని శివకుమార్‌ను బెదిరించేందుకు ప్రయత్నించాడు. వెంటనే తేరుకున్న శివకుమార్ అదే కత్తితో పథ్వి ఛాతీపై పలు మార్లు పొడవగా అతను తీవ్ర గాయాలతో మొదటి అంతస్తు నుంచి కిందకి వచ్చి కొంచెం దూరం నడిచి కిందపడి పోయాడు. వెంటనే అతన్ని ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. ఇదిలా ఉండగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ దాడిలో యువతికి కూడా గాయాలు కావడంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎల్ నగర్ జోన్ డీసీపీ సాయి శ్రీ సందర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఊపర్ షేర్వానీ..

మేడిపండు చందంగా ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి



- లెక్కలతో తప్పుదారి పట్టిస్తున్న మోడీ సర్కారు
- సర్వే గణాంకాల్లో పారదర్శకత లోపం
- జీడీపీపై ప్రభుత్వ వాదనలు నిరాధారం, నమ్మశక్యం కానివి
- ఆర్థికవేత్తలు, నిపుణులు అభిప్రాయం



కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేండ్లు పూర్తవుతున్నది. ఈ తొమ్మిదేండ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి సమున్నతంగా జరిగిందని మోడీ టీం ప్రచారం చేసుకుంటున్నది. ముఖ్యంగా, దేశ ఆర్థికవృద్ధిపై మళ్లీ పెద్ద ఎత్తున వాదనలు వెల్లువెత్తుతున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున.. ఇవి మరింతగా తీవ్రమవుతున్నాయి. 5 ట్రిలియన్ల నుంచి 25 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గురించి చర్చలు జరుగుతున్నాయి. మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందనీ, రానున్న రోజుల్లో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని మోడీ, ఆయన టీం ప్రచారాలు చేసుకుంటున్నారు.

న్యూఢిల్లీ : దేశ ఆర్థికం, అభివృద్ధి విషయంలో కేంద్రం ప్రచారాలు నిరాధారమైనవనీ, గణాంకాలతో తప్పుదారి పట్టిస్తున్నదని ఆర్థికవేత్తలు, నిపుణులు అంటున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో ఐదో స్థానానికి చేరుకోవటానికి గత ప్రభుత్వాల విధానాలు, కృషి ఉన్నాయనీ, అయితే మోడీ ప్రభుత్వం ఇదంతా వారి గొప్పతనంగా ప్రచారం చేసుకుంటున్నదని తెలిపారు. స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) గణనను, కొన్ని అంశాల ఆధారంగా దాని ఆర్థికవృద్ధి రేటును విశ్వసించలేమని అన్నారు. జీడీపీ, ఉపాధి, ద్రవ్యోల్బణం, తలసరి ఆదాయం మొదలైన అంశాల్లో ప్రభుత్వ వాదనలు నమ్మదగినదిగా లేదనీ, ఇవి నిరాధారమైనవని ఆర్థికవేత్తలు, నిపుణులు అంటున్నారు.

ఆర్థిక వ్యవస్థలో సగానికి పైగా 'అనధికారమే'

మరిన్ని వివరాల్లోకి వెళ్లేముందు, జీడీపీ గణాంకాలకు వాటి గణన పద్ధతి, పాత వాస్తవాల కారణంగా ఉన్న భారీ వ్యత్యాసాన్ని ఉదాహరణతో అర్థం చేసుకుందాం. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో సగానికి పైగా అనధికారిక లేదా అసంఘటిత రంగంలోనే ఉంది. ఇందులో వ్యవసాయం మాత్రమే కాకుండా తయారీ మరియు సేవా రంగాలలోని పెద్ద భాగాలు కూడా ఉన్నాయి. ఖాతాలు, గణాంకాలు అందుబాటులో లేనందున దీనిని అనధికారికం అంటారు. కాబట్టి, జీడీపీని లెక్కించేటప్పుడు, ఈ భాగాన్ని అంచనా ఆధారంగా మాత్రమే జోడించాలి. అంచనా పద్ధతిలో లోపం కారణంగా వీటిలో భారీ వ్యత్యాసం వస్తుంది. అందువల్ల, ఈ పద్ధతి తార్కికంగా, పారదర్శకంగా ఉండటం అవసరమనీ ఆర్థిక నిపుణులు తెలుపుతున్నారు.

అధికారిక రంగానికి సంబంధించినంత వరకు, పరిశ్రమల వార్షిక సర్వే నుంచి దాని ఉత్పత్తి డేటాను ముందుగా పొందారు. అధికారిక, అనధికారిక రంగాల నుంచి డేటాను కలపడం ద్వారా జీడీపీ గణనలో స్పష్టత ఉండదని చెప్పారు. కాబట్టి, స్థూల జీడీపీ డేటా కోసం అధికారిక, అనధికారిక రంగాలు ఎలా మిళితం చేయబడతాయో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమని అన్నారు.

మోడీ పాలనలో సర్వేల ప్రక్రియ నిలిపివేత

వాస్తవానికి, అంచనాల కారణంగా, ఇంతకుముందు కూడా ఇందులో తప్పులు జరిగాయని నిపుణులు గుర్తు చేశారు. కానీ కాలానుగుణంగా, ఈ అంచనాలు తనిఖీ చేయబడ్డాయనీ, అనధికారిక రంగం అంటే కంపెనీయేతర వ్యాపారాల జాతీయ సర్వే నిర్వహించడం ద్వారా సరిదిద్దబడ్డాయని చెప్పారు. అంతేకాకుండా, సాధారణ ఆర్థిక గణన, వినియోగదారుల వ్యయ సర్వే, ఉపాధి సర్వే మొదలైనవి కూడా గణాంక గణనలను ధృవీకరించడంలో చాలా వరకు సహాయపడిందని చెప్పారు. కానీ మోడీ ప్రభుత్వం ఈ సర్వేల ప్రక్రియను నిలిపివేసిందన్నారు. "13 ఏండ్లుగా కంపెనీయేతర ఆక్రమణ సర్వే చేయలేదు. 9 ఏండ్లుగా ఆర్థిక గణన జరగలేదు. వినియోగదారుల వ్యయం, ఉపాధి సర్వేలు 12 సంవత్సరాల క్రితం జరిగాయి. 2015–16లో 5 సంవత్సరాల తర్వాత వినియోగదారుల వ్యయ సర్వే కూడా నిర్వహించబడింది. కానీ దాని ఫలితాలు, ప్రభుత్వ వాదనలకు విరుద్ధంగా, ఆదాయం, పేదరికం విషయంలో ప్రభుత్వానికి ప్రతికూల గణాంకాలను అందించాయి. దీంతో ప్రభుత్వం తన స్వంత సర్వేను రద్దు చేసిందనీ, దాని డేటాను విడుదల చేయడానికి నిరాకరించిందని ఆర్థిక నిపుణులు తెలిపారు.

తగ్గిన అనధికారిక రంగం వేగం

ఎస్‌బీఐ ప్రిన్సిపల్ ఎకనామిస్ట్ సౌమ్య కాంతి ఘోష్ సమర్పించిన అంచనా ప్రకారం.. 2020–21లో ఆర్థిక వ్యవస్థలో 15శాతం నుంచి 20 శాతం అనధికారిక రంగం చాలా వేగంగా తగ్గిపోయింది. దీనికి విరుద్ధంగా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పర్యవేక్షిస్తున్న లండన్‌కు చెందిన వరల్డ్ ఎకనామిక్స్ ఇన్‌స్టిట్యూట్ అంచనాల ప్రకారం, ఇది 2023లో ఇప్పటికీ 43.1 శాతం స్థాయిలోనే ఉంది. ఈ రెండు వ్యతిరేక అంచనాల ఆధారంగా జీడీపీ లెక్కల్లో భారీ వ్యత్యాసం ఉన్నదని చెప్పారు.

జీడీపీ డేటాపై ప్రపంచ ఆర్థికవేత్తల సందేహాలు

వరల్డ్ ఎకనామిక్స్ అంచనాను తీసుకుంటే.. అధికారిక రంగంలోని ప్రతి రూ. 100 జీడీపీకి అనధికారిక రంగం (రూ. 73.17) సహకారం కలిపితే, మొత్తం జీడీపీ రూ. 173.14 అవుతుంది. ఘోష్ అంచనా ఆధారంగా జీడీపీని గణిస్తే, మొత్తం జీడీపీ అధికారిక గణాంకాల కంటే చాలా తక్కువగా ఉంటుంది. భారత ఆర్థిక వ్యవస్థలో అనధికారిక,అధికారిక రంగానికి సంబంధించిన వాస్తవ డేటా లేదనీ, ప్రస్తుత దశలో విడుదల అవుతున్న జీడీపీ డేటా విశ్వసనీయత ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్థికవేత్తలు, గణాంకవేత్తల దృష్టిలో చాలా సందేహాస్పదంగా ఉందని నిపుణులు, విశ్లేషకులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక కార్యకలాపాల వాస్తవాలను సర్వేల ద్వారా పారదర్శకంగా అందజేసే వరకు ఈ సందేహం వీడదన్నారు.



కర్నాటకలో మళ్లీ ఆపరేషన్ కమలం

- కాంగ్రెస్ సర్కారుకు ముప్పు తప్పదు : బీజేపీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



బెంగళూరు : ప్రజాతీర్పును గౌరవించకుండా అధికారమే పరమావధిగా రాజకీయం చేయటం బీజేపీకి అలవాటుగా మారింది. గతంలో మధ్యప్రదేశ్,గోవా,కర్నాటక సహ ఇతర రాష్ట్రాల్లోని ప్రజాప్రతినిధులను నయానో,భయానో తమ వశం చేసుకుని ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కమలం పార్టీ కన్ను ఇపుడు మరోసారి కర్నాటక సర్కార్‌పై పడింది. కర్నాటకలో త్వరలో ఆపరేషన్ కమలం ప్రారంభం కానున్నదని బీజేపీ నేత కె.ఎస్. ఈశ్వరప్ప ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండదని అన్నారు. కర్నాటకలో ఆపరేషన్ కమలం ప్రారంభమవుతుందని వందశాతం హామీ ఇవ్వగలనని స్పష్టం చేశారు.

దేశంలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేదని, 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆ పార్టీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలో ఉండదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేదని.. 17 మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. పార్టీ అధిష్టానం పట్ల ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని.. దానిని సరిదిద్దేందుకు యత్నిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ కూడా అంగీకరించారని వివరించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, డి.కె. శివకుమార్‌లకు పలు అంశాలపై విభేదాలు ఉన్నాయని చెప్పారు. రాజకీయ సమీకరణలు చూసుకుని అవకాశం రాగానే ఆపరేషన్ కమలం అమలు చేసి అధికారంలోకి వస్తామని తెలిపారు.



మణిపూర్ అల్లర్ల కట్టడికి సర్జికల్ స్ట్రైక్ కమాండర్

- ఎస్ఎస్‌పీగా రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ నెక్టార్ సంజెన్‌బామ్
- అశాంతికి తెర దించేందుకు నియామకం అంటున్న కేంద్రం
- ఓ వర్గాన్ని టార్గెట్ చేయటానికేనంటున్న రాజకీయ పరిశీలకులు



ఇంఫాల్ : మణిపూర్‌లో శాంతి పరిస్థితులు నెలకొనటం అంత సులువుగా కనబడటం లేదు. ప్రతిరోజూ ఎక్కడో చోట కాల్పుల మోతలు, మరణాలు వంటివి చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పరిస్థితిని అదుపులోకి తీసుకురావటానికి సర్జికల్ స్ట్రైక్ కమాండర్ , రిటైర్డ్ కల్నల్ నెక్టార్ సంజెన్‌బామ్‌ను కేంద్రం రంగంలోకి దింపింది. గతనెల 24న రాష్ట్ర ప్రభుత్వం ఆయనను సీనియర్ సూపరింటెండెంట్(కోంబాట్)గా నియమించింది. ఐదేండ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉండనున్నారు. రాష్ట్రంలో దాదాపు మూడు నెలలకు పైగా కొనసాగుతున్న అశాంతికి ఇప్పటికీ తెర పడటం లేదు. పైగా రాజకీయంగా బీజేపీ ప్రభుత్వానికి సంకటంగా మారింది. దీంతో అత్యున్నత పురస్కారాలైన శౌర్యచక్ర, కీర్తి చక్ర గ్రహీత అయిన సంజెన్‌బామ్‌కు బాధ్యతలు అప్పగించింది. అయితే మోడీ ప్రభుత్వం కావాలనే..ఓ వర్గాన్ని టార్గెట్ చేయటానికే సంజెన్ బామ్‌ను నియమించిందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.2015లో మయన్మార్‌లో భారత్ జరిపిన సర్జికల్ స్ట్రైక్స్‌లో సంజెన్ కీలక పాత్ర పోషించారు. ఆర్మీ అధికారిగా ఆయన 21 పారా(స్పెషల్ ఫోర్సెస్)లో పని చేశారు. జూన్ 12 నాటి క్యాబినెట్ నిర్ణయం తర్వాత నియామకం జరిగిందని మణిపూర్ జాయింట్ సెక్రెటరీ (హోమ్) ఆగస్టు 28న జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒకే దేశం, ఒకే ఎన్నికలు'

ఈవీఎంలకే రూ.10 వేల కోట్లు



న్యూఢిల్లీ : పొదుపు, అభివద్ధికి అడ్డంకులు తొలగాలన్న వాదనలతో బీజేపీ ముందుకు తెచ్చిన 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' కోసం భారీ మొత్తంలో నిధులు వెచ్చించాల్సి వస్తోంది. 2015లో పార్లమెంట్ లీగల్ అండ్ పర్సనల్ స్టాండింగ్ కమిటీ సమర్పించిన అంచనాల ప్రకారం కేవలం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లకే లోక్ సభ, శాసనసభలకు కలిపి ఎన్నికలు నిర్వహించాలంటే రూ.9284.15 కోట్లు అవసరం. 2014 నుంచి 2019 వరకు కేంద్రం రాష్ట్రాలకు రూ.5,814.29 కోట్లు మాత్రమే ఇచ్చింది.ఈవీఎంలు, ఓటర్ వెరిఫైయబుల్ పేపర్, ఆడిట్ ట్రయిల్ మెషీన్లు తదితరాలను పెద్దమొత్తంలో కొనుగోలు చేయాల్సి ఉంటుందని, పదిహేనేండ్ల జీవితకాలం ఉన్న ఈవీఎంలను మూడు రెట్లు మాత్రమే ఉపయోగిస్తే ఖర్చు పెరుగుతుందని నివేదిక పేర్కొంది. మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఒపి రావత్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. 2015లో దీనిపై అధ్యయనం చేయాలని కేంద్రం ఎన్నికల సంఘాన్ని కోరినప్పుడు రావత్ అందులో సభ్యుడు. కనీసం 30 లక్షల ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు అవసరం. రాజ్యాంగ, ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణలు అవసరం. ప్రస్తుతం భారత్‌లో ప్రపంచంలోనే అత్యంత చౌకగా ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటుకు ఒక్క డాలర్ మాత్రమేనని రావత్ తెలిపారు. మరో మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ టిఎస్ కష్ణమూర్తి కూడా ఎన్నికలు పూర్తి కావడానికి కనీసం నాలుగు నెలల సమయం పడుతుందని చెప్పారు. వచ్చే ఏడాది ఈవీఎంల నిర్వహణ చాలా కష్టమని టెక్నికల్ కమిటీ సభ్యుడు తెలిపారు. రజత్ మూనా కూడా స్పష్టం చేశారు. 6–7 లక్షల ఈవీఎంల తయారీకి కనీసం ఏడాది సమయం పడుతుందని చెప్పారు. మార్చి వరకు కమిషన్ వద్ద 13.06 లక్షల కంట్రోల్ యూనిట్లు (సీయూ), 17.77 లక్షల బ్యాలెట్లు మాత్రమే ఉన్నాయని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పార్లమెంటుకు తెలిపారు. దేశమంతటా ఏకకాలంలో కేంద్ర సైన్యాన్ని మోహరించడం వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మాత్రం తన వైఖరిని స్పష్టం చేయలేదు.



మరో మూడురోజులు వానలే...

- తెలంగాణలో అతిభారీ వర్షాలు..ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ..



హైదరాబాద్ : తెలంగాణలో రాగల మూడురోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదివారం నుంచి సోమవారం వరకు మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది.తెలంగాణలో రాగల మూడురోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదివారం నుంచి సోమవారం వరకు మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించింది.

సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వానలు పడే ఛాన్స్ ఉందని చెప్పింది. మంగళవారం నుంచి బుధవారం వరకు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు అతిభారీ వర్ష సూచన ఉందని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

ఏపీలో రక్తమోడిన రహదారులు

- సంతమాగులూరు, కదిరి అర్బన్



అమరావతి : రాష్ట్రంలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది మరణించారు. సొంత పనుల నిమిత్తం పట్టణానికి వచ్చి తిరిగి ఆటోలో వెళ్తుండగా కారు ఢీ కొనడంతో సత్యసాయి జిల్లా కదిరిలో నలుగురు, తమ బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొన్ని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆటోను లారీ ఢీకొనడంతో ప్రకాశం జిల్లాలో ఐదుగురు మరణించారు.

తమ బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు గుంటూరుకు చెందిన ఐదుగురు మహిళలు, ఇద్దరు పురుషులు ప్రకాశం జిల్లా మార్కాపురానికి శనివారం రాత్రి వచ్చారు. వేడుకల అనంతరం తిరిగి ఆటోలో గుంటూరుకు పయనమయ్యారు. సంతమాగులూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో గుంటూరు, కర్నూలు రహదారిపైకి వచ్చే సరికి ఆటోను లారీ ఢీకొంది. దీంతో గుంటూరు నల్లచెరువు ఒకటవ లైన్‌కు చెందిన అలివేలు మంగతాయారు (19), తమ్మిశెట్టి తులసి (16), గుంటూరుకు చెందిన పాల్యా నారీనాయక్ (19) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్ర గాయాలపాలైన గుంటూరు హౌసింగ్ బోర్డు ఆదర్శనగర్ మూడవ లైనుకు చెందిన చెలిమెళ్ళ కవిత (19), బుర్రి మాధవి (35)లను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. క్షతగాత్రులను నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రహదారిపై ఏర్పడిన గుంత నేపథ్యంలో పోలీసులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అతివేగంగా వచ్చిన లారీ డ్రైవర్ హెచ్చరిక బోర్డును తప్పించబోయి రాంగ్ రూట్‌లో ఆటో వైపు దూసుకెళ్లాడు. దీంతో ఆటో నుజ్జునుజ్జయ్యింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యసాయి జిల్లా కదిరి మండలం బుక్కపట్నం పరిధిలోని మదిరే బైలుతండా గ్రామానికి చెందిన కొంతమంది సొంతపనుల నిమిత్తం కదిరి వచ్చారు. తిరిగి ఆటోలో వెళ్తున్న క్రమంలో కదిరి మండలం ఎర్రదొడ్డి సమీపాన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నస్వామి నాయక్(45) చలపతి నాయక్ (46) ఆటో డ్రైవర్ భాస్కర్ నాయక్ (40) మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన శ్రీలేఖ (35)ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. క్షతగాత్రులను కదిరి ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. ఘటనాస్థలాన్ని డిఎస్‌పి శ్రీలత, సిఐలు సూర్యనారాయణ, తమ్మిశెట్టి మధు పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
ఎల్బీనగర్ - మహేశ్వరం - చార్మినార్
సోమవారం | సెప్టెంబర్ 04, 2023 | www.navatelangana.com

'కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా'



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నూతనంగా నియమితులైన ఆ పార్టీ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి ఓర్సు శ్రీనివాస్ అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్న గూడ, నీలం సంజీవ రెడ్డి నగర్ కాలనీకి చెందిన ఓర్సు శ్రీనివాస్‌ను తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ..తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తర్వాత టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్ రెడ్డి రంగారెడ్డి శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

'రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెబుతాం'



నవతెలంగాణ- బడంగ్ పేట్

నాయి బ్రాహ్మణుల సమస్యలను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని మంగళి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ బోల్లంపల్లి రాంబాబు హెచ్చరించారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల దాటుతున్నా ఇప్పటి వరకూ తెలుగు రాష్ట్రాల్లో ఏ ఒక్క నాయి బ్రాహ్మణుడు ఒక ఎమ్మెల్యే, ఎంపీ కాలేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో దాదాపు నాలుగు శాతం వరకు ఉన్న మమ్మల్ని అన్ని ప్రధాన పార్టీలు విస్మరించడం చాలా బాధకరమన్నారు. నాయి బ్రాహ్మణులు తెలియని ఊరు, వ్యక్తి ఉండడు, కానీ అలాంటి నాయి బ్రాహ్మణులకే రాజకీయంగా అన్యాయం జరగడం ఏమిటని నిలదీశారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైనా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు నాయి బ్రాహ్మణులకు ఐదు నుంచి ఏనిమిది వరకు ఎమ్మెల్యే రెండు ఎంపీ టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయి బ్రాహ్మణులకు అవకాశం ఇస్తే సమాజానికి ఎలా సేవ చేస్తామో చెప్పటానికి తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ నే నిదర్శనమన్నారు.

గిరిజన బిడ్డ వెంకటేశ్వరరావుకు డాక్టరేట్



నవతెలంగాణ -సంతోష్ నగర్

ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ఓబులరావు బంజర్ గ్రామానికి చెందిన పుల్సింగ్, జమలమ్మ దంపతుల కుమారుడు వెంకటేశ్వరరావు. ఇతను యాంటి క్యాన్సర్ గుణాల గురించి పరిశోధనలు జరిపారు. ఆ పరిశోధనలకుగాను సీఎస్ఐఆర్ -ఏసీఎస్ఐఆర్ సంయుక్తంగా వెంకటేశ్వరరావుకు డాక్టరేట్ ప్రధానం చేసింది. వెంకటేశ్వరరావు పేద కుటుంబానికి చెందిన వారు. టెన్త్ క్లాస్ పూర్తైన తర్వాత స్థానిక సత్తుపల్లిలోని విద్యా భారతి కళాశాలలో ఇంటర్మీడియట్, ఆ తదుపరి నవభారత కళాశాలలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశాడు. రసాయన శాస్త్రం మీద మక్కువతో కష్టపడి కాకతీయ విశ్వ విద్యాలయంలో ఎంఎస్సీ ఆర్గాన్-కెమిస్ట్రీ పూర్తిచేశాడు. ఈ ఎంఎస్సీ చదువుతున్న సమయంలో సహజ ఉత్పత్తులు మీద మక్కువతో తన పరిశోధనలు కొనసాగించుకోవాలనుకున్నాడు.పోటీ పరీక్ష సీఎస్ఐఆర్-నెట్-జేఆర్ఎఫ్‌లో ఉతీర్ణత సాధించారు. ఈ పరీక్ష ద్వారా ఫెలోషిప్‌ను పొందడమే కాకుండా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీఎస్ఐఆర్-ఐఐసీటీ హైదరాబాద్‌లో సీటు సంపాదించాడు. డాక్టర్ కె. సురేష్ బాబు, సీనియర్ ప్రధాన శాస్త్రవేత్త దగ్గర 2018 లో జాయిన్ అయ్యి యాంటీ క్యాన్సర్ ధర్మాలు గురించి విశేష పరిశోధనలు కొనసాగించాడు. ఇందుకు గాను సీఎస్ఐఆర్-ఐఐసీటీ, ఏసీఎస్ఐఆర్-ఇండియా సంయుక్తంగా డాక్టరేటు పట్టాను ప్రదానం చేసింది. బానోత్ వెంకటేశ్వరరావును శాస్త్రవేత్తలు కే. సురేష్ బాబు, శ్రీధర్‌రెడ్డి, విజయసారధి, నిషాంత్ జైన్, ఎస్. సురేష్, తోటి పరిశోధకులు అభినందించారు.

తెలంగాణలో

అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత



- పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

నవతెలంగాణ - సంతోష్ నగర్

తెలంగాణలో అన్ని మతాల ప్రజలకు సీఎం కేసీఆర్ సమాన ప్రాధాన్యతను ఇస్తున్నారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. రానున్న వినాయక చవితి, మిలాద్ ఉన్ నాబీ పండుగల సందర్భంగా ఆదివారం ఐపీఎస్ పోలీస్ అధికారులు, సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సౌత్ జోన్, హైదరాబాద్ నగరం పరిధిలోని ఆల్ జోన్ జనరల్ సెక్రెటరీ కిషన్ శర్మ ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం సోదరులకు ఐక్యత పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ ఆనంద్ మాట్లాడుతూ ప్రజలందరూ పండుగలను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో అన్ని మతాల వారికి ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. అనంతరం సీపీని గజమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ ప్రెసిడెంట్ ఖాజా అబ్దుల్ మోయిజ్, సౌత్ వెస్ట్ జోన్ అధ్యక్షుడు మహ్మద్ మౌజమ్ అలీ, సెంట్రల్ జోన్ ప్రెసిడెంట్ శశికాంత్ అగర్వాల్, ఈస్ట్ జోన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, వెస్ట్ జోన్ అధ్యక్షురాలు తేజో కుమారి, నార్త్ జోన్ అధ్యక్షుడు ఉమేందర్ కుమార్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్



నవతెలంగాణ - ధూల్ పేట్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులకు వెంటనే బదిలీలు చేపట్టాలని టీజీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కే.భాస్కర్ అన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ కాలేజీ అధ్యాపకుల బదిలీలు 2018 తరువాత జరుగలేదన్నారు. ఐదు ఏళ్లుగా బదిలీలు జరుగనందున వెంటనే టీచర్స్ తో పాటు లెక్చరర్ల బదిలీలు చెప్పట్టాలని కోరారు. విద్యాశాఖ మంత్రి సానుకూలంగా స్పందించి త్వరగా నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీజీసీజీటీఏ నాయకులు డాక్టర్ శంకర్ కుమార్, బీరయ్య, డాక్టర్ అడవి రాజులు తదితరులు ఉన్నారు.

కేంద్రం విస్మరించింది..రాష్ట్రం ఆదుకుంది..



- ఎమ్మెల్సీ ఎల్ రమణ

నవతెలంగాణ -చైతన్యపురి

టెక్స్టైల్స్, హ్యాండ్లూమ్ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించినా..రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొని అండగా ఉంటుందని ఎమ్మెల్సీ ఎల్ రమణ అన్నారు. సరూర్ నగర్ స్టేడియంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో ఆదివారం పద్మశాలి రాజకీయ శంఖారావం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్ రమణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్ రమణ మాట్లాడుతూ రాజకీయ రంగంతో పాటు వ్యాపార రంగంలో కూడా పద్మశాలీలు ఐక్యతగా ఉండాలి అన్నారు. తెలంగాణలో నిర్వహించిన కుటుంబ సర్వేలో దాదాపు 17 లక్షల మంది పద్మశాలీలు ఉన్నట్లు తెలిందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో చేనేత రంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించామన్నారు. రాజకీయ, సామాజిక నిర్ణయాలు, సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సహకరించే విధంగా కృషి చేస్తామన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమాల్లో కూడా పద్మశాలీల పాత్ర కీలకమన్నారు. మొట్టమొదటి చట్టసభల్లో ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కూడా కొండా లక్ష్మణ్ బాపూజీ ఎంతో క్రియాశీలకంగా ఉంటూ రాష్ట్రం కోసం పోరాడారని అన్నారు. సీఎం కేసీఆర్, కేటీఆర్‌లు నేతన్నలకు సెప్టెంబర్ నెల నుండి 3000 రూపాయలు ఇస్తున్నారన్నారు. మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్ మాట్లాడుతూ సరూర్నగర్ అంటేనే సిరిపురం యాదయ్య గుర్తొస్తాడని అన్నారు. పద్మశాలీల బతుకులు బాగుపడాలంటే రాజ్యాధికారం తప్పనిసరి అన్నారు.

తీర్మానాలు..

8 శాతం జనాభా కలిగి ఉన్న పద్మశాలీలకు ఆరు అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు, రాజకీయ పదవులలో వాటా, పంచాయతీ నుండి పార్లమెంటు స్థాయి వరకు సముచిత స్థానం కల్పించాలని తీర్మానాలు చేశారు. ఇంకా పద్మశాలి సమాజాన్ని గుర్తించే రాజకీయ పార్టీలను మాత్రమే గౌరవిస్తూ ఆ పద్మశాలి సమాజం గౌరవిస్తుందన్నారు. గతంలో ఉన్నటువంటి చేనేత జోలి శాఖను పునరుద్ధరించాలి. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి. పద్మశాలి డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వృత్తుల్లో కొనసాగుతున్న 90 శాతం పద్మశాలీలకు ఉపాధి, మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపరచాలి. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ రావు, కటకం నర్సింగరావు, గుజ్జ సత్యం, రాష్ట్ర మహిళా కార్యదర్శి రావిరాల సంధ్యారాణి, అఖిల భారత మహిళా అధ్యక్షురాలు వనం దుష్యంతుల, పున్నా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు



- ఎంపీటీసీ సీక సాయికుమార్ గౌడ్

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

అభివృద్ధికి ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు లష్కర్‌గూడ ఎంపీటీసీ సీక సాయికుమార్ గౌడ్ అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సమక్షంలో ఆదివారం లష్కర్ గూడ గ్రామానికి చెందిన 15 మంది కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీటీసీ మాట్లాడుతూ పేదల కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. అభివృద్ధిని ఆకాంక్షిస్తున్న యువత..ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సారథ్యంలో పని చేయడానికి ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం మరింత దూకుడు ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్, లష్కర్ గూడ సర్పంచ్ ఏసూరు పారిజాత శేఖర్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అల్లీ మల్లేష్, బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువత తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ యాదవ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ- నాగోల్

నాగోలు డివిజన్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన అఖిల భారత యాదవ మహాసభలో నాగోల్ యాదవ నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలను చింతల సురేంద్రనాథ్ యాదవ్, గొల్ల సతీష్ యాదవ్, చింతల రవీందర్ యాదవుల పర్యవేక్షణలో నిర్వహించారు. యాదవ కమిటీ అధ్యక్షులుగా చింతల కిరణ్ కుమార్ యాదవ్, ఉపాధ్యక్షులుగా ఎం సునీల్ కుమార్ యాదవ్, బి. సతీష్ కుమార్ యాదవ్, జె. శివకుమార్ యాదవ్, శ్రీను యాదవ్, ధణేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గొల్ల కృష్ణ యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా రాగం గణేష్ యాదవ్, కె. సందీప్ యాదవ్, శ్రీశైలం యాదవ్, కోశాధికారిగా సిహెచ్ జనార్దన్ యాదవ్, ఉప కోషాధికారిగా భరత్ యాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా భూపతి సాయి యాదవ్, రాజ బోయిన శ్రీకాంత్ యాదవ్, రాజు యాదవ్, జగదీష్ యాదవ్‌లతో పాటు మరో ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



గనవతెలంగాణ - బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 19 డివిజన్‌లోని గాయత్రి హిల్స్ కాలనీలోని శ్రీవిద్య టౌన్ షిప్ మైసమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఈశ్వరోజు బాలేష్ చారిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు అన్నదానం చేసిన గుడి కమిటీ సభ్యులు బాలేష్ చారిని పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు నారాయణ గౌడ్, ధనుష్ రెడ్డి, సుధాకర్ వివిధ కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'వడ్డెరులకు గుట్టలు, క్వారీలపై హక్కు కల్పించాలి'



నవతెలంగాణ-తుర్కయంజాల్

వడ్డెర వృత్తిదారులకు గుట్టలు, క్వారీలపై పూర్తి హక్కు కల్పించాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్ అన్నారు. తుర్కయంజాల్‌లోని వడ్డెర సంఘం ఆఫీసులో నర్ర పాండు అధ్యక్షతన ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డెర వృత్తిదారులకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. దేశానికి స్వాతంత్రం వచ్చినా వడ్డెరుల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందనంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని..రాష్ట్రంలో సుమారుగా 4000 సొసైటీలు ఉన్న ప్రభుత్వం ఇప్పటికి కూడా ఒక్క పైసా కూడా ఖర్చు చేయడం లేదన్నారు. వడ్డెర బంధును ప్రకటించి..వెనుకబడిన ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు, చనిపోయిన వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. అనంతరం వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారులు రూపని లోకనాథం మాట్లాడుతూ ఇండ్లు లేని వారికి డబల్ బెడ్ రూంలు, రేషన్ కార్డులు, పింఛన్లు, ప్రతి నియోజకవర్గంలో ఒక గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తి దారుల నాయకులు నర్ర శ్రీధర్, వేముల మల్లేష్, గండికోట సత్యం, వరికుప్పల అంజి, వరికుప్పల శ్రీను, ఓర్సు శ్రీను, ఓర్సు వెంకన్న, వేముల వాసు, ఇరుగదిండ్ల సైదులు, వరికుప్పల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన పలువురు



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న వివిధ కాలనీ వాసులు ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాషాయం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం పట్ల అన్ని వర్గాల ప్రజలకు నమ్మకం సడలిపోయిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, నడికుడి యాదగిరి, అనితా ప్రభాకర్, చిత్రం శ్రీను, నగిళ్ల యాదయ్య, దేశపాక జగన్ తదితర యువకులు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా బొడ్రాయి ఉత్సవాలు

- కుటుంబ సమేతంగా పాల్గొన్న దండెం బ్రదర్స్, స్థానిక కౌన్సిలర్స్





నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

తెలంగాణ సాంస్కృతిని ప్రతిబింబించే విధంగా బొడ్రాయి ఉత్సవాలను నిర్వహించడం తెలంగాణ పల్లెల్లో అనవాయతీగా వస్తుంది. పెద్ద అంబర్ పేటలో నూతనంగా పునప్రతిష్ఠించిన బొడ్రాయి(నాభిశిల), పోత లింగన్న స్వామి ఐదు రోజుల ఉత్సవాలలో భాగంగా రెండో రోజైన ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి కుటుంబ సభ్యులు, స్థానిక కౌన్సిలర్స్ వారి కుటుంబ సభ్యులు, మహిళలు భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి మాట్లాడుతూ పెద్ద అంబర్ పేటలో అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నాభిశిల(బొడ్రాయి) ఉత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

గణేష్ నిమజ్జన ఉత్సవ

కమిటీ చైర్మెన్‌గా ఉపేందర్ రెడ్డి, అధ్యక్షుడిగా రవీంద్ర



నవతెలంగాణ- చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్‌లో గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ 2023ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రతి సంవత్సరం కొత్తపేట పివిటి మార్కెట్ వద్ద నుండి గణేష్ నిమజ్జనానికి భారీగా తరలి వెళ్లే గణనాథులకు స్వాగత కమిటీ సభ్యుల ఆమోదంతో ఏకగ్రవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ గా చిలుక ఉపేందర్ రెడ్డి, అధ్యక్షుడిగా, ఫౌండర్ అధ్యక్షుడు గట్ల రవీంద్ర(హైటెక్ రామ్), ముఖ్య సలహాదారుడిగా ధనరాజ్ గౌడ్, ఏ.వి. రావు, పి ఆనంద్ కుమార్, సురేంద్ర కుమార్, కృష్ణారెడ్డి, వినోద్ కుమార్, శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా తలాటి రమేష్, కోశాధికారిగా హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా మురళీ, సుమన్, రామకృష్ణ, శేఖర్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, అక్షర్, కళ్యాణ్ , నబీ, దినేష్ సింగ్, ఆర్గనైజింగ్ సెక్రటర్సీగా జ్ఞానేశ్వర్, సలీం, మహేందర్, సూర్య పాల్ రెడ్డి, నగేష్, సాయికిరణ్, రాజు, నాగరాజ్, సంతోష్ గుప్తా, శివ, మల్లికార్జున్, వరుణ్, దయాకర్, రవి, జాయింట్ సెక్రటరీలుగా పెద్దపూర సైదులు, రాఘవేందర్, తిలక్, నగేష్, శ్రీశైలం, ఇమ్రాన్, శ్రీధర్, సంతోష్ కుమార్, శ్రావణ్, ప్రేమ్ నాయక్, విప్లవ్ రెడ్డి, సాయి జగదీష్, విజయ్, అషీఫ్, ఐతగోని శివ గౌడ్, వెలిజాల శ్రీశైలం, జహంగీర్, అనిల్, సిద్ధు, అష్రఫ్, అనుదీప్, భాస్కర్, పింట్, రాజు, ఇస్మాయిల్, మహేష్‌లు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్, అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా భారీ ఎత్తున స్వాగత వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, మంచి నీళ్లు, ప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. భక్తులు సహకరించాలని కోరారు.

సిటీ కళాశాలకు మరో మూడు ఉత్తమ అధ్యాపక పురస్కారాలు

నవతెలంగాణ - ధూల్‌పేట్

సిటీ కళాశాల మరో మూడు ఉత్తమ అధ్యాపక పురస్కారాలను సొంతం చేసుకుంది. సెప్టెంబర్ 5-జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవలు అందించిన అధ్యాపకులకు పురస్కారాలు ప్రకటించింది. ఇందులో సిటీ కళాశాల అధ్యాపకులు ముగ్గురు పురస్కారాలకు ఎంపికయ్యారు. ఎంపికైన అధ్యాపకులకు సెప్టెంబర్ 5న రవీంద్ర భారతిలో జరిగే వేడుకలలో రూ.10 వేల నగదుతోపాటు సర్టిఫికెట్, మెడల్ అందజేసి సన్మానిస్తారు. సిటీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, ఆంగ్లం, కామర్స్ విభాగాలకు చెందిన ముగ్గురు అధ్యాపకులు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ ముగ్గురు అధ్యాపనం, అధ్యయనం, పరిశోధన విషయాలలో త్రిముఖీన కృషి చేస్తున్నారు. గత సంవత్సరం లాగానే ఈసారి కూడా కళాశాలకు మూడు ఉత్తమ అధ్యాపక పురస్కారాలు రావడం పట్ల ప్రిన్సిపాల్ ఆచార్య పి. బాల భాస్కర్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం సంతోషాన్ని ప్రకటిస్తూ వారికి అభినందనలు తెలిపారు. ప్రతి ఏడు కళాశాల అధ్యాపకులు ఇలా ఉత్తమ పుర స్కారాలు అందుకోవడం చాలా సంతోషాన్ని కలి గించే వార్త అని, అధ్యాపకులందరూ విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి కృషి చేస్తున్నారని తెలిపారు.



ఆంగ్ల విభాగానికి అధ్యక్షుడిగా, అధ్యాపకుడిగా సేవలందిస్తున్నడాక్టర్ ఆది రమేష్ బాబు ఉస్మాని యా, కాకతీయ, శాత వాహన విశ్వవి ద్యాలయాల కోసం డిగ్రీ పాఠ్య పుస్త కాల, ఇంటర్మీడియట్ బోర్డు వారు ప్రచురించే ఇంగ్లీ షు పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ప్రధాన భూమిక వహిస్తున్నారు. సాహిత్య విశ్లేషణ, అనువాదం వీరి ప్రత్యేకతలు. ఇండియన్ ఇంగ్లీష్ లిటరేచర్: ఎ మెమెంటో ఆఫ్ ఫెమినిస్ట్ మైండ్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ అండ్ లెర్నింగ్: ప్రాబ్లమ్స్ అండ్ రెమెడీస్, ప్రిన్సిపల్స్ అండ్ టెక్నిక్స్ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ అండ్ లెర్నింగ్‌బీ కామన్వెల్త్ లిటరేచర్: యాన్ ఆంథాలజీ ఆఫ్ మొజాయిక్ థీమ్స్, అండ్ పోస్ట్‌కలోనియల్ లిటరేచర్: వివాదాస్పద కాన్సెప్ట్స్ ఆఫ్ సైలెన్స్ అండ్ వయొలెన్స్ వంటివి ఆది రమేశ్ సంపాదకత్వంలో వెలువడిన పుస్తకాలు. ఉస్మానియా విశ్వవిద్యాలయం గుర్తించిన రీసర్చ్ గైడ్‌గా ఉన్నారు.



డాక్టర్.ఎస్.ఝాన్సీ రాణి కామర్స్ అధ్యాపకురాలిగా 11 సంవత్సరాల సర్వీస్ పూర్తిచేశారు. వీరు జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో 30కి పైగా పరిశో ధనా పత్రాలను సమర్పించారు. 3 పాఠ్యపుస్తకాలను, 9 పరిశోధనా పత్రాలను, 6 అధ్యాయాలను ప్రచురించారు. ప్రస్తుతం సిటీ కళాశాలలో టీఎస్ కేసీ విభాగం ద్వారా విద్యార్థులకు వివిధ స్కిల్ డెవలప్మెంట్ కోర్సులను అందించటమే కాక ప్లేస్ మెంట్ అధికారిగా కూడా అదనపు సేవలందిస్తు న్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం గుర్తిం చిన గైడ్ గా కూడా పరిశోధక విద్యార్థులకు మార్గదర్శనం చేస్తున్నారు. పూర్వం పనిచేసిన కళాశాలల్లో కూడా వివిధ విభాగాలలో సేవలందించి ప్రశంసలు పొందారు.



రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్.ఎల్. తిరుపతి ఉస్మానియా నుండి పీహెచ్‌డీ పట్టా సాధించారు. ప్రసిద్ధ జాతీయ, అంతర్జా తీయ జర్నల్స్‌లో సుమారు 28 పరిశో ధనా పత్రా లు, 15కు పైగా పుస్తక అధ్యాయా లను అందించారు. భారతదేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో జరిగే జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పరిశోధనా పత్రాలను సమర్పించారు. పాశ్చాత్య, భారతీయ రాజకీయ ఆలోచనలు, తులనాత్మక రాజకీయ అధ్యయనాలు, అంతర్జాతీయ సంబంధాలు వారి పరిశోధనా ఆసక్తి. ఇటీవలే సిటీ కళాశాలలో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహించటంతోపాటు, ఐసీఎస్ఎస్ ఆర్ రీసర్చ్ ప్రాజెక్టు పొందారు.

'సమస్యల పరిష్కారంలో రాష్ట్రం విఫలం'



నవతెలంగాణ- బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్‌గుల్ గ్రామం ప్రెస్ కాలనీలోని ఏవీరెడ్డి కాలనీ వాసులతో ఛాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ నిమ్మల సునీతా శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో తేనేటీ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఎంసీ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, మాజీ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-ఉప్పల్
సోమవారం | సెప్టెంబర్ 04, 2023 | www.navatelangana.com

పనికి వెళ్ళిన వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-జవహార్ నగర్

పనికి వెళ్ళిన వ్యక్తి అదశ్యమయ్యాడు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం కార్పొరేషన్‌లోని అంబేద్కర్ నగర్ సండే మార్కెట్ సమీపంలో సజన్ బాబు, భార్య రమాదేవి ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. మద్యానికి అలవాటైన సజన్ చేసిన సంపాదనంతా ఖర్చుపెట్టేవాడు. ఈ నెల 2న భార్య రమాదేవిని భర్త సజన్ అంబేద్కర్ నగర్ బస్టాప్ వద్ద వదిలి పనికోసమని బయటకు వెళ్ళాడు. రమాదేవి పనులు ముగించుకొని ఇంటికి వచ్చి చూడగా భర్త సజన్ రాలేదు. దీంతో అతని ఆచూకి కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు భార్య రమాదేవి పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జిమ్మిగడ్డలో 66వ వారం జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డ జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతీ ఆదివారం జ్ఞాన మాల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రాజ్యాంగ అంబేద్కర్ విగ్రహానికి జి.ఆర్.రెడ్డి నగర్ ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి, సామాజిక ఉద్యమ నేత, చదువుల గురువైన మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి బి.జె.ఆర్ కాలనీ ఆలయ చైర్మెన్ చంద్రయ్య గుప్తా , బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి జ్ఞానమాల సభ్యులు జాషువా రాములు పూలమాల వేస్తూ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, బీజేఆర్ కాలనీ అధ్యక్షులు రహీం, జ్ఞానమాల టీం సభ్యులు నరసింహ చారి, రవి నాయక్, దయానంద్, నరేందర్ రావు, నాగేష్, చిన్నారావు, చందు, సుధాకర్ పాల్గొన్నారు.

ఉప్పల్ కమలంలో కల్లోలం

- మాజీ ఎమ్మెల్యేపై తిరుగుబాటు
- కొత్త అభ్యర్థికే అవకాశం ఇవ్వాలంటూ నేతల అల్టిమేటం
- మాజీ ఎమ్మెల్యేపై పెరుగుతున్న వ్యతిరేకత
- సంకటంలో కాషాయ నేతలు



నవతెలంగాణ-ఉప్పల్

ఓ వైపు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు వస్తుందని గొప్పలు చెప్తున్న కమలనాధులకు ద్వితీయ శ్రేణి నాయకుల నుంచి వస్తున్న వ్యతిరేకతతో కొత్త తలనొప్పి తప్పేలా లేదు. హైదరాబాద్ మహా నగర పరిధిలో పట్టుందని చెబుతున్న ఉప్పల్ కమలంలో కొత్త టెన్షన్ మొదలైంది. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌ను ఉప్పల్ అభ్యర్థిగా ప్రకటించొద్దంటూ పలువురు నేతలు తిరుగుబాటు చేస్తున్నారు.

డిపాజిట్ దక్కించుకోవాలని లక్ష్యంతో ముందకు

2018 ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయిన కమలనాధులు, వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ దక్కించుకోవాలని లక్ష్యంతో ముందకు వెళుతున్నారు. ఆ ఎన్నికల్లో ఉప్పల్‌లో బీజేపీ నుంచి పోటీ చేసిన ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. రెండో స్థానంలో కాంగ్రెస్ టీడీపీ అలయన్స్‌లో పోటీ చేసిన తూళ్ల వీరేందర్ గౌడ్ నిలిచారు. అయితే గత ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోవడంతో ఈ సారి సరైన నాయకుడి కోసం ఉప్పల్ కమలనాధులు తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టారు. అందులో భాగంగా ఉప్పల్‌లో కమలనాధులు అభ్యర్థిత్వం కోసం కొంతమంది సీనియర్ నాయకులు ఇతర నాయకులను కలిసి ఉప్పల్ లో కమలం పార్టీ తరఫున పోటీ చేసి తమ పరువు కాపాడాలంటూ కోరుతున్నట్టు తెలిసింది. తాజాగా సీనియర్ నాయకులు వీరేందర్ గౌడ్‌ను బీజేపీ ఉప్పల్ నాయకులు కలిసి ఎన్నికల్లో పోటీ చేయాలని కోరినట్టు సమాచారం

ప్రభాకర్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న కమల నాయకులు

ఉప్పల్ బీజేపీలో సీనియర్ నాయకులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌కు ఉప్పల్ సీటు కేటాయించవద్దంటూ పలువురు నాయకులు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. చిల్కానగర్‌లో నిర్వహించిన ప్రవాస్ యోజన కార్యక్రమంలో అస్సాం నుంచి వచ్చిన ఎమ్మెల్యే మనాబ్ డేఖ ముందు బహిర్గతంగా ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వద్దు అంటూ ఉప్పల్ కమలం నేతలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొత్త నాయకులకు అవకాశం ఇవ్వాలంటూ వారు డిమాండ చేశారు. దాంతో కమలం సీనియర్ నేతలకు, ఎన్‌వీఎస్ఎస్ వర్గీయుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం అక్కడే ఉన్న కొంతమంది నాయకులు కల్పించుకొని గొడవను సద్దుమణిగించారు.

ఉప్పల్ కమలంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తర్వాత సెకండ్ కేటగిరి నాయకులు లేరా లేక పెద్ద స్థాయి నాయకులే కింద స్థాయి నాయకులను ఎదగనిస్తాలేరా అనే సందేహం నాయకులలో, కార్యకర్తల్లో నెలకొంది. దీంతో కార్యకర్తలు, నాయకులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. కమలం సీనియర్ నాయకులు ఇప్పుడు జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్‌లో కొత్త అభ్యర్థిని దింపాలని అధిష్టానానికి, రాష్ట్ర నాయకులకు సూచిస్తున్నారు.

బీజేపీ చూపు గడ్డం సాయికిరణ్ వైపా?



ఉప్పల్ నియోజకవర్గంలో ఎన్‌వీఎస్ఎస్ అభ్యర్థిని మార్చాలని బహిర్గతంగా కమల నాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈటల రాజేందర్ ముఖ్య అనుచరుడు గడ్డం సాయికిరణ్ వైపు బీజేపీ నాయకత్వం ఆలోచిస్తున్నదనే సందేహం కలుగుతోంది. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన సత్యసాయి విద్యాసంస్థల చైర్మెన్ యువ నాయకుడు గడ్డం సాయికిరణ్‌కు యువతలో ఫాలోయింగ్ ఉండడంతో పాటు ఆయన అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారనే పేరు ప్రతిష్ట ఉండ డంతో బీజేపీ అధిష్టానం గడ్డం సాయికిరణ్ వైపు ఆలోచిస్తుందని వివిధ నాయకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే గడ్డం సాయికిరణ్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్నారు . అలాగే అతను బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి దీంతో అధిష్టానం గడ్డం సాయికిరణ్ బరిలో దింపే ఆలోచనలో ఏమైనా ఉందా వేచి చూడాల్సిందే.

వీరేందర్ గౌడ్ తో ఉప్పల్ కమల నేతల సమావేశం

2018 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన వీరేందర్ గౌడ్‌ను ఈ ఎన్నికల్లో బీజేపీ ఉప్పల్ అభ్యర్థిగా పోటీ చేయాలని కోరుతూ ఉప్పల్ కమలనాధులు వీరేందర్ గౌడ్‌తో ఇటీవల సమావేశమయ్యారు. సీనియర్ నాయకులు మాట్లాడుతూ ఈ విషయాన్ని అధిష్టానం దష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పార్టీ సమర్థవంతమైన నాయకులకు టికెట్ ఇచ్చేలా అధిష్టానంపై ఒత్తిడి తెస్తామన్నారు.



ఉప్పల్ కమలంలో ప్రశ్నిస్తే బహిష్కరిస్తారా?

- బీజేపీ స్పోక్ పర్సన్ ఇలిటన్ నరసింహారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

బీజేపీలో ఎలాంటి తప్పు చేయకుండానే తన ఎదుగుదలను చూసి, తన ప్రశ్నించేతనాన్ని ఓర్వలేక బీజేపీ నుంచి బహిష్కరిస్తారా? అని బీజేపీ స్పోక్ పర్సన్ నరసింహ రెడ్డి అన్నారు. పార్టీని పార్టీ కార్యకర్తలు పట్టించుకోని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌ను ప్రశ్నించి నందుకు తనపై బహిష్కరణ వేటు వేశారని తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తనపై అర్హత వేటు వేసే అధికారం డివిజన్ అధ్యక్షుడికి లేదని.. అయినా కూడా కావా లని తాను చేసిన తప్పులు ఏమిటో చెప్పకుండా పార్టీ నుంచి షోకా స్ నోటీసు ఇవ్వకుండా.. పార్టీ నుంచి ఎలా బహిష్కరిస్తారని ప్రశ్నించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ గెలిచాక పార్టీ నాయకులకు గాని కార్యకర్తలకు గాని ప్రజలకు గాని చేసింది ఏమీ లేదన్నారు. దోచుకొని దాచుకున్నాడని విమర్శించారు. పార్టీ హైకమాండ్‌కు వారిపై ఫిర్యాదు చేస్తానని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఏ నాయకుడిని ఎదగనీయకుండా తానే ఏక చక్రాధిపత్యంగా ఉండాలని.. పార్టీలో ఎవరు ప్రశ్నించిన వారిని ఎదగనీయకుండా చూసే ఘనత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌ది అన్నారు.

బీఆర్ఎస్ నేత కూతురు వివాహానికి హాజరైన సీఎం కేసీఆర్



తుంకుంట మున్సిపాలీటీ అంతాయిపల్లి పరిధిలోని ఎస్ ఎన్ ఆర్ పుష్ప కన్వెన్షన్ లో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రావుల శ్రవణ్ కుమార్ రెడ్డి కూతురు వివాహానికి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను సీఎం ఆశీర్వదించారు.

నవతెలంగాణ-శామీర్ పేట

15 ఎకరాల్లో ఆహ్లాదకరమైన పార్కును తయారుచేస్తాం

- రూ. 1.35 కోట్లతో ఎఫ్ఎస్‌టీపీ, ఏబీసీ సెంటర్ పనులకు శంకుస్థాపన
- కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రగతి పనులతో దేశంలోనే తెలంగాణ చరిత్రను సృష్టించిందని, సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ప్రత్యేక విజన్‌తోనే తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధించిందని చెప్పారు. జవహర్ నగర్ కార్పొరేషన్ ఎఫ్ఎస్టీపీ, ఏబీసీ సెంటర్ల ఏర్పాటుకు రూ. 1.35 కోట్లతో అభివద్ధి పనులను మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, కమిషనర్ రామలింగంతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ప్రతిపక్షాలు ఏమీ చేయ లేక తికమక పడుతున్నాయని అన్నారు. జవహర్ నగర్‌లో ప్రగతి పనులు పరుగులు పెడుతున్నాయని, కార్పొరేషన్‌లో గతంలో మౌలిక వసతులు లేక అవస్థలు పడ్డారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో జవహర్ నగర్ మోడల్ సిటీగా మారుతున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు, కార్మికులు, కులవత్తులు, సబ్బండ వార్గలు సంతోషంగా ఉన్నారని, సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే తెలంగాణ అనతి కాలంలోనే దేశానికి వెన్నెముకలా నిలిచిందని తెలి పారు. ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుం టామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏకే మురుగేష్, జిట్టా శ్రీవాణ శ్రీనివాస్ రెడ్డి, మేక లలితాయాదవ్, పల్లపు రవి, లావణ్య సతీష్ గౌడ్, మెట్టు ఆశాకుమారి, రాజ్ కుమార్, శివాజీ, బల్లి రోజాశ్రీనివాస్, నిహారిక, శాంతికోటేష్ గౌడ్, రాంచందర్, బీఆర్ఎస్ స్థానిక అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, యువజన విభాగం అధ్యక్షుడు భార్గవ్, ఉద్యమకారులు పిన్నోజు సుధాకరాచారి, సింగన్న బాల్‌రాజ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరిపల్లిలో ఉద్రిక్తత

- అక్రమంగా వెలిసిన గుడిసెలు
- ఖాళీ చేయాలని గ్రామస్తుల డిమాండ్



నవతెలంగాణ-శామీర్ పేట

తుంకుంట మున్సిపాలిటీ ఉప్పరిపల్లి గ్రామంలో ప్రభుత్వ స్థలం సర్వే నెంబర్ 837లో శనివారం రాత్రికి రాత్రే గుడిసెలు వెలిశాయి. ఆదివారం ఉదయం సమాచారం అందుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి అక్రమంగా కబ్జా చేసిన వాళ్ళను ఆ స్థలం నుంచి ఖాళీ చేయాలని అడగడానికి వెళితే వారు కారం పొడి, కట్టెలు, రాళ్లతో దాడి చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. భయభ్రాంతులకు గురైన గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు, పోలీసులకు పిర్యాదు చేసారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కుమార్, పోలీసులు అక్కడికి చేరుకుని గుడిసెలు వేసినవారిని ఖాళీ చేయిస్తామని గ్రామస్తులకు తెలిపారు. అయితే గతంలో దేవేందర్ గౌడ్ మంత్రిగా ఉన్నప్పుడు గ్రామానికి చెందిన పేదలకు 837 సర్వే నెంబరులో ఇండ్ల పట్టాలు ఇచ్చారని.. ఇప్పుడు ఎక్కడి నుంచో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తోపుడు బండ్లు, చిరు వ్యాపారుల సంఘం వాళ్ళమని ప్రభుత్వం తమకు కేటాయించిందని రాత్రికి రాత్రే గుడిసెలు వేశారని గ్రామస్తులు చెబుతున్నారు. అడగడానికి వెళ్లిన గ్రామస్తులపై రాళ్ళు, కట్టెలు, కారం పొడితో దాడి చేసి గాయపరిచారని, ఒకరి తలకు తీవ్ర గాయమై రక్త స్రావం కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించామని తెలిపారు. తమకు న్యాయం చేయాలని మంత్రి ని, అధికారుల ను గ్రామస్తులు కోరుతున్నారు.

క్రీడలతో ఆరోగ్యవంతమైన జీవితం



- మేయర్ జక్కవెంకట్ రెడ్డి
- పీర్జాదీగూడలో సన్ బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

నవతెలంగాణ-బోడుప్పల్

నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరి జీవితంలో వ్యాయామం తప్పనిసరిగా ఉండాలని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని నూతనంగా ఏర్పాటు చేసిన సన్ బ్యాడ్మింటన్ అకాడమీని స్థానిక కార్పొరేటర్ పప్పుల అంజిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నేటి బిజీ లైఫ్ లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రీడలు, వ్యాయామం అలవాటు చేసుకోవాలని అన్నారు. క్రీడలతో ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చన్నారు. ఇలాంటి అకాడమీలు ఏర్పాటు చేయాడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. బీఆర్ఎస్ పీర్జాదిగూడ నగర అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దర్గా దయాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బండి రమ్య సతీష్ గౌడ్, పప్పుల అంజిరెడ్డి, బ్యాడ్మింటన్ కోచ్ గోవర్ధన్ రెడ్డి, నిర్వహకులు నాగరాజు, సాగర్, ఉదయ్ కుమార్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.







దుండగులను కఠినంగా శిక్షించాలి

- కేవీపీఎస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేకను ఎత్తుకెళ్లాడని తలకిందులుగా చెట్టుకు కట్టేసి వేలాడదీసి దౌర్జన్యం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం యాపల్ ప్రాంతంలో చాకలి రాములు అనే యాజమానికి మేకల కాపరిగా ఉన్న ఓ యువకుడిని అతని స్నేహితుడిని దళిత యువకులు మేకలు ఎత్తుకెళ్లారంటూ చెట్టుకు కట్టేసి తలకిందులుగా వేలాడదీసి అమానుషంగా దౌర్జన్యానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను కేవీపీఎస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృపాసాగర్, నాగనిగళల బాలపీరు డిమాండ్ చేశారు. అనుమానం వచ్చి యజమాని నిలదీసి అడిగితే మీ కాపరి సహకారంతోటే మేకను తీసుకువెళ్లామని నిజం ఒప్పుకున్నారని తెలిపారు. చట్టం ప్రకారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి కానీ చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుని మధ్యయుగాల కాలం నాటి అమానుషాలకు ఒడిగట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. దళితుడు నా మేకను దొంగలిస్తాడా అనే కుల దురహంకారంతో తలకిందులుగా ఇద్దరు యువకులను చెట్టుకి వేలాడదీసి చెట్టు కింద అగ్గిమంట కింద చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. యువకుల తల్లిదండ్రులు మేక ఖరీదు రూ.3000 చెల్లిస్తామన్నా వినకుండా దాడికి పాల్పడటం సరికాదన్నారు. ఆ అవమానం భరించలేక ఒకరు ఎవరికి చెప్పకుండా పారిపోయాడన్నారు. తక్షణమే మేకల యజమాని చాకలి రాములుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లాలో వరుస ఘటనలు జరుగుతున్నా జిల్లా పోలీసు యంత్రాంగం పెత్తందారుల ఆగడాలను అరికట్టడంలో విఫలం అయ్యారన్నారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ అమానుష ఘటనను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు.



రజక సంఘం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న బీఎల్ఆర్

నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డ రజక సంఘం అధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్, పెద్దాపురం కుమార స్వామి, యాకయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ తుర్కయంజాల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేతరి దర్శన్



నవతెలంగాణ - తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేతరి దర్శన్ నియమితులయ్యారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ నియామక పత్రాన్ని జారీ చేశారు. ఈ మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్ రెడ్డి రంగారెడ్డి ఆదివారం దర్శన్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దర్శన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పోచమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-శామీర్‌పేట

శామీర్‌పేట మండలం మురహరి పల్లి గ్రామంలో శ్రీ పోచమ్మ ఆలయంలో ఆదివారం నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్మిక శాఖ మంత్రి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చామకుర మహేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ ధార భాస్కర్, బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ బి.నర్సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి



- బీఆర్ఎస్ బోడుప్పల్ నగర అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ బోడుప్పల్ నగర అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు పెంచిన ఘనత కేసీఆర్ సర్కారుకే దక్కుతుందని అన్నారు.అదే విధంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి సౌకర్యం కల్పించేలా కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డితో మాట్లాడుతానని అన్నారు. అనంతరం కార్మికులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, చంటి శ్రీనివాస్, ఈ.శ్రీనివాస్, ఉప్పరి విజయ్, మోతే రాజు,సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-ఉప్పల్

తెలంగాణ రాష్ట్ర మేర యువత ఆధ్వర్యంలో ఉప్పల్ విజయపురి కాలనీలోని గోవర్ధన్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఆదివారం 2023 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మేర కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, వారి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మేర బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా తన తరఫున రూ.33 వేల నగదు బహుమతిని అందజేస్తానని బండారి లక్ష్మారెడ్డి ప్రకటించారు.

ఈ టోర్నమెంట్‌లో 150 మంది క్రీడాకారులు జిల్లాల నుంచి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కార్పొరేటర్ మునిగల సతీష్ కుమార్ మేరు, నిర్వాహకులు గుడ్డేటి అరుణ్ కుమార్, కే రమేష్, కొప్పూరి చంద్రకాంత్, ఎం శ్రావణ్ కుమార్, కర్నే ధరణి, పెండ్యాల గిరిధర్, తెలంగాణ మేరు జేఏసీ కో కన్వీనర్ సింగ్ విష్ణు మేరు, మేరు కవులు, కళాకారుల సంఘం కమిటీ సభ్యులు కొత్తకొండ కరు ణాకర్, బీఆర్ఎస్ నాయకులు ఆకుల మహేందర్, రామ్ రెడ్డి, చింతల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద హై స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



వాల్యూ మోమెంటం వారి సోషల్ రెస్పాన్సిబుల్టీ (సి.ఎస్.ఆర్) సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 డివిజన్ సుభాష్ నగర్ పరిధిలోని వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్‌లో ఆదివారం నిర్మాన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో భాగంగా జనరల్ ఫిజీషియన్, పీడియాట్రిక్, డెంటిస్ట్, ఆర్థోపెటిక్, గైనకాలజిస్ట్ పాల్గొన్నారు. సుమారు 500 మందికి ఫ్రీ హెల్త్ చెక్ అప్ చేసి వారికి ఉచితంగా మందులు సరఫరా చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ రాజేష్, డాక్టర్ల బృందం , పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్ గౌడ్, కరెస్పాండెంట్ ఎం.సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శారదకు అభినందనలు తెలిపిన కార్పొరేటర్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, సూరారం 129 డివిజన్‌కి చెందిన శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శ్రీరంగవరం మేడ్చల్ జిల్లా ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. తెలంగాణ స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు 2023 రాష్ట్రపతి చేతుల మీదుగా ఆమెకు అందజేశారు. వారిని అభినందిస్తూ స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ఆదివారం వారిని శాలువాతో సత్కరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఉన్నత శిఖరాలను అధిరోయిస్తూ, మరెన్నో అవార్డులు సాధించాలని కోరుకుంటున్న అన్నారు.

డివిజన్‌లలో చెత్త కుప్పలు.. సకాలంలో తొలగించని సిబ్బంది

- అపరిశుభ్రంగా ఉన్న బస్తీలలో విజృంభిస్తున్న దోమలు
- దోమలకు ఆవాసాలుగా నాలా పరివాహక ప్రాంతాలు
- తూతూమంత్రంగా ఫాగింగ్ నిర్వహణ
- డివిజన్‌ల్లో పొంచి ఉన్న వ్యాధులు



నవతెలంగాణ-బాలానగర్

ప్రతి మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే ప్రధానమైనది పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం కోసం ఓ ప్రత్యేక వ్యవస్థ, ఇందుకోసం ప్రత్యేక అధికారులు, సిబ్బంది వీరందరికీ కలిపి నెలకొచ్చేసరికి రూ.లక్షల్లో వేతనాలు ఉంటాయి. మరోవైపు పట్టణాల పరిశుభ్రత కోసం రూ.కోట్లలో చెల్లింపులు, ఇదంతా ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్నా కూకట్‌పల్లి నియోజకవర్గంలో "ఓ వైపు చెత్త.. మరో వైపు మురుగు"తో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం భరత్ నగర్, మూసాపేట, బాలానగర్, ఫతేనగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. నిత్యం అంతర్గత అక్కడక్కడ రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తూ పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తుంటే మరో పక్క డివిజన్ పరిధిలో అందుకు భిన్నంగా మురుగు, చెత్త రహదారులపై దర్శనమిస్తున్నాయి. మురుగు ప్రవాహం వల్ల దోమలకు ఆవాసాలుగా మారి ప్రజలు వ్యాధుల బారినపడే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక డ్రయినేజీలోని పూడికను పారిశుద్ధ్య సిబ్బంది సరైన సమయంలో తొలగించక పోవడంతో మురుగు నీరు రోడ్డు పైకి చేరి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నా, అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు, పారిశుద్ధ్య సమస్యకు త్వరితగతిన పనులు పూర్తి చేసి స్థానిక నివాసితులకు మెరుగైన వాతావరణాన్ని కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గంధంతో స్థానికుల ఇబ్బందులు

మ్యాన్‌హోళ్లలో చెత్తా చెదారం సకాలంలో తొలగించకపోవడం వల్ల తరచూ మురుగు లీకై రోడ్డుపై అధికంగా ప్రవహిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. వ్యర్థాలను తీసి రోడ్డుపై కుప్పలుగా వేసి తొలగించక పోవడంతో దుర్వాసన వెదజల్లడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీసిన సిల్ట్‌ను వెంటనే తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. డివిజన్‌లో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరారు.

తూతూమంత్రంగా ఫాగింగ్

దోమల నివారణకు బస్తీలు, కాలనీలలో ఫాగింగ్ నిర్వహించడంలో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తూతూమంత్రంగా ఫాగింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమల నివారణకు ప్రభుత్వం రసాయనాలకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తుంటే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫాగింగ్ నిర్వహణ సక్రమంగా జరిగేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఈపీఎస్ 95 చట్టానికి సవరణలు చేయాలి



- తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టాప్రా)

నవతెలంగాణ-దుండిగల్

దేశ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఈ. పీ. ఎస్. 95 పెన్షన్ దారులకు కనీసం పెన్షన్ ప్రస్తుతం ఉన్న 1000 రూ.9000 కు పెంచాలనీ, దాని పై కరువు భత్యం చెల్లించాలని, పెన్షన్ దారులకు ఆరోగ్య రక్షణ కల్పించాలని 'టాప్రా' మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి టి. బాలగంగాధరరావు డిమాండ్ చేశారు. ఆదివారం కూకట్‌పల్లి 'టాప్రా' ప్రగతినగర్ విభాగం స్థానిక ఎన్. టీ. ఆర్. పార్క్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలోని 75 లక్షల మంది ఈ. పీ. ఎఫ్. పెన్షన్ దారుల ఆక్రందనలు కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని, మౌనం వహిస్తుందని దీని పర్యవసానం వలన రాబోయే లోకసభ ఎన్నికల్లో అధికార పార్టీకి ఇబ్బందులు తప్పవని ఆయన హెచ్చరించారు. కనీస పెన్షన్ పెంచడానికి, దాని పై కరువు భత్యం చెల్లించడానికి ఏవైనా చట్టపరమైన అవరోధాలు ఉంటే ఈ. పీ. ఎస్. 95 చట్టానికి అవసరమైన సవరణలు చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. 'టాప్రా' కూకట్‌పల్లి ఏరియా అధ్యక్షుడు ఎల్. దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో తమకు కనీస పెన్షన్‌ను రూ. 9000 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన పార్టీ కే ఓటు వేయాలన్నారు. 'టాప్రా' మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ అకోలాలో జరిగిన సమావేశపు తీర్మానానికి అనుగుణంగా "జాగో ఈ. పీ. ఎస్. పెన్షనర్ జాగో" "నో హైయ్యర్ పెన్షన్ నో ఓట్" (ఈ. పీ. ఎస్. పెన్షన్ దారుడా మేలుకో అధిక పెన్షన్ చెల్లించక పోతే ఓట్ వేసేది లేదు) అనే స్టిక్కర్‌ను ప్రతి పెన్షన్ దారుడు తమ ఇంటి గోడ పై అతికించాలని, వోటు అడగడానికి వచ్చే రాజకీయ అభ్యర్థులను పెన్షన్ పై నిలదీయాలని కోరారు. కార్యదర్శి కే.శంకరరావు సమావేశం లోని ప్రతి ఒక్కరికీ స్టిక్కర్‌లను అందించారు. అనంతరం అత్యధికంగా పాల్గొన్న ఈ.పీ.ఎస్. పెన్షన్ దారులు అందరూ స్టిక్కర్లు పట్టుకుని, నినాదాలు చేసుకుంటూ ఎన్టీఆర్ పార్క్ నుంచి త్రీ మంకీ స్ కూడలి వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. అక్కడ నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎన్. కృష్ణయ్య, వి.శ్రీనివాసరావు, పెన్షనర్స్ పాల్గొన్నారు.

డాక్టర్ పీవీ సత్యనారాయణకు ఎంఎస్ స్వామినాథన్ అవార్డు

- ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్టుగా పని చేస్తున్న సత్యనారాయణ
- హైబ్రిడ్ వరి వంగడాల అభివృద్ధిలో కృషికి గుర్తింపు
- రాజేంద్రనగర్ ఐసీఏఆర్ ప్రాంగణంలో అవార్డు ప్రధానోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

2021-22 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక 8వ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ అవార్డును రాగోలులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పీవీ సత్యనారాయణకు అందించారు. రిటైర్డ్ ఐసీఏఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (రికార్), నూజివీడు సీడ్స్ లిమిటెడ్ (ఎన్ఎస్ఎల్) సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ ద్వైవార్షిక జాతీయ అవార్డు కింద రూ.2 లక్షల నగదు, బంగారు పతకం ఇచ్చారు. ఆగస్టు 2న డాక్టర్ ఎ.పద్మరాజు అధ్యక్షతన జరిగిన అవార్డు ఎంపిక కమిటీ బీపీహెచ్, బీఎల్‌బీ, బ్లాస్ట్, ముంపు, లవణీయతలను నిరోధించే.. సన్నరకం, మొత్తం భారతదేశంలో ప్రభావం చూపిన హైబ్రిడ్ వరి వంగడాలను అభివృద్ధి చేయడంలో చేసిన కృషికి డాక్టర్ పి.వి.సత్యనారాయణను ఎంపిక చేసింది. ప్రస్తుతం రాగోలులోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్టుగా డాక్టర్ పి.వి.సత్యనారాయణ పని చేస్తున్నారు. నూజివీడు సీడ్స్ లిమిటెడ్ (ఎన్ఎస్ఎల్) కంపెనీ ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎన్ఎస్-ఎల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. రాజేంద్రనగర్ లోని ఐసీఏఆర్-ఐఐఆర్ఆర్‌లోని డాక్టర్ ఎస్వీఎస్ శాస్త్రీ ఆడిటోరియంలో రికారియా సిల్వర్ జూబ్లీ వేడుకలతో పాటు ఈ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీఏఆర్ డీజీ, డీఏఆర్ఈ కార్యదర్శి డాక్టర్ హిమాన్షు పాఠక్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఇంకా డీఏఆర్ఈ కార్యదర్శి, ఐసీఏఆర్ మాజీ డీజీ డాక్టర్ ఆర్ఎస్ పరోడా, ఐసీఏఆర్ మాజీ డీడీజీ డాక్టర్ ఈఏ సిద్దిఖ్, ఐసీఏఆర్-ఐఏఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఏకే సింగ్, ఎన్ఎస్ఎల్ కంపెనీస్ సీఎండీ ఎం.ప్రభాకరరావు, ఐసీఏఆర్-ఐఏఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎం సుందరం తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూజివీడు సీడ్స్ లిమిటెడ్ సీఎండీ ఎం.ప్రభాకరరావు మాట్లాడుతూ "ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డు ఇప్పటి వరకు 8 మందికి ప్రకటిస్తే అందులో నలుగురు తెలుగు రాష్ట్రాల వారే కావడం ముదావహం. వ్యవసాయంలో మన దేశం అసాధారణ ప్రగతి సాధించింది. కానీ, మనం చేస్తున్న పనులకు కేంద్ర ప్రభుత్వం మద్దతు లేకపోతే అవి సమాజం మీద తగినంత ప్రభావం చూపించ లేవు. ప్రభుత్వాలు ప్రధానంగా వినియోగదారుల కోణం నుంచే చూస్తున్నాయి తప్ప రైతుల కోణంలో చూడట్లేదు. బియ్యం ఎగుమతులకు మంచి డిమాండు ఉన్నా, ఇటీవల దాన్ని నిషేధించారు. ఇక్కడ కావల్సినన్ని నిల్వలు ఉంచుకుని ఎగుమతులను ప్రోత్సహిస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుంది. పత్తిలో హైడెన్సిటీఈ సాగు విషయంలో ప్రయోగాలు చేస్తున్నాం. దీనివల్ల సాధారణ సాగుకంటే 30-40శాతం దిగుబడి పెరుగుతుంది. తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఇది 50-60శాతం వరకు కూడా ఉంటుంది. రాబోయే ఐదేండ్లలో సత్యనారాయణ చేతుల మీదుగా వచ్చిన వరి రకాలు దేశంలో అత్యధికంగా సాగు అవుతాయన్న నమ్మకం నాకుంది. ఈ అవార్డు ఆయనకు వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉంది. రికారియా సభ్యులందరికీ సిల్వర్ జూబ్లీ సందర్భంగా అభినందనలు" అని తెలిపారు.

6న 64వ శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 6వ తేదీన 64వ శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షులు యల్లావుల చక్రధర్ యాదవ్ తెలిపారు. ఈ ఉత్సవాలను సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని మెహబూబ్ కాలేజీ ఆరణలో రాత్రి 7 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఏఏఎస్‌లు, ఏపీఎస్‌లు, ఇతర శాఖల అధికారులు పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జెండా వందనం, గోపూజ, ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు, సన్మానాలు, శ్రీకృష్ణ పూజ, డోలాహరణం ఉంటాయని తెలిపారు. ఈ కార్యమానికి అందరూ విచ్చేసి విజయవంతం చేయాలని చక్రధర్ యాదవ్ కోరారు.

ప్రజల సమస్యలపై ఎమ్మెల్సీ పాదయాత్ర



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాల్టీ 22వ వార్డు మల్లంపేట్ జీఎల్సీ లే అవుట్‌లో ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదివారం పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసుకున్న చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అన్ని డివిజన్‌లో ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పని చేయనున్నట్లు ఎమ్మెల్యే కె.పి వివేకానంద తెలిపారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కమిషనర్ రామకృష్ణ రావు, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి, శంకుస్థాపన కార్యక్రమాలు చేశారు. ప్రజాప్రతినిధులతో 1వ డివిజన్ పరిధిలో ప్రగతి యాత్రలో భాగంగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావుతో, సీనియర్ నాయకులు సుబ్బారావుతో, స్థానిక డివిజన్ వాసులతో కలిసి పాద యాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా క్రాంతి నగర్ కాలనీలో రూ.47.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభోత్సవం, రూ. 20 లక్షల వ్యయంతో క్రాంతి నగర్ కాలనీ పార్కులో చిల్డ్రన్ ప్లే ఎక్విప్మెంట్ ప్రారంభోత్సవం, క్రాంతి నగర్ రోడ్ నెం.8 లో రూ. 80 లక్షల వ్యయంతో 900 ఎంఎం డయా అండర్ గ్రౌండ్ డ్రయినేజీ లైన్ నిర్మాణ పనులు ప్రారంభోత్సవం, రూ. 24 లక్షల వ్యయంతో కేఆర్సిఆర్ కాలనీలో సెంట్రల్ లైటినింగ్ ప్రారంభోత్సవం, కేఆర్సిఆర్ కాలనీ రోడ్ నెం.6 లో రూ. 40 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణ పనులకు శంఖుస్థాపన, రూ. 75లక్షల వ్యయంతో ప్రణీత్ ప్రణవ్ అంటిల్లా నుండి మొండికుంట వరకు స్ట్రామ్ వాటర్ లైన్ నిర్మాణ పనులు ప్రారంభోత్సవం, రూ. 71 లక్షల వ్యయంతో కేఆర్సిఆర్ కాలనీ బొంగులకుంట పార్కులో పలు అభివృద్ధి పనులు(స్టోన్ పిట్చింగ్, లైట్నింగ్ ,కాంపౌండ్ వాల్)ప్రారంభోత్సవం,1 కోటి 5 లక్షల వ్యయంతో దయ్యాలకుంట పార్క్ వద్ద కాంపౌండ్ వాల్ నిర్మాణం, ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ ప్లే అరీనా ప్రారంభోత్సవం, రూ. 12 లక్షల వ్యయంతో రెయిన్బో కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్పొరేషన్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఇండ్లపై దౌర్జన్యం తగదు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి మండల పరిధిలోని ఎన్టీఆర్ నగర్, జర్నలిస్టు కాలనీ, రాజీవ్ గాంధీ నగర్,ఇంద్రన్న కాలనీ అలాగే సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ ఇంటిని దౌర్జన్యంగా రెవెన్యూ అధికారులు, తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ , వారి బృందం కూల్చివేయడంపై సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమ మహేష్ నేతృత్వంలో పరిశీలించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ జీఓ నెంబర్ 59 ప్రకారం అప్లై చేసుకున్న పేద ప్రజలను ఇబ్బంది పెట్టడం సరి కాదని ఆవేదన వ్యక్తంచేశారు. జీఓ నెంబర్ 59లో 2014 సం॥ రంలో వున్న ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎంత వుందో అంత వేయాలి కానీ అడగొలిగా వారి ఇష్టం వచ్చినట్లు వేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. సర్వే నెంబర్ 191లో ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆ భూమికి ఒకటే లెక్క ఉంటుందని, ఇక్కడ అంత గందరగోళంగా ఉందని అన్నారు. బాధిత ప్రజలు తెలియజేస్తున్న ప్రకారం 60 గజలకు ఒకరి 1,26,000 వస్తే ఇంకొకరికి 4,00,000 వస్తుంది. అదే 120 గజాలకు ఒకరికి 2,52,000 వేస్తే ఇంకొకరికి 14,00,000 ఇంకొకరికి 15,75,000 ఎలా వస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఇష్టానుసారంగా భారం మోపి ప్రజల పై దౌర్జన్యం చేస్తుందని అన్నారు. కొంత మంది కబ్జా దారులకు సహాయం చేయడానికి ఇలా రెవెన్యూ అధికారులు ప్రజల వద్ద అని ఇంటి పన్ను, కరెంటు బిల్లులు, నల్ల బిల్లు అని వున్న ప్రజల పై దౌర్జన్యం చేస్తున్నారనీ అన్నారు. ఈ పద్ధతి మార్చుకోవాలి అని లేని పక్షంలో బాధితులను సమీకరించి ప్రభుత్వాన్ని, రెవెన్యు అధికారులను కోర్టుకు లాగి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణ , రాములు, చంద్రయ్య, మల్లయ్య, చంద్ర మోహన్, గట్టయ్య, జగన్, రజినీకాంత్ , అశి యాదయ్య పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు స్థానికులకే కేటాయించాలని, దరఖాస్తు దారులందరికి ఇండ్లు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో నేడు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిరసన దీక్ష చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చేంత వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. బీజేపీ చేపడుతున్న దీక్షకు బీజేపీ శ్రేణులు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దరఖాస్తు దారులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలుగు సాహిత్యం విసతంగా అనువాదం కావాలి



- సాహిత్య అకాడెమీ చైర్మెన్ జూలూరి గౌరీశంకర్

నవతెలంగాణ-కల్చరల్

తెలుగులో అమూల్యమైన సాహితీ సృష్టి జరుగుతోందనీ కానీ ఇతర భాషల్లోకి అనువాదం కాక పోవటం వల్ల జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం లేదని సాహిత్య అకాడెమీ చైర్మెన్ జూలూరి గౌరీ శంకర్ అన్నారు. తెలుగు సాహిత్యం విసతంగా ఇతర భాషల్లోకి ముఖ్యంగా ఆంగ్లంలోకి అనువాదం కావాలని సూచించారు. రవీంద్ర భారతి సమావేశ మందిరంలో రాగ కతి ప్రచురణలు భాషా సాంస్కతిక శాఖ సౌజన్యంతో ఎల నాగ రచించిన నాలుగు ప్రక్రియల పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా గౌరీశంకర్ పాల్గొని మాట్లాడుతూ ఎలనాగ అనువాద రచనలో మేటి అని ఆయన సాహిత్యం వస్తు వైవిధ్యంతో సజనాత్మకంగా ఉంటుందని అభినందించారు. ఎల నాగ రచించిన ఉద్రుత వచన కవితా సంపుటిని విమర్శకులు డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, దాజ్లెలర్స్ ఆంగ్ల మినీ కవితా సంపుటిని ప్రముఖ కవి ప్రొఫెసర్ పి.లక్ష్మినారాయణ, ఆత్మ గానం ఆంగ్లం నుండి తెలుగు అనువాద కవితా సంపుటిని ప్రొఫెసర్ చెన్న కేశవ రెడ్డి ఆవిష్కరించారు. ప్రముఖ వక్త అనువాదకులు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి ఏలనాగ హిందీ నుంచి అనువాదం చేసిన శవాలను మోసే వాడి కథను ఆవిష్కరించి మాట్లాడారు. మహారాష్ట్ర ప్రాంతాలలో దళితుల కన్నా మరో బాధిత వర్గం వుందని ఈ నవలలో వెలుగులోకి తెచ్చిందన్నరు. వాస్తవ సంఘటనలను హదయనికి హత్తుకునే విధంగా కదారూపంలో ఎల నాగ చెప్పారని అభినందించారు. అత్మగానం మూల సంపుటి కవి ప్రదీప్ బీశ్వల్ పాల్గొన్నారు.

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

రాజకీయాలకతీతంగా నియోజకవర్గం అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన ధ్యేయమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆయన మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి ఆఫీసర్ కాలనీలో పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. మొదటగా సీసీ రోడ్డు శిలాఫలకానికి ప్రారంభించారు. పెండింగ్‌లో ఉన్న అంతర్గత రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం బతుకమ్మ పార్కులో లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. అధికారులతో చర్చించి, అవసరమైన నిధులు మంజూరు చేయించి, పరిష్కరించుకుందామని కాలనీవాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ ప్రేమ్ సాగర్ రావు, శ్రీ రామారావు, రమేష్ రావు, రాజారెడ్డి శ్రీనివాస్, నాగేశ్వరరావు, బలవంత రెడ్డి, నర్సింగరావు ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : డాక్టర్ చీమ శ్రీనివాస్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, దానికి పదివేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం అల్వాల్‌లోని తెలంగాణ అమర వీరుల శిబిరం వద్ద ఆయన శాంతియుత దీక్ష చేపట్టారు. అంతకు ముందు ఆయన తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర కమిటీ చైర్మెన్ జయశంకర్ సార్‌కు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ... అన్ని రాజకీయ పార్టీలు వారి వారి మేనిఫెస్టోలో ఉద్యమకారుల కొరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించాలని , ఉద్యమకారులకు ప్రతినెల పెన్షన్, ఉచిత బస్సు, ట్రైన్ పాసులు, ఆరోగ్య కార్డులు, సంక్షేమ పథకాలలో 20 కోటా కేటా యించాలని, సీమాంధ్ర కార్పొ రేట్ వర్గాల ఆధిపత్యాన్ని అన్ని రంగాలలో నిర్మూలించా లని కోరారు. అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, తెలంగాణ పరిశ్రమలన్నింటిలో తెలంగాణ ప్రాంతాల వారికి 90శాతం ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పటోళ్ల సురేందర్ రెడ్డి, లక్ష్మా రెడ్డి, భంగారు మల్లేష్ చారి శినివాస్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, దయాకర్, రవి, ఓంకార్, బొట్టు ప్రభాకర్ ,గడ్డం భాస్కర్ విలియం, ఉద్య మకారులు ,ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మారిన అల్మాస్ గూడ రోడ్లు

పట్టించుకోని అధికారులు ప్రజా ప్రతినిధులు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్ గూడ కోమటికుంట చెరువు కట్ట పక్క నుండి ఉన్న రాజీవ్ గృహకల్ప వరకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారిన అధికారులు,ప్రజా ప్రతినిధులు పట్టించుకోవటం లేదని కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు నవ్వారు మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లా డుతూ 24వ డివిజన్ ఎం ఆర్ ఆర్ కాలనీ ,వైస్సార్ కాలనీ పక్కనుండి రాజీవ్ గృహకల్ప వరకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వనంగా ఉండటంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలసి రోడ్‌ని పరిశీలించినట్లు తెలిపారు. ఇంత అద్వానంగా ఉన్న రహదారి అభి వృద్ధి కోసం ఎందుకు నిధులు మంజూరు చేయలేదో అధికార పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

దళితుల భూములను దళితులకు ఇవ్వాలి

మద్దతు పలికిన యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న దావుత్‌ఖాన్ గూడ సర్వే నెంబర్ 2లోని దళితుల భూములు దళితులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత 32 రోజులుగా బడంగ్‌పేట్ దళితులు చేస్తున్న దీక్షకు మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, సామ భాస్కర్ రెడ్డి, అనిల్ యూత్ కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలుపారు. దళితులతో కలిసి రాత్రి అక్కడే బస చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల15 వరకు దళితుల 16 ఎకరాల భూమి వారికి ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రగతి భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కె.ఉపేందర్‌రెడ్డి మద్దతు కోరిన మాజీ క్రికెటర్ అజారుద్దీన్

- జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ వస్తుందని నమ్మకంతో ఉన్నా : అజారుద్దీన్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ తనకే వస్తుందని పూర్తి నమ్మకంతో ఉన్నానని, తనకు మద్దతు తెలపాలని ఆదివారం ఇందిరానగర్‌లోని టీహెూప్ స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ సీనియర్ రాజకీయ నాయకుడు కే.ఉపేందర్‌రెడ్డిని అజారుద్దీన్ కలిసి తనకు మద్దతివ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన గెలుపునకు సహాయ, సహకారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. కే.ఉపేందర్‌రెడ్డి కూడా జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నట్లు, అధిష్ఠానం ఎవరికీ టిక్కెట్ ఇచ్చిన కలిసి పని చేయనున్నట్లు ఇద్దరు తెలిపారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ అందరం కలిసి ఐకమత్యంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేద్దా మన్నారు. ఉపేందర్‌రెడ్డికి నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లో టీ హెూప్ సభ్యులు సుమారు 25 వేల కుటుంబాలు ఉన్నాయని, ఆయన గత మూడు సంవత్సరాలుగా అనేక మందికి ఉచితంగా సేవలు చేస్తూ, ఆర్థికంగా ఆదుకుంటూ పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పిస్తూ, మహిళలకు ఎంబ్రాయిడరీ నేర్పిస్తూ సహాయం చేస్తున్నారన్నారు. సుమారు 250 మంది నియోజకవర్గంలోని అన్ని పేదవిద్యార్థులకు, ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున 25లక్షల రూపాయలను స్కాలర్‌షిప్‌కింది అందజేస్తున్నట్లు తెలి పారు. ఈసారి జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎవరికి టికెట్ వచ్చిన, ఉపేందర్ రెడ్డి సహకారం ఉంటేనే గెలుస్తారని, అదేవిధంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భవాని శంకర్ అండదండలు కూడా కాంగ్రెస్ అభ్యర్థికి ఉంటేనే గెలుస్తారని, లేనియెడల సాధ్యం కాదని నియోజకవర్గంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో అజారుద్దీన్‌తో పాటు సికింద్రాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అనిల్‌కుమార్‌యాదవ్, రహమత్‌నగర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ భవాని శంకర్, జూబ్లీహిల్స్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మనోజ్ కుమార్‌యాదవ్, కిరణ్ యాదవ్, ఎస్పీఆర్ హిల్స్ బస్తీ ప్రెసిడెంట్ జ్ఞానేశ్వర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేశవులు, యూత్ నాయకులు శివ, ఎర్రగడ్డ సీనియర్ నాయకులు మోసిన్, మహిళలు భారీగా పాల్గొని హజారుద్దీన్‌కు అండగా ఉండి గెలిపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

భూ కబ్జాదారులారా ఖబడ్దార్

- హెచ్చరిక చేసిన విద్యార్థి సంఘాలు



నవతెలంగాణ-ఓయూ

ఆధ్వర్యంలో వందేళ్ల చరిత్ర కలిగి ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ భూములపై కన్నేసిన భూ కబ్జాదారులకి, వాళ్ళకి సహకరిస్తున్న ప్రభుత్వానికి, ఉస్మానియా యూనివర్సిటీ పాలకవర్గానికి వామపక్ష విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ(వి) స్కాలర్స్ ఆదివారం హెచ్చరికలు జారీ చేశారు. యూనివర్సిటీ భూముల కోసం కేసులకు, జైళ్లకు బెదరకుండా పోరాటాలు చేసిన చరిత్ర ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులకి, వామపక్ష విద్యార్థులకు ఉన్నదని, ఈ భూముల కోసం ఎన్నో ఎంతో మంది విద్యార్థుల త్యాగాలు ఉన్నాయని, కానీ అవేమీ పట్టించుకోకుండా రాజకీయ లాభాల కోసం, విలువైన భూముల కోసం రాజకీయ నాయకులు, భూ ఆక్రమణ దారులు కుట్రలు చేస్తూ విద్యార్థులకు చెందిన భూములను ఇతరులకు అన్యాక్రాంతం చేయడం, దారుణమన్నారు. ఈ విషయంపై ఇంతవరకు యూనివర్సిటీ పాలక వర్గం స్పందించకపోవడాన్ని యూనివర్సిటీ విద్యార్థులుగా, విద్యార్థి సంఘాలుగా మేము తీవ్రంగా ఖండిస్తున్నారు. దీనికి వ్యతిరేఖంగా ఎంతదూమైన వెళ్లడానికి విద్యార్థి సంఘాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ భూముల గురించి ఎన్ని పోరాటాలు చేయడానికి సిద్ధపడి ఉన్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగానే ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజి ఎదుట భూ కబ్జాదారుల, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, స్కాలర్స్ అజాద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు రవి నాయక్, ఏఐఎస్ ఎఫ్-ఓయూ కార్యదర్శి సత్య నెల్లి, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు శ్రీను, పీడీఎస్‌యూ(వి) ఓయూ కన్వీనర్ అఖిల్ బొడ్డుపల్లిలు మా ట్లాడారు. ఈ కార్యక్రమంలో లెనిన్, మహేష్, కిషోర్, దిలీప్ పాల్గొన్నారు.

హైదరాబాద్ వెజిటేరియన్ క్లబ్ ప్రారంభోత్సవం



నవతెలంగాణ-బేగంపేట్

శాకాహార జగత్తు స్థాపన కోసం దశాబ్ద కాలంగా అవిరామ కృషి చేస్తున్న నేషనల్ వెజిటేరియన్ మూవ్మెంట్ ప్రజలతో మమేకమై హైదరాబాద్ వెజిటేరియన్ క్లబ్ ప్రారంభోత్సవ వేడుకను సికింద్రాబాద్‌లోని హెూటల్ ఇలాచీ నందు ఘనంగా జరుపుకుని మరో ముందడుగు వేసిందని వెజిటేరియన్ మూమెంట్ వ్యవస్థాపకులు ఆచార్య శ్రీనివాస్, సహవ్యవస్థాపకులు దివ్య శ్రీనివాస్ తెలి పారు. ఆదివారం హెూటల్ ఇలాచీ నుండి శాకాహార ర్యాలీ గా ప్రారంభమై మూడు కిలోమీటర్ల పాటు శాకాహార ప్రాముఖ్యతను తెలుపుతూ ప్రజలను చైతన్య పరిచారు. ప్రారంభోత్సవ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ నటిమణి రోజా రమణి వెజిటేరియన్ క్లబ్‌ను ప్రారంభించి, మానవుని జీవితంలో శాకాహార ప్రాముఖ్యతను అహింసా విశిష్టతను తెలియజేశారు. వెజిటేరియన్ మూమెంట్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ మాంసాహారాన్ని విడిచి శాకాహారులుగా మారిన వారిని సత్కరించి, ఇలాంటి క్లబ్స్ దేశమంతటా ప్రారం భించడమే తమ తదుపరి కర్తవ్యమని తెలిపారు. అనంతరం హైదరాబాద్ వెజిటేరియన్ క్లబ్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, సభ్యులందరి చే ప్రమాణస్వీకారం చేయించి క్లబ్ చేపట్టబోయే అనేక వినూత్న కార్యక్రమాల గురించి వివరించి జంట నగరాల్లో ఉన్న శాకాహారు లందరు క్లబ్‌లో సభ్యత్వం పొందాలని పిలుపు నిచ్చారు. ఆధ్యాత్మిక చైతన్య సంస్థలు తమ మద్దతును తెలుపుతూ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ వెజిటేరి యన్‌క్లబ్‌నందు భాగస్వాములు కావడానికి మరిన్ని వివరాలకు www.vegetarianclubs.orgను సందర్శించాలన్నారు.

బొడ్రాయి ప్రతిష్టాపనలో పాల్గొన్నా సాయి బాబా



నవతెలంగాణ-ఓయూ

లాలాపేట్‌లో శ్రీలలి తాదేవి(బొడ్రాయి) జీర్ణోదర పూర్వక పున బీప్రతిష్ట, కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగులూరు సాయిబాబా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు సుఖశాంతులతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ యాదవ్, అడ్డగుట్టశ్యామ్, రామ్‌లాల్, దేవుడు వెంకట్, అంజి, మనోహర్ బాబు, బాబా, ఆంజనేయులు, బొట్టు రాజు, శంకర్, టెంపుల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బొడ్రాయి ఉత్సవాల్లో డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్‌లోని లాలాపేటలో నెలకొల్పిన బొడ్రాయి ప్రతిష్టాపన కార్య క్రమం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగా అధ్యక్షులు శ్రీమోతే శోభన్‌రెడ్డితో ముఖ్య అతిథిగా కలిసి సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ గ్రామ దేవత బొడ్రాయి దేవత ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, బొడ్రాయి ప్రతిష్టాపన సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి



- అందరికి సహకారం ఉండాలి : డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ కోసం ప్రత్యేక సమీక్షా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగ అధ్యక్షులు మోతేశోభన్‌రెడ్డితో కలిసి తార్నాకలోని డిప్యూటీ మేయర్‌క్యాంప్ కార్యాలయంలో జీఎచ్ఎంసీ చీఫ్ ఎంటమాలజి రాంబాబు, ఎంటమాలజీ అధికారులతో కలిసి పాల్గొన్నారు.డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజలందరూ కూడా ప్రతి ఆదివారం ఉద యం 10 గంటలకు ఒక 10 నిమిషాలకు మన ఇంటి పరి సరాలలో నిలువ ఉన్న నీటి పాత్రలను అనగా పూల కుం డీలు, నల్లగుంతలు, ప్లాస్టిక్ డ్రమ్ములు, సిమెంట్ గోలాలు, పగిలిపోయిన మట్టి కుండలు, పగిలిపోయిన ప్లాస్టిక్ బకె ట్లు, కొబ్బరి బొండాలు, మనం తాగి పడేసిన టీ గ్లాసులు, మన బిల్డింగ్ పైన ఉన్న సింటెక్సు, రోళ్ళు, ప్లాస్టిక్ కప్పులు, నీటి సంపలు, వారానికి ఒకసారి తనిఖీ చేసి అట్టి నీరును తొలగించాలిన్నారు. అదే విధంగా వాటి పైన ఎల్లప్పుడు మూతలు పెట్టాలని, నీరు నిలువ లేకుండా చూసుకో వాలని, దోమలు నీటి నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. ప్రజలందరూ వారి వారి బస్తీలో కాల నీకి వచ్చే ఎంటమాలజీ సిబ్బందికి సహకరించి వారి సూ చనలు పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎంటోమొలజీ అధికారులు సూపరింటెం డెంట్ జూనియర్ దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్ రాజశేఖర్, పాల్గొన్నారు.

పలువురు బీఆర్ఎస్‌లో చేరిక



నవతెలంగాణ-ఓయూ

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు జరుపుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు పలువురు ఆకర్షితులై వారాసిగుడాకు చెందిన యువ నాయకుడు ధృవరాజ్ గౌడ్ తో సహా 900 మంది యువకులు ఆదివారం బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు సుంకు రాంచందర్, బొల్లా సుమీత్ యాదవ్‌ల ఆధ్వర్యంలో వారాసిగుడా నుంచి సితాఫల మండీ వరకు భారీ ర్యాలీతో వెళ్లి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోని సాదరంగా ఆహ్వాని ంచారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు తాము నిత్యం సేవలు అందించమని వివరించారు. బీఆర్ఎస్ యువ నేత తీగుల్ల రామేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.ధృవ రాజ్ గౌడ్, రోహిత్ గౌడ్ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు.

నిజాలు తెలుసుకొని నిజమైన పాలకున్ని ఎన్నుకోండి



- కార్పొరేటర్ పి.విజయరెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు గౌరవ పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రను కొనసా గింపుగా టీపీసీసీఅధ్యక్షులు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న హాత్ సే హాత్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ ఇచ్చిన సందేశాన్ని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని గాంధీ కుటీర్, హిమాయత్ నగర్ డివిజన్‌లో హాత్ సే హాత్ జోడో యాత్రను ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పివిజయ రెడ్డి నిర్వహించి పలు సందేశా కరపత్రలను ప్రజలకు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పేదల పక్షాన నిలబడి నిజమైన ప్రజా పాలకులు ఎవరు ప్రజలే గుర్తించి ఎన్నుకోవాలరారు.ఖైరతాబాద్ నియో జకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ పలు డివిజన్ల అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యాచకుడు మృతి



నవతెలంగాణ-ముషీరాబాద్

గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన విరాల ప్రకారం నాగమయ్య కుంట బస్తీ జడ్పీ గార్డెన్స్ వద్ద బిక్షాటన చేస్తూ జీవిస్తున్న యాచకుడు ఆదివారం మృతి చెందినట్లుగా స్థానికులు తెలిపారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన వ్యక్తి యాచకుడిగా గుర్తించి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలకై దర్యాప్తు చేపట్టారు.

కింగ్ ఆఫ్ స్పోర్ట్స్ గుర్రెపు పందెం



- నటి మంచులక్ష్మి..

నవతెలంగాణ-బంజారాహిల్స్

గుర్రెపు పందెం కింగ్ ఆఫ్ స్పోర్ట్స్ అని నటి మంచు లక్ష్మి అన్నారు. ఆదివారం హెూస్ట్' రేస్ 2 విన్.కాం' డెక్కన్ కోల్ట్స్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్ని మాట్లాడార్స్' రేస్ 2 విన్.కాం' డెక్కన్ కోల్ట్స్ ఛాంపియన్‌షిప్ స్టేక్స్ భారతదేశం నలుమూలల నుండి నటులు,అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు సాంఘిక వ్యక్తుల దృష్టిని ఆకర్షించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖుల శ్రేణిలో లక్ష్మి మంచు, సీరత్ కపూర్, నేహా శెట్టి, అమన్‌ప్రీత్, సిద్ధూ జొన్నలగడ్డ, యోగితా బిహానీ, శుభ్ర అయ్యప్ప, శ్రుతి చౌహాన్ వంటి ప్రముఖులుపాల్గొని వారి అభిప్రాయాలను వెల్లడించారు. స్థాపకుడు వై.గోపీ రావు మాట్లాడుతూ క్రీడలతో పాటు గుర్రపు పందెం గురించి అవగాహన కల్పించడం ప్రస్తుత జీవనశైలి సమ సమాజంలో ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడిన 8 మంది అరెస్ట్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ చేస్తున్న ఎనిమిది మందిని అరెస్టు చేసిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాలు ఇండియా పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ఎస్పీఆర్ హిల్స్‌లోని కొత్త ఫంక్షన్ హాల్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారంతో వెస్ట్‌జోన్‌టాస్క్ ఫోర్స్, బోరబండ పోలీసులు ఉమ్మడిగా తనిఖీ చేసి పట్టుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం వారి అరెస్టు చేసి వారి వద్ద నుంచి 48వేల 30 రూపా యల నగదు, 8సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వారిని విచారించగా క్రికెట్‌లైవ్ గురు అప్లికేషన్ ద్వారా ఈ బెట్టింగ్ ఆడుతున్నట్లు తెలుసుకున్నట్లు వారు తెలిపారు.

తెలంగాణ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండో రోజుకు చేరిన నిరాహార దీక్ష

పలు పార్టీల నుంచి వస్తున్న మద్దతు



నవతెలంగాణ-హాయత్ నగర్

స్థానికులకే అక్కడ ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లులు మంజూరు చేయాలని లేని పక్షంలో అక్కడ ఉన్న బాధితులకు అండగా ఉంటామని యల్‌బి నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, యల్‌బీ నగర్ టీడీపీ ఇన్‌చార్జి స్ వీ కృష్ణ ప్రసాద్,యల్ బి నగర్ జనసేన ఇంచార్జి సాయి షీరీషా, యల్ బీ నగర్ బీ ఎస్ పీ ఇంచార్జి జక్క యాదగిరి లు డిమాండ్ చేశారు.నాగోల్ డివిజన్ పరిధిలో మిగిలిన ఇండ్లు అక్కడే ఉన్న బాధితులకు ఇవ్వాలని చేపట్టిన నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. తదనంతరం వారు మాట్లాడుతూ ఎరుకల నాంచారమ్మ బస్తీలో గత 30 సంవత్సరాలనుంచీ నివాసం ఉంటున్న పేదలకు గత ఎలక్షన్‌లకు ముందు ప్రభుత్వ అధికారులు ఇక్కడ నివాసముంటున్న ఈ స్థలంలో డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టి ,ముందు ఇక్కడ ఉన్న ఎరుకల కులస్తులకు డబుల్ బెడ్రూం ఇళ్లలు మంజూరు చేసిన తరువాత ఇతరులకు ఇస్తామని చెప్పి వారిని అక్కడినుంచి తరలించి ఇప్పుడు వారికి ఇవ్వక లాటరీ విధానం లో ఇస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. అక్కడే నివాసం ఉంటున్న ఇండ్లు రాని వారికే ఇవ్వాలని లేని పక్షంలో తమ ఉద్యమం ఆగదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇక్కడ ఉన్న మిగిలిన ఇండ్లను స్థానికులకే ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో తెలుగు యువత అధికార ప్రతినిధి సింగి రెడ్డి మురళీధర్ రెడ్డి,మల్లేష్,శ్రీనివాస్, బుడ్డా సత్యనారాయణ దీక్షలో గంగయ్య, స్వామి, మల్లేష్, పాపమ్మ పాల్గొన్నారు.

అక్రమ రేషన్ షాప్ మంజూరు చేయడంపై ఫిర్యాదు





నవతెలంగాణ-బంజారాహిల్స్

అక్రమ రేషన్ షాప్ మంజూరు చేయడంపై అఖిల భారతీయ షెడ్యూలు కులాల తెగల సమైక్య ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశామని తెలంగాణ అధ్యక్షులు కే.మహేశ్వర రాజ్ పేర్కొన్నారు. శనివారం పంజాగుట్టలోని డిస్టిక్ సప్లయి ఆఫీసర్ (డీఎస్ఓ) రమేష్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై వారి కార్యాలయంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడినట్లు తెలిపారు. ఓల్డ్ సిటీలో అక్రమంగా నివాస్ అగర్వాలుకు రేషన్ షాప్ మంజూరు చేయడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్త పరిచారు. ఇదే తంతులో షాప్ నంబర్ 385 ఇలా చాలా అక్రమాలు జరుగుతున్నయని, అదేవిధంగా సివిల్ సప్లయిలో జరుగుతున్న అవినీతి అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగుల ఆధ్వర్యంలో క్లిన్ అండ్ గ్రీన్



నవతెలంగాణ-ఓయూ

ఓయూ డా.బి.ఆర్. అంబేద్కర్ గ్రంథాలయం ఆవరణలో క్లిన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని కాంట్రాక్ట్ ఎం ప్లాయిస్ ఆధ్వర్యంలో ఇస్లా వత్ వెంకన్న, బానోత్ శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. వర్షాకాల ప్రభావంతో గ్రంథాలయ పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలు చెత్తాచెదారం తొలగించినట్లు, ముఖ్యంగా విద్యా ర్థులకు, ఉద్యోగస్తులకు, విజిటర్స్‌కు విషసర్పాలు రాకుండా క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ స్కాలర్స్, స్టూడెంట్స్, ఇతర సహాయకులు, టి. సురేందర్,బి. భాస్కర్, కరణ్, బి.బాల సుబ్రహ్మణ్యం, బి.వీరబాబు, వికాస్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న భారాలను తగ్గించాలి

- సీపీఐ(ఎం) ప్రజా ప్రతిఘటన పాదయాత్రలో గోషామహల్ జోన్ కన్వీనర్ పి.నాగేశ్వర్



నవతెలంగాణ-ధూల్ పేట్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై మోపు తున్న భారాలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) గోషామహల్ జోన్ కన్వీనర్ పి.నాగేశ్వర్ డిమాండ్. చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంకు వ్యతిరేకంగా నియోజ వర్గం లోని బేగం బజార్ డివిజన్ లోని సంజయ్ నగర్, ఎలగందులబస్తీ, మోరం బస్తీల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా ప్రతిఘటన పాదయాత్ర నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై అధిక ధరల బారాలకు మోపుతు ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. పేదలను కొట్టి గద్దలకు పెడుతుందని అవహం వ్యక్తం చేశారు. ఈ యాత్రలో సీపీఐ(ఎం) గోషామహల్ స్థానిక నాయకులు, కార్యకర్తలు బి.గంగాపురీ, జీ.అశోక్ చారీ, ఏ.శంకర్, డి.కృష్ణ, ఎస్ హన్మంతు, బుర్ర న్న, బచ్చన్న ముకేష్, రాజు, అర్జున్, లక్ష్మన్, దేవమ్మ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్‌లోని వివిధ పోలింగ్ క్షేత్రాలను ఆదివారం బీజేపీ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి సుక్క గణేష్ ముదిరాజ్ పరి శీలించారు. అయినతో పాటు పలువురు బీజేపీ నేతలు తదితరు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
సోమవారం | సెప్టెంబర్ 04, 2023 | www.navatelangana.com

గడప గడపకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో..



నవతెలంగాణ-సిటీబ్యూరో

సనత్‌నగర్ నియోజకవర్గంలోని అమీర్‌పేట్ పరిధిలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.నాగేందర్ రాజ్ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పాదయాత్రలో భాగంగా ఆయన ఇంటింటికి వెళుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉన్న సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతు ప్రకటించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వాజిద్ ఖాన్, ఫెహీం, హరి, శివ సింగ్, పాషా, జానకి రామ్, ప్రవీణ్, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన రాజకీయ ప్రముఖులు



నవతెలంగాణ-హయత్‌నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, బీఎన్ రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్నల ప్రథమ కుమారుడు రంజిత్ గౌడ్ - హేమలతల వివాహ వేడుకలు మన్సూరాబాద్ లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం అంగరంగవైభవంగా జరిగింది. శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే అంధ్రప్రదేశ్ మంత్రి జోగి రమేష్, తెలంగాణ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్, మాజీ పార్లమెంటు సభ్యులు వి.హనుమంత రావు, మధుయాష్కీ, డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, జైపాల్ యాదవ్, శాసనమండలి సభ్యులు ఎగ్గే మల్లేశం కురుమ, పలువురు కార్పొరేషన్ చైర్మెన్లు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు వధూవరులను ఆశీర్వదించారు.

కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడడం సరికాదు



- **సీపీఐ(ఎం) జియాగూడ డివిజన్ శాఖ కార్యదర్శి నరసింహ**

నవతెలంగాణ - ధూల్ పేట్

కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడడం సరికాదని సీపీఐ(ఎం) జియాగూడ డివిజన్ శాఖ కార్యదర్శి చుక్క నరసింహ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదివారం జియాగూడ డివిజన్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై పెను భారాలు మోపుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ప్రజలను మోసం చేస్తూ కార్పొరేట్లకు పెడుతుందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ నిరసనలో సీపీఐ(ఎం) జియాగూడ డివిజన్ శాఖ కార్యదర్శి చుక్క నరసింహ, పార్టీ సభ్యుడు ముత్యాలు, స్వచ్ఛ ఆటో యూనియన్ నాయకులు శంకర్, మునిస్వామి, బాలరంగడు, కష్టమూర్తి, సోమశంకర్, ఆంజనేయులు గౌడ్, తిమ్మప్ప, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.



'హార్డ్ వేర్ పార్క్ రద్దు కోసం త్వరలో నిరసన దీక్షలు'

నవతెలంగాణ - బడంగ్ పేట్

హార్డ్‌వేర్ పార్కును రద్దు చేయకపోతే త్వరలోనే నిరసన దీక్షలు చేస్తామని జేఏసీ చైర్మన్ రామేశ్వర్ రావు హెచ్చరించారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ రెవెన్యూ పరిధిలోని హార్డ్ వేర్ పార్కు వ్యతిరేక పోరాట కమిటీ జేఏసీ నాదర్ గుల్ లో ప్రత్యేక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్డ్ వేర్ పార్కు ను తక్షణమే రద్దు చేసి ఆ భూమిని బాధిత రైతులకు, నివాస స్థలాల యజమానులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం త్వరలో నిరవధిక రీలే దీక్షలను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఎం.రామేశ్వరావు, కన్వీనర్ దార సత్యం, కే.శ్రీరాంరెడ్డి, ముద్దం వెంకట్ రెడ్డి, నవీన్ యాదవ్, కుమార్ యాదవ్, ఎస్.సుధాకర్ రెడ్డి, వరికుప్పల వెంకటేష్, నవీన్ కుమార్ రెడ్డి, జైపాల్ రెడ్డి, కానుగుల శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

మెడికల్ అండ్ హెల్త్ అవుట్ సోర్సింగ్
కాంట్రాక్ట్ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ - వనస్థలిపురం

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యాలయం హైదరాబాద్ కోఠి వైద్య విధాన పరిషత్ ఆవరణలో ఆదివారం ప్రారంభించారు. అనంతరం మినిమం వేజెస్ అడ్వైజర్ బోర్డు మెంబర్ శివ శంకర్ జన్మదిన వేడుకలను తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ పి.నారాయణ, టీఆర్ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, కనీస వేతనాల సలహా మండలి బోర్డ్ మెంబర్ శివ శంకర్, ఏసిక్ బోర్డ్ మెంబర్ మారన్న, మన యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ గంధం శాంతికుమార్ గౌడ్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ భిక్షపతి, రాష్ట్ర ట్రేసురేర్ సుభాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫియుద్దీన్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నర్సింగ్ రావు, రాష్ట్ర కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సబితా ఇంద్రారెడ్డితోనే బడంగ్‌పేట్ అభివృద్ధి



- **కార్పొరేటర్ సూర్ణగంటి అర్జున్**

నవతెలంగాణ - బడంగ్ పేట్

విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి సహకారం తోనే బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని 28వ డివిజన్ కార్పొరేటర్ సూర్ణగంటి అర్జున్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్‌లోని డివిజన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. జర్నలిస్టు కాలనీ, నైన్ హిల్స్ కాలనీ, సప్తగిరి కాలనీ, వసంత్ విహార్ కాలనీ, చంద్ర విహార్ కాలనీ, ఎంఆర్ఎం కాలనీ, జనప్రియ విలాస్ కాలనీల్లో రూ.కోటి 40లక్షల హెచ్ఎండీఏ ప్రత్యేక నిధులు, మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల నాయకులు బొట్టు వెంకటేష్, నరేష్, గణేష్, వేణు, రాం మోహన్, భగువాన్, శర్మ శివాని రెడ్డి, మాదవీ రెడ్డి, పార్వతమ్మ, ఇందిర, నరేష్, వెంకట్ నాయక్, రమేష్, అనిల్, మురళి, శ్రీశైలం, సురేందర్ రెడ్డి, తిరుపతయ్య, శివచారి, కిట్టు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయంలో
అక్కినేని పేరిట స్వర్ణ పతకం

నవతెలంగాణ-కల్చరల్

ప్రఖ్యాత సినీ నటుడు పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు శత జయంతిని సామాజిక మాధ్యమం వేదికగా అంతర్జాతీయ స్థాయిలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, వంశీ ఇంటర్నేషనల్, సింగపూర్ కు చెందిన సాంస్కృతిక కళా సారథి నిర్వహణలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు పది గంటల పాటు నిర్విరామంగా జరిగింది. వంశీ సంస్థల అధినేత వంశీ రామ రాజు స్వాగతం పలుకుతూ అక్కినేనికి తమ సంస్థతో ఉన్న అనుబంధం వివ రించారు. ఆయన పేరిట స్వర్ణ పతకం తెలుగు విశ్వవిద్యాలయం లో ఏర్పాటుచేసి ప్రతిఏటా ప్రతిభావంత విద్యార్థికి బహుకరించే లా చూస్తామని తెలిపారు.



అక్కినేని నటించిన యాభై చిత్రాలను ఎంపిక చేసుకొని ఏడు దేశాలు ఆస్ట్రేలియా, మలేసియా, సింగపూర్, ఖతార్, అమెరికా, ఒమన్, భారత్‌లలోని ప్రముఖులు విశ్లేషణాత్మక ప్రసంగాలు చేశారు. డాక్టర్ కే వీ.కృష్ణ కుమారి, డాక్టర్ తెన్నేటి సుధ,సురేఖ,డాక్టర్ సూర్య ధనుంజయ, తిరునగరి దేవకీదేవి, విజయ గొల్లపూడి, రత్న కుమార్,గౌరీదేవి,లలితా రామ్ తదితరులు వ్యాసాలు చదివారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా చిట్టెన్ రాజు అక్కినేని అమెరికా యాత్ర చేసిన ప్రతి సారి తాము ఆతిథ్యం ఏర్పాటుచేశామనుగుర్తు చేసుకున్నారు. రాధిక మంగినపూడి కార్యక్రమాన్ని వ్యాఖ్యానిస్తూ సమర్థవంతంగా నడిపారు

హరి కథలను
ముందు తరాలకు అందించడమే నారాయణ దాసుకు నివాళి



నవతెలంగాణ-కల్చరల్

నాట్యం, గానం, సాహిత్యం, నటన అన్ని కళలు కలసిన హరికథలు ప్రాచీన కళా రూపమని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కొల్లేటి దామోదర్ గుప్తా అన్నారు. అట్టి హరికథలకు భీష్మాచార్యులు వంటి అదిభట్ల నారాయణ దాసు కునిజమైన నివాళి హరికథలను ముందు తరాలకు అందించటమేనని ఆయన పేర్కొన్నారు. శ్రీత్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ ఆధ్వర్యంలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా హరి కథా పితామహుడు అదిభట్ల నారాయణ దాసు జయంతి సమావేశం కళావీఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా కొల్లేటి దామోదర్ గుప్తా హాజరై మాట్లాడుతూ నేడు తల్లిదండ్రులు తమపిల్లలను మార్కులు, డాలర్లు సంపాదించే యంత్రాలుగా చూస్తున్న సమయంలో అదిభట్ల జీవితం తెలుసుకోవాలని అన్నారు. పెద్దగా చదువుకోకున్నా అదిభట్ల పలు భాషలలో పండితులని, గొప్ప మేధావి రచయిత గా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారని వివరించారు. సాహితీ వేత్త డాక్టర్ బి జయ రాములు మాట్లాడుతూ నోబెల్ బహుమతికి అదిభట్ల పేరు నాటి బ్రిటిష్ ప్రభుత్వం ప్రతిపాదించిన విషయం గుర్తు చేశారు. హరికథకులు ఆత్మ గౌరవంతో జీవించేలా వారి భుక్తి కి లోటు లేకుండా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే హరికథలు భవిష్యత్ తరాలకు అందుతాయని అన్నారు. కథక్ కళాక్షేత అధ్యక్షుడు పండిట్ అంజు బాబు , గాన సభ పాలకమండలి సభ్యురాలు భమిది ఉష పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళన పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - చైతన్యపురి

తెలంగాణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం దశాబ్ది ఉత్సవ నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం సభ పోస్టర్ ను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తన నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాసమల్ల బాలకృష్ణ మాట్లాడుతూ ఈనెల 5న కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవనంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సభలో నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంబర్తి శ్రీనివాస్, సంఘం నాయకులు పాల్గొన్నారు.



నగరంలో గణేష్ ఇతర పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పీస్ కమిటీ సభ్యులతో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆదివారం బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో పీస్ కమిటీ సభ్యులు, పోలీసులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

నీటి సంపులో పడి పసికందు మృతి



ఫైల్ ఫోటో

నవతెలంగాణ-జవహర్‌నగర్

అల్లారి ముద్దుగా ఆడుకునే బాబు... బుడిబుడి అడుగులు వేస్తూ అందరినీ ఆనందపరిచే చిన్నారి బాలుడు... ఇక లేడని తెలవగానే కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. 11 నెలల బాలుడిని నీటి సంపు మృత్యువు రూపంలో కబలించింది. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు,కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కార్పొరేషన్ లోని బీరప్పగడ్డలో హుసెనప్ప, శ్రీదేవి కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నారు. హుసెనప్ప కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా వారి బాబుని ఆడించడానికి మామ తీసుకెళ్ళాడనుకుంది ఆ తల్లి... అయితే బాబు ఆడుకుంటూ ఇంటి వద్ద ఉన్న సంపులోనే పడటం ఎవరూ గమనించలేదు. మామ వచ్చి బాబు ఏడని అడగ్గా... నీవే తీసుకెళ్ళావని అనుకున్నాము అని అంది సాయిచరణ్ తల్లి... బాబు ఎక్కడా అని చుట్టు పక్కల వెతకగా నీటి సంపులో కనిపించాడు. అప్పటికే బాబు విగత జీవిగా పడి మృతి చెంది ఉన్నాడు. సాయిచరణకు 11నెలలు పడ్డాయని... ఈ వారంలో షిరిడికి తీసుకెళ్ళి పుట్టెంటుకలు తీద్దామని అనుకునేలోపే... ఇలా జరగడంతో ఆ ఇంట్లో తీవ్ర పుత్ర శోకం మిగిల్చింది. సాయిచరణ్... లేవు... ఆడుకో అంటూ... తల్లిదండ్రులు రోధిస్తుంటే వారిని ఆపడం ఎవరితరం కాలేదు. కుటుంబసభ్యుల మధ్యలో నిత్యం ఆడుకునే సాయిచరణ్ లేడని ఏడుస్తుంటే చుట్టుప్రక్కల వారు కన్నీటి పర్యాంతమయ్యారు.



హైదరాబాద్ లోని ముషీరాబాద్‌లో ఆర్యవైశ్య హాస్టల్ (బాలికల) 30 రూములతొ హాస్టల్ భవనం నిర్మాణం భూమి పూజ కార్యక్రమంలో టూరిజం పూర్వ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త పాల్గొన్నారు. భవన నిర్మాణం కోసం ఉప్పల శ్రీనివాస గుప్త 10 లక్షల రూపాయలు విరాళాలను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

కేసీఆర్‌తోనే పేదల సొంతింటి కల సాకారం..
- కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ



నవతెలంగాణ - ధూల్ పేట్

ముఖ్యమంత్రి కేసీఆర్ తోనే పేదల సొంతింటి కల సాకారం అని మాజీ కార్పొరేటర్, కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. మొదటి విడత డబుల్ బెడ్ రూం పంపిణీ జియాగుడా ఎంసీహెచ్ కాలనీ జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు, మండల అధికారులతో, అర్హులైన వారికి ఆయన స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్ చేతుల మీదుగా ప్రభుత్వం పంపిన చేస్తున్న ఇండ్లను ఆయన పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంగళ హాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్, యాదగిరి, అత్తాపూర్ రాజేష్, ఉమేష్, పలువురు పార్టీ ప్రజాప్ర తినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-ధూల్‌పేట్



ధరలను నియంత్రణ చేయలేని ప్రభుత్వాలు నశించాలని సీపీఐ(ఎం) సౌత్ జిల్లా నాయకులు అబ్దుల్ సత్తార్ అన్నారు. సీపీఐ(ఎం) బహదూర్‌పుర, చార్మినార్ జోన్ కమిటీల ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద ఆటో, స్థానిక కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలను వెంటనే తగ్గించాలన్నారు. నిత్యావసర ధరల భారం ప్రజల పై మోపుతూ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని బాలాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో కంట మహేశ్వర సూరమాంబ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ మహెూత్సవంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే టీపీసీసీ కార్యదర్శి అమరేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లారెడ్డి, సురేష్ గౌడ్, కృష్ణంరాజు గౌడ్, ధనరాజ్ గౌడ్, అరవింద్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్, లిట్టు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల సంఘం డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



శనివారం హైదర్ గూడ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న ఆటోపై జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం వల్ల పెద్ద చెట్టు కూలీ ఆటో డ్రైవర్ మహ మ్మద్ గౌస్ పాషా (36)పై పడి అక్కడి కక్కడే మృతి చెందిన ఘటనలో ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల సంఘం (కాంగ్రెస్ ఆటో సెక్టార్) అధ్యక్షులు దయానంద్, ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్ రెడ్డి ఆరోపించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మహమ్మద్‌గౌస్‌పాషా కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ వెంటనే ప్రభుత్వం స్పందించాలని ఈ మేరకు ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రోహిన్‌రెడ్డితో కలిసి గౌస్ పాషా కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రోహిన్ రెడ్డి ఈ విషయంలో సానుకూలంగా స్పందించి, గౌస్ పాషా పిల్లలకు ఉన్నతమైన విద్యను అందించడానికి, వారి కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, వారి పిల్లలను అన్ని రకాలుగా ఆదుకునే విధంగా ముందుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రవాణా రంగ కార్మికుల ఐక్య సమితి జేఏసీ కమిటీ సభ్యులు, అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల సంఘం (కాంగ్రెస్ టాక్సీ సెక్టార్) అధ్యక్షులు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్డులో ఆకట్టుకున్న హార్టీకల్చర్‌షో

- సందర్శనకు వస్తున్న వేల మంది ప్రకృతి ప్రియులు

నవతెలంగాణ-అంబర్‌పేట

నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన ఆలిండియా హార్టికల్చర్, అగ్రికల్చర్‌షో ప్రకృతి ప్రియులను ఆకట్టుకుంటోంది. 14వ మెగా నర్సరీ మేళాలో లేటెస్ట్ ట్రెండింగ్‌లో ఉన్న వర్టీకల్ గార్డెనింగ్, హైడ్రోఫోనిక్ సిస్టమ్, టెర్రస్ గార్డెనింగ్, కిచెన్ గార్డెనింగ్ వంటి లేటెస్ట్ టెక్నాలజీ ఈ షో లో ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు. దేశవ్యాప్తంగా కోల్కతా, ఢిల్లీ, హర్యానా, ముంబయి, బెంగుళూరు, పూణే, షిర్డీ, కడియం, చెన్నై తెలంగాణ, ఆంధ్రా తదితర నగరాలు, ప్రాంతాల నర్సరీల నుంచి వచ్చిన మొక్కలు, ఉత్పత్తులను 150 స్టాల్స్‌ను ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు. రకరకాల పూల మొక్కలు, వివిధ రకాల పండ్ల మొక్కలు గార్డెనింగ్ ఔత్సాహికులను అమితంగా ఆకట్టకుంటున్నాయి. కాంక్రీట్ జంగిల్, బీజీ లేఫ్‌లో ఉండే నగర వాసులకు గార్డెనింగ్ హాబీగా చేసుకుంటే మానసిక ఒత్తిడి తగ్గించి ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ఉల్లాసాన్ని కలిగిస్తాయని హార్టీకల్చర్ షో ఇంచార్జ్ ఖాలీద్ అహ్మద్ అన్నారు. పీపుల్స్ ప్లాజాలో నిర్వహిస్తున్న నర్సరీ మేళాకు వేలాది మంది సందర్శిస్తున్నారన్నారు. ఈషోలో జాతీయ, అంతర్జాతీయ రకాల నర్సరీ మొక్కలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. విరబూసే క్రిసెంటిమమ్, స్విజ్జర్‌ల్యాండ్, నెదర్లాండ్ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న జర్బెరీ, తులిప్, ఎగ్జెటిక్ పూలు, పండ్ల మొక్కలు, అగ్రికల్చర్, హార్టీకల్చర్‌కు అవసరమైన ఈక్విప్‌మెంట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మట్టి లేకుండా కేవలం నీటిలో పెరిగే వెజిటబుల్స్, ఫ్రూట్, ఫ్లవర్ ప్లాంట్స్, బల్బ్స్ ప్రదర్శించారు.

షో మంగళవారం రాత్రి 9గంటల వరకు నగర ప్రజలకు అందుబాటులోకి ఉంటుందని తెలిపారు.





ఉద్యోగులకు పిఆర్సీ ఇచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే



- బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన తరహాలోనే పీఆర్సీ ఇచ్చిన ఘనత రాష్ట్ర సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ అన్నారు. ఆదివారం కోఠి డీఎంహెచ్ఎస్ ఆవరణలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 75 వేలకు పైగా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారని, దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులకు పిఆర్‌సి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కనీస వేతన బోర్డు చైర్మెన్ పి నారాయణ, సభ్యులు శివశంకర్, రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీ, ఓదిన్, ప్రధాన కార్యదర్శి బిక్షపతి, కోశాధికారి సుభాష్, అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ శాంతి కుమార్, గ్రేట్ హైదరాబాద్ అధ్యక్షులు నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి నరసింహులు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌టీ కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవ తెలంగాణ- ముషీరాబాద్



ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ డివిజన్ లోని ఎస్ఆర్‌టి కాలనీ సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రాంనగర్ డివిజన్ ఎస్ఆర్‌టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ముఖ్యమంత్రి మరల ఎమ్మెల్యే టికెట్ ముఠా గోపాల్ కు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను సన్మానించారు. తదుపరి కేశవపురం అరుణ్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌టీ కాలనీ సభ్యులు సమస్యల వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంవత్సరాల పై బడి ఉన్న డ్రయినేజ్ సమ స్యని తక్షణమే కొత్త లైను వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దానితోపాటు సీసీరోడ్ పార్కులో యోగా కోసం నూతనంగా గార్డెన్ ఓపెన్ జిమ్ హాల్ ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరిక మేరకు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు ముఠా జయసింహ, కొండ శ్రీధర్‌రెడ్డి, దీన్‌దయాల్‌రెడ్డితో పాటు కాలనీ కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ విజయరావు, జనరల్ ప్రధాన కార్యదర్శి మధుబాబు, సలహాదారు బల్వీర్, ఉపాధ్యక్షురాలు శశికళ, ఆర్గనైజర్ సెక్రెటరీ జ్ఞాన ప్రభు అలియాస్ (నాను), బంగారం అన్న, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంల భాగస్వామ్యం దేశానికి ప్రమాదం



- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

కార్పొరేట్ మతోన్మాద బీజేపీ, నయా నిరంకుశ బీఆర్ఎస్, పచ్చి అవకాశవాద ఎంఐఎంల భాగస్వామ్యం దేశానికి, రాష్ట్రానికి ప్రమాదకరమని, ద్వేషం, విభజన భావజాలం కలిగిన బీజేపీతో బీఆర్ఎస్, ఎంఐఎంల రహస్య పొత్తు బట్టబయలు అయిందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ ఆరోపించారు. బీజేపీ విద్వేష భావజాలం కారణంగా దేశవ్యాప్తంగా దళితులు, గిరిజనులు, ముస్లింలు, మహిళలు, ఇతర బలహీన వర్గాలు భయంతో జీవిస్తున్నాయన్న సత్యాన్ని ప్రజలు గుర్తించి, వచ్చే లోక్ సభ, శాసన సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలను దేశ, రాష్ట్ర ప్రజలు తిరస్కరించాలని ఆయన సూచించారు. ఒక సాధారణ దొంగ మీ డబ్బును, మీ నగలను మాత్రమే దోచుకుంటాడు, కానీ బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం లాంటి రాజకీయ దొంగలు మీ జీవితాన్ని, మీ భవిష్యత్తును దొంగిలిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం శత్రువుల ముసుగులో బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలు మిత్రులవడంలో సందేహం లేదన్నారు. ఆదివారం హిమాయత్ నగర్ లోని సత్యనారాయణరెడ్డి భవన్ లో సిపిఐ హైదరాబాద్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి అధ్యక్షతన నిర్వహించారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ప్రముఖ సామజిక కార్యకర్త మోటూరి కృష్ణ ప్రసాద్, సిపిఐ సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్ పావని, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కలిసికట్టుగా నిలవడమే "ఇండియా" కూటమి ప్రధాన లక్ష్యం అని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ వివిధ రాష్ట్రాల్లో విద్వేష జ్వాలలు రగిలిస్తున్న బీజేపీని "ఇండియా" కూటమి తప్పకుండ దెబ్బతీస్తుందని తెలిపారు. అనంతరం వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ఉపాధి, అందరికీ ఆరోగ్యం, గృహ నిర్మాణం, ఉచిత విద్య, సామజిక న్యాయం కోసం అలాగే ధరల పెరుగుదల, ప్రైవేటీకరణ, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించవలసిన అవసరముందన్నారు. ప్రజల హక్కులను కాలరాస్తూ శాంతియుత జీవనానికి భంగం కలిగిస్తున్న విషపూరితమైన మత విభజన శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. మోటూరి కృష్ణ ప్రసాద్,.పి.ప్రేమ్‌పావని, బి.వెంకటేశం, ఎస్.ఛాయాదేవి తదితర నాయకులు మాట్లాడారు. ఈ నెల 11 నుండి 17 వరకు సీపీఐ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాలను జయప్రదం చేయాలని, 17న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాలు, ముగింపు బహిరంగ సభలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు నెర్లకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, షంషుద్దీన్, పడాల నళిని, ఎండి.ఒమర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

బీసీ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కే.మురళి కృష్ణ

నవతెలంగాణ-అంబర్‌పేట



ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలలో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కే.మురళీ కృష్ణ అన్నారు. ఆదివారం రత్ననగర్‌లో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుండి 22 వరకు జరగబోయే అత్యవసర పార్లమెంట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల బిల్లుతో పాటు మహిళా బిల్లును ఆమోదించాలని ఆలోచిస్తుందన్నారు. కానీ, మహిళా బిల్లులో బీసీ ఉప కోట తప్పనిసరిగా కల్పించాలన్నారు. పార్లమెంట్లో 33 శాతం మహిళా బిల్లును ప్రవేశపెట్టాలనే ముసాయిదా తయార 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో 60శాతం ఉన్న బీసీ మహిళలకు రిజర్వేషన్ అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ త్వరలో తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు, ధర్నాలు, నిరసనలు చేస్తున్నట్లు తెలిపారు. ఆ రకమైన బిల్లుని ముసాయిదాలో బీసీ మహిళా బిల్లుగా పొందుపరిస్తేనే తెలంగాణ బీసీ జాగృతి ఉద్యమం దానికి నైతికంగానూ, సామాజికంగానూ మద్దతి తెలియపరుస్తుంది. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా పార్లమెంట్లో ఇప్పుడున్న 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తామని తెలిపారు.

ఓటర్ నమోదుపై స్పెషల్ డ్రైవ్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఎన్నికల కమిషన్ ఓటర్ నమోదును గోషామహల్ నియోజకవర్గం జాంబాగ్ డివిజన్‌లో ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు అనిల్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు జీహెచ్ఎంసీ సర్కిల్ - 14 బీఎల్ఓలు ఆర్‌పి స్వాతి కొత్త ఓటర్ నమోదుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పత్రాలను అందించారు.

అనాథలు, నిరాశ్రయులకు మందులు దుస్తులు పంపిణీ

- స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

హైదరాబాద్ మహా నగరంలో రోడ్ల పక్కన జీవ నం సాగిస్తున్న నిరాశ్రయులు,అనాథలకు స్కైఫౌండేషన్ ఆధ్వర్యంలో దస్తులు, బిస్కెట్లు, నీళ్ల పంపిణీ చేశారు. జ్వరం,దగ్గు,జలుబు,కడుపునొప్పి,వళ్ళనొప్పులు రోగాలతో బాధలు పడుతున్నా ప్రమాదాలకు గురై గాయాలైన వారికి ప్రథమ చికిత్స అందించి దుస్తు లు, ఆహార పదార్థాలు పానీయాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పావని, సభ్యులు నేహా, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు బిఆర్ఎస్‌గ్రేటర్ హైదరాబాద్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్‌రావు
నవతెలంగాణ-ముషీరాబాద్

సంక్షేమ పథకాల పట్ల మంచి స్పందన

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు జరుపుతున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం నల్లకుంట డివిజన్‌కు చెందిన 400 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలోచేరారు. గోల్నాకలోని ఏకేప్లాజా ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు పోతోందని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచిస్తూ, వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ ఒక సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మేడి ప్రసాద్ , బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

గుర్తుతెలియని రైలు కిందపడి ఓ వ్యక్తి శనివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని నాంపల్లి రైల్వే పోలీసులు తెలిపారు. ఆదివారం వాళు తెలిపిన వివరాల ప్రకారం లింగంపల్లి రైల్వే స్టేషన్ చివరలో వికారాబాద్ వైపు ఒకవ్యక్తి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పేర్కొన్నారు ఉండవచ్చు అని చెప్పారు. నల్ల గీతలు కలిగిన అంగి. నల్ల పాయింటు ధరించి ఉన్నట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

- తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఇటీవల హైదర్‌గూడ సిగ్నల్స్ వద్ద పెద్ద చెట్టు కూలి ఆటోపై పడడ ంతో ప్రమాదవశాత్తు చనిపోయిన ఖైరతాబాద్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహమ్మద్ గౌస్ పాషా కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా వెంటనే ప్రకటించాలని తెలంగాణ ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రోజు వారీగా ఆటో నడుపుతూ తన కుటుంబం, తల్లిదండ్రులను పోషించుకుంటూ జీవనం సాగించే గౌస్‌పాషా కుటుం బాన్ని, అతని పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మహమ్మద్ గౌస్‌పాషా మృతికి ప్రగాఢ సంతాపం, అతని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్. జంగయ్య, ఎ.బిక్షపతి యాదవ్, కె.బాబు, ఎండి.ఉమర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణకు అవగాహన సదస్సులు



తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో "ఆత్మహత్యల నివారణకు అవగాహన సదస్సులను" నిర్వహించనున్నట్లు తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్ లో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోతుకూరి రాంచందర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారిగా సదస్సులు నిర్వహించి సమాజంలో కచ్చితంగా జీవితం పట్ల ఆశను కల్పిస్తాయని, జీవిస్తూ మీ లక్ష్యాలను సాధించుకోవడానికి నమ్మకం కలిగిస్తామన్నారు.

అనేక సమస్యలను ప్రతి నిత్యం ఉదయం పేపర్ నందు కనిపిం చే విషాదకర వార్తలు, ఆత్మహత్యలు, ప్రతి చిన్న విష యానికి ఆత్మహత్యలు జరుగుతున్న విషాదకర ఘటనలు మనల్ని మానసిక ధృఢత్వం, స్వీయ నియంత్రణలతో ప్రతి ఒక్కరు జీవితాల్ని కాపాడుకోవాల్సిన అవసరముందని, అర్ధంతరంగ అందమైన జీవితాలను ముంగించవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంపటి రాజు, ఉపాధ్యక్షులు డాక్టర్ జీ.సి కవిత, డాక్టర్ సి.వై.ఎస్ కృష్ణ, కోశాధికారి డాక్టర్ శ్రీపూజ, కార్యదర్శి ఎ.సుధాకర్, రంగారెడ్డి జిల్లాఅధ్యక్షులుడాక్టర్ శివరామప్రసాద్, నాయకులువైదేహి, రేణుక తదితర పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



- ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. వైష్ణవ బండారు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్ టిఆర్‌టీ కమ్యూనిటీ హాల్లో మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, వైష్ణవి బండారు ఫౌండేషన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి హాజరై మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చూపించాలని, స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ మహిళా శక్తిని చాటాలన్నారు. మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు పావని వినయ్ కుమార్, సుప్రియ నవీన్ గౌడ్, రచన శ్రీ, నాయకులు పూసరాజు, వినయ్ కుమార్, నవీన్ గౌడ్, వెంకటేష్, మహేందర్, ఆనంద్, తదితర నాయకులు పాల్గొన్నారు

ఆర్యవైశ్య హాస్టల్ (గర్ల్స్) నూతన భవనాన్ని నిర్మిస్తాం

- పాల్గొన్న ప్రముఖ నేతలు

నవతెలంగాణ-ముషీరాబాద్



ఆర్యవైశ్యహాస్టల్ (గర్ల్స్) నూతన భవనం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తామని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా,వైశ్య ఫెడరేషన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళి గుప్త అన్నారు. ఆర్యవైశ్య హాస్టల్ (గర్ల్స్) నూతన భవనం నిర్మాణనికి బోలక్ పూర్ ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 గదులతో నిర్మించబడుతున్న నూతన భవనానికి మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ 50 లక్షల విరాళం ప్రకటించారు, ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా, పది లక్షలు, గంజి రాజమౌళి గుప్తా పది లక్షల విరాళం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బొగ్గా రపు దయానంద్, ఐవిఎఫ్ స్టేట్ జనరల్ సెక్రెటరీ పబ్బ చంద్రశేఖర్, గెల్లి రమేష్, గౌర శ్రీనివాస్, ప్రభాకర్, ముత్యాల సత్తయ్య రవిరాజు, చందా భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు తీసుకోవటం జరుగుతుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న పహడి షరీఫ్ లోని ప్రీమియం గార్డెన్ లో ఏర్పాటు చేసిన మస్జిద్ కమిటీ సమావేశంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, యువ నాయకులు కార్తీక్ రెడ్డి ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సమావేశంలొ ముస్లిం పెద్దలు సబితా ఇంద్రారెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి గతంలో ఎవరు చేయలేదని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే జల్ పల్లి మునిసిపాలిటీలో ఉండే ప్రజలకు మెటర్నరీ హాస్పిటల్, ఒక కాలేజ్ ఏర్పాటు చేయాలని మంత్రి కోరడం జరిగిందని అందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ మీరు కోరిన వెటర్నరీ ఆస్పత్రి కాలేజ్ యూత్ ఆడుకోవడానికి ప్లేగ్రౌండ్ షాదిఖానాను ఈ నాలుగు రాబోయే రోజుల్లో తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ యూసుఫ్ పటేల్, అధ్యక్షులు ఎక్బాల్ ఖలీఫా,మహేశ్వరం నియోజకవర్గం పార్టీ ఉపాధ్యక్షులు నాసర్ వల్గి, కౌన్సిలర్లు అనుబంధ సంస్థ నాయకులు, బీఆంఎస్ నేతలు, కార్యకర్తలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



ఆమె ఒకప్పుడు యాసిడ్ దాడికి గురయ్యింది. చూపు కోల్పోయింది. బాధతో కుంగిపోయి ఎంతో కాలం తన ముఖాన్ని దాచేసుకుంది. ఆ గాయం వల్ల తన శరీరం, మనసు ఎంతగా విలవిలలాడిందో గ్రహించింది. ఆర్థిక భారం అడుగు బయట పెట్టేలా చేసింది. తనలాంటి బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలనే లక్ష్యం పెట్టుకుంది. అప్నా ఘర్ (మన ఇల్లు) ప్రారంభించి యాసిడ్ దాడులకు గురైన వారికి సురక్షితమైన జీవితాన్ని అందిస్తుంది. ఆమే షాహీన్ మాలిక్. బాధితుల శరీరక గాయాలనే కాదు, మనసుకైన గాయాలను సైతం నయం చేస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

గాయాన్ని నయం చేస్తుంది...

2016లో సుష్మ వివాహం చేసుకుంది. అయితే భర్త మద్యానికి బానిసై హింసించేవాడు. విపరీతమైన సవాళ్ల ఎదుర్కొంటూనే తన వివాహ జీవితాన్ని కొనసాగించింది. మగబిడ్డ పుట్టిన తర్వాత ఈ జంట తమ స్వస్థలం నుండి ఢిల్లీకి మకాం మార్చాలని నిర్ణయించుకున్నారు. కొత్త ప్రాంతంలోనైనా భర్త మారతాడని ఆశించింది. కానీ ఆమె ఆశ నెరవేరలేదు. ఒకరోజు ఇద్దరి మధ్య గొడవ జరిగి భర్త యాసిడ్ బాటిల్ తీసుకుని ఆమెతో బలవంతంగా తాగించాడు. ప్రతి గుటకకి యాసిడ్ వల్ల కలిగే నొప్పి సుష్మ శరీరంలో వ్యాపించింది. ఆ బాధ భరించలేకపోయింది. యాసిడ్ ఆమె ఆహార వాహికను పూర్తిగా దెబ్బతీసింది. ఏమీ తాగలేని, తినలేని పరిస్థితి వచ్చింది. "ఈ దాడి తర్వాత జీవించాలనే కోరికే నాలో చచ్చిపోయింది" అని చెప్పింది. అయితే ఆమె బాధ అంతటితో ఆగలేదు. ప్రమాదం తర్వాత ఆమె తన స్వగ్రామానికి వెళ్లింది. అక్కడ భర్త మళ్లీ ఆమెపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. అనేక ఆసుపత్రులకు తిరిగి, లెక్కకు మించి వైద్య చికిత్సలు, విపరీతమైన డబ్బు ఖర్చు పెట్టి చివరకు ఢిల్లీలోని "అప్నా ఘర్" గురించి తెలుసుకుంది.

సురక్షితమైన స్థలం

అప్నా ఘర్ అనేది బ్రేవ్ సోల్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించబడుతున్న షెల్టర్ హోమ్. ఇది యాసిడ్ దాడులకు గురై, కుటుంబం నుండి వదిలివేయబడిన మహిళలకు సురక్షితమైన స్థలం. 2013లో యాసిడ్ దాడికి గురై ఆ గాయం నుండి బయటపడిన షాహీన్ మాలిక్ 2021లో దీన్ని ప్రారంభించారు. ఈ హోమ్ బాధితులకు వైద్యం, చికిత్సతో పాటు భవిష్యత్‌లో వారు స్థిరపడేందుకు నైపుణ్యాలు, అవసరమైన న్యాయ సహాయాన్ని అందిస్తోంది. 'రెండేండ్లు చికిత్స చేయించుని చాలా డబ్బు ఖర్చు పెట్టాను. అప్పుడు నాకు బ్రేవ్ సోల్ ఫౌండేషన్, అప్నా ఘర్ గురించి తెలిసింది. ఈ హోమ్‌కు మారిన తర్వాత నా చికిత్స, మందులు అన్నీ ఎన్‌జీఓనే చూసుకుంది. ప్రభుత్వం నుంచి 3 లక్షల పరిహారం కూడా పొందాను. ఈ హోమ్ నాకు నివసించడానికి ఒక స్థలాన్ని ఇచ్చింది' అని సుష్మా చెప్పింది. ఆమె తన భర్తపై కేసు పెట్టి ఇప్పటికీ పోరాడుతూనే ఉంది. ఆమె అవసరాలన్నీ హోమ్ చూసుకుంటుంది. ప్రస్తుతం ఆమె ఇంగ్లీష్‌తో పాటు కంప్యూటర్‌లో ప్రాథమిక శిక్షణ తీసుకుంటోంది.

సూదులు గుచ్చినట్టు...

షాహీన్ పంజాబ్ టెక్నికల్ కాలేజీ నుంచి ఎంబీఏ చదువుతూ స్టూడెంట్ కౌన్సెలర్‌గా పనిచేసేది. 2009లో కాలేజీ నుండి బయటకి వస్తుండగా ఆమె యజమాని పంపిన వ్యక్తి ఆమెపై దాడి చేశాడు. 'మొదట్లో ఎవరో నాపై సరదాగా ఏదో చల్లి ఆడుతున్నారని అనుకున్నాను. కానీ కొన్ని సెకన్ల తర్వాత నా చర్మం కాలిపోతున్నట్లు అనిపించింది. బాధ భరించలేక కేకలు వేయడంతో చుట్టుపక్కల ప్రజలు గుమిగూడి నా ముఖంపై నీళ్ల పోశారు. ప్రతి నీటి చుక్క నా చర్మంలోకి సూదులు గుచ్చినట్టు అనిపించింది" అంటూ ఆమె వివరిస్తుంది. ఇప్పటి వరకు ఆమెకు మొత్తం 25 శస్త్ర చికిత్సలు జరిగాయి. దాడి తర్వాత ఒక కన్ను పూర్తిగా చూపు కోల్పోయింది, మరొకటి కాస్త కనబడుతుంది. "దాడి తర్వాత నన్ను నేను దాచుకున్నాను. తీవ్ర నిరాశకు లోనయ్యాను. నేను కోల్పోయిన నా ముఖం, నా గుర్తింపు చాలా బాధాకరమైనది. ప్రతిరోజూ అద్దంలో చూసుకుంటూ, ఆ మచ్చలను మోస్తూ కోల్పోయిన జీవితాన్ని ఊహించుకుంటూ బాధపడేదాన్ని' అని ఆమె పంచుకుంది.



మానసిక క్షోభ...

'యాసిడ్ దాడుల బాధితులు తమ శారీరక సవాళ్ల గురించి మరచిపోయి ఇతరుల మాదిరిగానే పని చేయాలని ఆశిస్తారు. మిగిలివున్న ప్రాణాలు వారి జీవితాలను కొనసాగించలేవు. ఇటువంటి సంఘటనల తర్వాత ప్రాణాలతో బయటపడినవారు సాధారణంగా తమ గుర్తింపు కోల్పోతుంటారు. జీవితకాల వైకల్యాలు, కనిపించే మచ్చలు వారి బాధను నిరంతరం గుర్తుచేస్తూనే ఉంటాయి. ఎగతాళి చేసేవారు, తమ ముఖాన్ని చూసి భయపడే పిల్లలు, విచిత్రంగా చూసే చూపులతో మానసిక క్షోభకు గురవుతుంటారు. ఈ సామాజిక వివక్ష కొన్నిసార్లు అంటరానితనం స్థాయికి చేరుకుంటుంది. దాంతో కొందరు ఆత్మహత్యకు పాల్పడుతుంటారు' అంటారు షాహిన్.

జీవితాన్ని పునర్నిర్మించుకునేలా...

యాసిడ్ దాడుల బాధితుల కోసం భారతదేశంలో వనరులు, పునరావాస కేంద్రాలు లేవని గుర్తించిన షాహిన్ బ్రేవ్ సోల్ ఫౌండేషన్, అప్నా ఘర్ ప్రారంభించారు. షెల్టర్ హోమ్ గత రెండేండ్లలో ఎన్‌సిఆర్‌లోని నాలుగు ఆసుపత్రులతో కలిసి 50కి పైగా పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు చేయించింది. షాహిన్ ఇప్పటివరకు దాదాపు 200 మంది యాసిడ్ దాడి బాధితులకు సహాయం చేశారు. బీహార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ ప్రజలు అప్నా ఘర్‌లో భాగంగా ఉన్నారు. షెల్టర్ హోమ్ మహిళలకు ప్రాథమిక ఇంగ్లీష్, కంప్యూటర్ తరగతులను అందిస్తుంది. అదే సమయంలో వారు ప్రభుత్వం నుండి పరిహారం పొందడంలో సహాయం అందిస్తారు. అలాగే చట్టపరమైన కేసులను దాఖలు చేయడం, ఇతర రాష్ట్రాల నుండి ఢిల్లీకి వారి పిటిషన్లను బదిలీ చేయడం ద్వారా వారికి మార్గనిర్దేశం చేస్తారు. దాడికి గురైన చాలా మంది బాలికలు యుక్తవయసులో ఉన్నందున ఎన్‌జీఓ వారికి ఓపెన్ పాఠశాలలు, కళాశాలల ద్వారా చదువు పూర్తి చేసే అవకాశాన్ని కూడా అందిస్తుంది. హోమ్‌లో ఉండని బాధిత మహిళలకు నెలవారీ సరుకులు, మందులు సరఫరా చేస్తున్నారు. అలాగే వారి అవసరాలకు అనుగుణంగా రూ.4,000 నుంచి రూ.5,000 వరకు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు.

దేశ వ్యాప్తంగా స్థాపించేందుకు

ఎన్‌జీఓ విరాళాల ద్వారా కూడా నిధులు పొందుతుంది. యాసిడ్ దాడి తర్వాత ఎక్కువ మంది సామాజిక ఒంటరితనం, నిరాశతో బాధపడుతున్నారని షాహిన్ అంటున్నారు. ఆ సమయంలో సరైన, పూర్తి పునరావాసం, మద్దతు వారికి చాలా ముఖ్యం. 'యాసిడ్ దాడులు చాలా మందికి ఏదో ఒక రకమైన వైకల్యాన్ని సృష్టిస్తాయి. ఈ కొత్త వాస్తవాన్ని అంగీకరించడం చాలా కష్టం' అని ఆమె జతచేస్తున్నారు. అందుకే ఎన్‌జీఓ వారికి పునరావాసంతో పాటు ప్రతి ఒక్కరికి మానసిక చికిత్సను కూడా అందిస్తుంది. ఇప్పటివరకు ఎన్‌జీఓకు ఢిల్లీలో ఒక కేంద్రం, కోల్‌కతాలో ఒకటి ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ అప్నా ఘర్ దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో స్థాపించాలనే లక్ష్యంతో షాహిన్ కృషి చేస్తున్నారు. యాసిడ్ రిటైల్ విక్రయాలపై నిషేధం విధించాలని ఆమె వాదిస్తున్నారు. బాధితుల పట్ల ప్రపంచం మరింత సున్నితంగా మారాలని, వారి జీవితాలను పునర్నిర్మించుకోవడానికి అవసరమైన ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుకుంటున్నారు. 'గతంలో జరిగిన దాన్ని మేము మార్చలేము. అయితే ప్రాణాలతో బయటపడినవారికి మెరుగైన, మరింత ఆశాజనక భవిష్యత్తును సృష్టించడంలో మేము కచ్చితంగా సహాయం చేస్తాము' అంటూ షాహిన్ తన మాటలు ముగించారు.

కుటుంబానికి వీరు ఆర్థిక భారం

2013లో ఆర్థిక ఇబ్బందులతో షాహీన్ బయటకు వచ్చి పని చేయాలని నిర్ణయించుకున్నారు. యాసిడ్ దాడి బాధితుల కోసం పనిచేస్తున్న ఒక సంస్థలో చేరారు. యాసిడ్ దాడి నుండి బయటపడిన వ్యక్తికి శారీరక, మానసిక నష్టం మాత్రమే కాకుండా ఆర్థిక భారం పెద్ద సవాలు. వారికి జీవితాంతం చికిత్స, సంరక్షణ చాలా అవసరం. జీవితకాలం మందులు వాడాల్సి వస్తుంది. దాదాపు 10 నుండి 15 శస్త్రచికిత్సలు అవసరం ఉంటాయి. ఒక్కోసారి అంతకంటే ఎక్కువ చేయించుకోవల్సి వస్తుంది. ఒక్కో శస్త్రచికిత్సకు దాదాపు లక్ష ఖర్చవుతుంది. ఈ చికిత్సలతో వారి రోగనిరోధక వ్యవస్థ, సాధారణ ఆరోగ్యం కూడా ప్రభావితమవుతాయి. దాడితో ఏర్పడిన వైకల్యం కారణంగా ఉపాధి కోల్పోవడంతో పాటు ఖర్చులు భారీగా పెరుగుతాయి. "బాధితులు కుటుంబాలకు ఆర్థిక భారంగా మారతారు. అనేక సందర్భాల్లో వారు వారి సొంత కుటుంబాలచే వదిలివేయబడతారు" అని ఆమె చెప్పారు.



క్రమం తప్పకుండా తీసుకుంటే...

పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఒక్కో పండుకు కొన్ని కొన్ని సమస్యలను దూరం చేసే గుణం ఉంటుంది. అందులో చెప్పకోదగినది బొప్పాయి. బొప్పాయిలో విటమిన్ ఏ ఉంటుంది. దీనితో పాటు అనేక పోషకాలు.. ఆరోగ్య ప్రయోజనాలూ ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం...



→ బొప్పాయి రక్త నాళాలలో కొలెస్ట్రాల్ పెరగకుండా నిరోధిస్తుంది. ఇందులో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. కనుక హృదయ స్పందన రేటు, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

→ కొవ్వును కరిగించడంలో బొప్పాయి సహాయపడుతుంది. తక్కువ కాలరీలున్న పండు కావడంతో బరువు నియంత్రణకు సహాయపడుతుంది.

→ తల్లిపాలను ఇచ్చే సమయంలో పండిన బొప్పాయి తినడం చాలా మంచి ఎంపిక. తాజా, పండిన బొప్పాయిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. పలు ఇన్‌ఫెక్షన్‌లను నివారిస్తుంది.

→ పాలిచ్చే తల్లులలో పాల ఉత్పత్తిని పెంచడానికి సహాయపడుతుంది. ఆకుపచ్చ బొప్పాయిలు ఎక్కువ లాక్టోజెనిక్, అందువల్ల పాలిచ్చే తల్లులు కచ్చితంగా ఆకుపచ్చ బొప్పాయిలను కలుపుకొని వేర్వేరు వంటకాలలో తినొచ్చు.

→ బొప్పాయిలో మలబద్ధకాన్ని నివారించే డైటరీ ఫైబర్ ఉంటుంది. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థకు అద్భుతాలు చేస్తుంది. ఇది అధిక కొలెస్ట్రాల్ స్థాయిలను కూడా తగ్గిస్తుంది. రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రిస్తుంది.



కాకరకాయ ముక్కలకు కొంచెం ఉప్పు రాసి నీళ్ళు చల్లి గంట సేపు నానబెడితే చేదు పోతుంది.

జమిలిపై మీ వైఖరేంటి..?



(మొదటిపేజి తరువాయి)

చెప్పాలని కోరారు.బీజేపీతో తమకు ఎలాంటి సంబంధాలు లేవన్న కేసీఆర్... ఈ విషయంలో తమ పార్టీ వైఖరి ఏమిటో ప్రజలకు విస్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా కేసీఆర్ మౌనంగా ఉన్నారంటే బీజేపీకి అనుకూలమనుకోవాలా? అని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.అనేక అంతర్గత సర్వేల్లో బీజేపీకి వ్యతిరేక ఫలితాలు వచ్చాయని చెప్పారు. అందుకే ఓటమి భయంతో మోడీ 'వన్ నేషన్-వన్ఎలక్షన్' విధానానికి త్వరపడుతున్నారని ఆరోపించారు. 'అవి అధ్యక్ష తరహా ఎన్నికలుగా మారే అవకాశం ఉంది. అదే జరిగితే దక్షిణాది ఉనికే ప్రశ్నార్థకం అవుతుంది' అని ఆందోళన వ్యక్తం చేశారు. జమిలి బిల్లు ఆమోదం పొందాలంటే 2/3 మెజార్టీ కావాలన్నారు. జమిలి విధానంతో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి ఆటంకం కలుగుతుందని తెలిపారు. తిరిగి కేంద్రంలో అధికారానికి వచ్చేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని చెప్పారు. ఈ కుట్రను తాను ముందుగానే ఊహించి లోక్‌సభలో ప్రస్తావించినట్టు తెలిపారు. ప్రస్తుతం బీజేపీ మాయ మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని చెప్పారు. ప్రధాని మోడీ, అమిత్‌షా 30 రోజులు కర్నాటకలో గల్లీ గల్లీ తిరిగి ప్రచారం చేసినా బీజేపీ గెలవలేదన్నారు. పార్లమెంట్‌లో మణిపూర్ ఘటనపై ప్రధాని ఒక్క మాట మాట్లాడలేదన్నారు. ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిందన్నారు. మోడీ నాయకత్వంలో దేశానికి భద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతున్నదనే సంకేతాలు వస్తున్నాయని చెప్పారు. సీ ఓటర్ సర్వే ప్రకారం రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ 38 శాతం, బీఆర్ఎస్ 31శాతం ఓట్లు మాత్రమే పొందే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, ఎన్డీఏ కూటమికి అవమానకర పరిస్థితి ఎదురవుతుందనే మోడీ సర్కారు భయపడుతున్నదని చెప్పారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగ మూల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఎలాంటి మార్పులు తెచ్చినా కాంగ్రెస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

బోయలకు ఇచ్చిన మాట తప్పిన కేసీఆర్

బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తాంటూ కేసీఆర్ మాట తప్పారని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వాల్మీకి బోయలు రేవంత్‌ను కలిశారు. తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ ఆనాడు నడిగడ్డలో పాదయాత్ర చేస్తే, బోయలు కేసీఆర్‌కు అండగా నిలబడ్డారన్నారు.2009లో మహబూబ్‌నగర్‌కు వలస వచ్చిన కేసీఆర్‌ను ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. కానీ 2014లో కేసీఆర్ బోయ భీముడిని ఎమ్మెల్సీ చేస్తానంటూ మాట ఇచ్చి తప్పారని విమర్శించారు. పదేండ్లు అయినా కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు.అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్ గద్వాల, అలంపూర్ నిర్వాసితులను ఆదుకోలేదని విమర్శించారు. ఆనాడు బంగ్లాలను బద్దలు కొట్టి...గట్టు భీమున్నీ ఎమ్మెల్యే చేసి మీ పౌరుషాన్ని చాటారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వాల్మీకి బోయల అండ లేకుండా ఎవరూ గెలవలేరని చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న 14 సీట్లలో కనీసం 12 గెలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మాట్లాడారు.

చేరికలు: కొడంగల్ నియోజకవర్గం బొమ్రాస్‌పేట్ మండలానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం, కడెం, ఉట్నూర్, ఇంద్రవెల్లికి చెందిన ఎంపీటీలు, మచ్చ పోసవ్వ, శంకరయ్య, కనక మోహన్, సర్పంచ్‌లు పెందుర్ లింగు, కొడప భీమ్రావు, వెట్టి గంగ జక్కు, కనక వామన్, కనక రాము తదితరులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

బీజేపీ డౌన్‌ఫాల్ షురూ..

(మొదటిపేజి తరువాయి)

బీఆర్ఎస్, జాతీయ స్థాయిలో ఎంఐఎం మరోసారి బీజేపీని గెలిపించేందుకు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేస్తారనే ఉద్దేశంతోనే బీజేపీకి కేసీఆర్ అనుకూలంగా మారారని చెప్పారు. జమిలీ ఎన్నికల నేపథ్యంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ ఒక బోగస్ అని కొట్టిపారేశారు. ఈ కమిటీలో ఉన్న సభ్యులు కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఏది చెబితే అదే చేస్తారనీ, ఎక్కడ సంతకాలు పెట్టమంటే అక్కడ పెడతారనీ, అలాంటి కమిటీకి దేశ వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలూ సహాయ నిరాకరణ చేయాలన్నదే తమ ఉద్దేశమన్నారు. కోవింద్‌కు ఏ మాత్రం విజ్ఞత ఉన్నా. అవమానకరమైన ఈ కమిటీకి నాయకత్వ బాధ్యతను తిరస్కరించాలని సూచించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో న్యాయవ్యవస్థ మొదలు అన్ని వ్యవస్థలూ కుప్పకూలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికలకు పార్లమెంట్, ఇతర అసెంబ్లీలో 2/3 వంతు మద్దతు ఉండాలనీ, కానీ అధికారంలో ఉన్న బీజేపీ ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జమిలి ఎన్నికల అంశంపై కనీసం అఖిలపక్ష సమావేశాన్ని కూడా నిర్వహించకపోవడం దారుణమన్నారు. జమిలి ఎన్నికలను బీఆర్ఎస్, వైసీపీ,టీడీపీ ఖండించకపోతే ఆ పార్టీలు బీజేపీకి సానుకూలంగా ఉన్నట్టుగానే భావించాల్సి వస్తుందన్నారు. మణిపూర్ మంటలను కేంద్రంలోని బీజేపీ ప్రోత్సహిస్తున్నదనీ, అక్కడి సీఎం విధ్వసంకారులకు ఏజెంట్‌గా పనిచేస్తున్నారని విమర్శించారు. ఇస్రో ప్రయత్నాలకు కూడా ప్రధాని మోడీ మతం రంగు పులిమేందుకు చూస్తున్నారన్నారని చెప్పారు. బీజేపీకి సేవ చేసేందుకే ఎంఐఎం కృషి చేస్తున్నదనీ, బీజేపీ, ఎంఐఎంలది లివింగ్ టు గెదర్ అని ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీలు కలిసే నాటకాలు ఆడుతున్నాయని, బీజేపీని గెలిపించేందుకే ఎంఐఎం పావులు కదుపుతున్నదన్నారు. తాజాగా కేసీఆర్ కూడా వారి భుజమెక్కారన్నారు. ఎంఐఎం నేతల ఇండ్లపై సీబీఐ దాడులు నిర్వహిస్తే అనేక కోట్ల అక్రమ సంపాదన వెలుగులోకి వస్తుందన్నారు. వై.ఎస్. జగన్ తన కేసుల నుండి తప్పించుకునేందుకు బీజేపీకి మద్దతు పలుకుతున్నారని విమర్శించారు. తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన విభజన హామీలను బీజేపీ ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. బీజేపీ పట్ల కేసీఆర్ తన నాభి నుంచి కాకుండా నాలుకతో మాట్లాడుతున్నారన్నారనీ, అందువల్లనే తాము బీఆర్ఎస్‌కు దూరమయ్యామని ఒక ప్రశ్నకు సమాధానంగా నారాయణ బదులిచ్చారు.

భారత్ వెలిగిపోతుందట!

(మొదటిపేజి తరువాయి)

దేశం ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితి గురించి ఆయన ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు.

భారత దేశంలో అభివృద్ధికి మార్గం చూపిన 'సబ్‌కా సాత్ - సబ్‌కా వికాస్' నినాదం ప్రపంచ సంక్షేమానికి మార్గదర్శక సూత్రం లాంటిదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఒక వారంలో భారత్ జీ20 సమ్మిట్‌కు ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ ప్రధాన సంపాదకులు సహా ముగ్గురు సీనియర్ సిబ్బందికి సుమారు 80 నిమిషాలు పాటు మోడీ ఇంటర్వ్యూ ఇచ్చారు. గత ఏడాది నవంబర్‌లో ఇండోనేషియా నుంచి భారత్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించింది. ఈ డిసెంబర్‌లో బ్రెజిల్‌కు అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలి. ఈ నెల 9, 10 తేదీల్లో జరిగే ముందస్తు వార్షిక సమావేశంలో అమెరికా అధ్యక్షులు జో బైడెన్, జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, సౌదీ అరేబియా రాజు మహ్మద్ బిన్ సల్మాన్, ఇతర ప్రపంచ నాయకులు పాల్గొననున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత సరికొత్త ప్రపంచ క్రమం ఏర్పడినట్లే, కోవిడ్ మహమ్మారి తరువాత మరొక నూతన ప్రపంచ క్రమం రూపుదిద్దుకుంటుందని చెప్పారు. జీడీపీ కేంద్రీకృత దృక్పథం నుంచి ప్రస్తుత ప్రపంచం మానవ - కేంద్రీకృత దృక్పథానికి మారుతుందని మోడీ అన్నారు. ఇందులో భారత్ ఉత్ప్రేరకం పాత్రను పోషిస్తుందని అన్నారు. ఈ ఇంటర్వ్యూలో భారతదేశ ఆర్థిక పురోగతి, ప్రపంచ వేదికలపై భారత్ ఎదుగుదల, సైబర్ భద్రత, రుణాల ఉచ్చు, బయో-ఇంధన విధానం, ఐక్యరాజ్యసమితి సంస్కరణలు, వాతావరణ మార్పులు, 2047లో భారత్ ఎలా ఉండబోతుంది.. వంటి అంశాలపై మోడీ మాట్లాడారు.

ప్రపంచ రుణ సంక్షోభం గురించి మోడీ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇది చాలా ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఆర్థిక క్రమశిక్షణపై రాష్ట్ర ప్రభుత్వాలు స్పృహతో ఉండాలని అన్నారు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలకు మోడీ పిలుపునిచ్చారు. 20వ శతాబ్దాపు విధానంతో 21వ శతాబ్దంలో ప్రపంచానికి సేవలు అందించలేమని అన్నారు. వాతావరణ మార్పుల గురించి మాట్లాడుతూ వాతావరణ లక్ష్యాలను అందుకోవడంలో భారత్ ఎప్పుడూ అలక్ష్యం వహించలేదని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా భారత్ తీసుకున్న చర్య ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందిందని మోడీ చెప్పారు. కొన్నేళ్లలోనే సౌరశక్తి సామర్థ్యాన్ని 20 రెట్లు పెంచుకున్నామని తెలిపారు.

కేసీఆర్ వేగులు

(మొదటిపేజి తరువాయి)

ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన్ను ఎలా ఇబ్బంది పెట్టొచ్చనే అంశాలపై దృష్టి సారించినట్టు సమాచారం. ఈ ఏడాది ఆరంభం నుంచి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరసన గళం వినిపిస్తుండటంతో ఆయన్ను టార్గెట్‌గా చేసుకుని నిఘాను పటిష్టం చేశారు. జులై 2 జనగర్జన సభ సమయంలో పొంగులేటిని ఉక్కిరిబిక్కిరి చేసేలా ప్రభుత్వం వైపు నుంచి నిఘాను ముమ్మరం చేయడంతో ఆయన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. అయినప్పటికీ ఆయన ప్రతి కదలికపై నిఘా ఉన్నట్టు సమాచారం. ఇప్పుడు తుమ్మల నాగేశ్వరరావు విషయంలోనూ అటువంటి జాగ్రత్తలే తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

సొంతపార్టీ నేతలపైనా అనుమానం..

కేసీఆర్‌కు మొదటి నుంచి సొంత పార్టీ నేతల పైనా అనుమానాలున్నాయి. ఇటీవల ఖమ్మం జిల్లాలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా ఎప్పుడు ఎవరు పార్టీ వీడతారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పార్టీ వీడే నేతలతో.. వీడిన నేతలతో ఎవరు టచ్‌లో ఉంటున్నారు అనే విషయాలపై నిఘా బృందాలు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్టు సమాచారం. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ ఛైర్‌పర్సన్ల విషయంలో అయితే.. షాడో టీమ్‌లు వారి వెన్నంటే ఉంటున్నాయంటున్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, ముఖ్య కార్యకర్తలు, సాధారణ ప్రజల విషయంలో వారు వ్యవహరిస్తున్న తీరును సైతం పరిశీలిస్తున్నట్టు సమాచారం. ప్రత్యర్థులు, ప్రతిపక్షాలతో వ్యవహరిస్తున్న తీరు, ఇతర పార్టీల నాయకులతో వ్యాపార లావాదేవీలపై ఆరా తీస్తున్నాయి. కొందరు ప్రజాప్రతినిధులు ఇంటెలిజెన్స్‌కు చిక్కకుండా.. గన్‌మెన్లను, సెల్‌ఫోన్లను సైతం వదిలేసి వెళ్తున్న ఘటనల వివరాలు కూడా రాజధానికి చేరుతున్నాయి. ఈ నిఘా బృందాల సమాచారం జిల్లా స్థాయి ఇంటిలిజెన్స్ వ్యవస్థకు తెలుసా? తెలియదా? అనే సందేహాలున్నాయి.

ఇద్దరు అభ్యర్థులను మార్చే అవకాశం?

ఈ నిఘా వర్గాలు ఇస్తున్న సమాచారం ఆధారంగా అభ్యర్థుల వ్యవహార శైలిని ఎప్పటికప్పుడు నిశితంగా సీఎం పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. వేగులిచ్చే రిపోర్టు ఆధారంగా ఎన్నికల నాటికి ఒకరిద్దరు అభ్యర్థులను సైతం మార్చే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. ఖమ్మం జిల్లాలో ఒకరు, భద్రాద్రి కొత్తగూడెంలో ఒకరిని మార్చవచ్చంటున్నారు.

భారత ఐక్యతపై దాడి

(మొదటిపేజి తరువాయి)

చూస్తే కమిటీ సిఫార్సులను ఇప్పటికే నిర్ణయించినట్టు తెలుస్తోంది. అందుకే కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి ఆ కమిటీలో ఉండేందుకు నిరాకరించడం సరైనదే' అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు.

జమిలి ఎన్నికల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీలో భాగమయ్యేందుకు కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి నిరాకరించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేను కమిటీ నుంచి తప్పించడంపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖర్గేకు బదులుగా మాజీ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్‌ను ప్రభుత్వం ఈ కమిటీలో చేర్చడం గమనార్హం.

సోనియాకు అనారోగ్యం

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. సర్ గంగారామ్ ఆస్పత్రి వైద్యులు ఆమెకు చికిత్స చేశారు. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉన్నదని వైద్యులు తెలిపారు. ఆమె వైద్యుల పరిశీలనలోనే ఉన్నారు. ఇటీవల గతనెల 31న ముంబయిలో జరిగిన 'ఇండియా' కూటమి సమావేశానికి ఆమె, తన కుమారుడు రాహుల్ గాంధీతో కలిసి హాజరైన విషయం తెలిసిందే. ఈ ఏడాదిలోనే ఆమె ఇప్పటి వరకు రెండు సార్లు ఆస్పత్రిలో చేరటం గమనార్హం. ఈ ఏడాది జనవరిలో ఇన్ఫెక్షన్ కారణంగా, మార్చిలో జ్వరం కారణంగా సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు.

'సనాతన'ను నిర్మూలించాలి

చెన్నై : సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ అన్నారు. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకం అని అన్నారు. ఆయన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తమిళనాడు ప్రొగ్రెస్సివ్ రైటర్స్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ చెన్నైలో నిర్వహించిన సమావేశానికి హాజరైన ఉదయనిధి స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని ఆయన దోమలు, డెంగ్యూ, మలేరియా, కరోనా వ్యాధులతో పోల్చారు. "కొన్ని అంశాలను వ్యతిరేకించలేము, వాటిని నిర్మూలించాలి. మనం డెంగ్యూ, దోమలు, మలేరియా లేదా కరోనాను వ్యతిరేకించం. మనం వాటిని నిర్మూలించాల్సి ఉంటుంది. అదే దారిలో, మనం సనాతన (సనాతన ధర్మం)ను వ్యతిరేకించటం కంటే నిర్మూలించాలి. సనాతన అనేది సంస్కృతం నుంచి వచ్చింది. ఇది సామాజిక న్యాయం, సమానత్వానికి వ్యతిరేకం" అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు.

బీజేపీ అభ్యంతరం.. తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానన్న ఉదయనిధి

ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలను తమిళనాడు బీజేపీ వ్యతిరేకించింది. ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఉదయనిధి స్టాలిన్ హానికరమైన సిద్ధాంతాన్ని వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జ్ అమిత్ మాలవీయ.. ఉదయనిధి స్టాలిన్ మాట్లాడిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అయితే, అమిత్ పోస్టుకు ఉదయనిధి స్టాలిన్ కోట్ చేస్తూ.. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. తాను సనాతన ధర్మం వల్ల బాధను అనుభవించిన అణగారిన వర్గాల తరపున మాట్లాడానని పేర్కొన్నారు. న్యాయపరంగానైనా, ప్రజా కోర్టులో నైనా ఎదుర్కోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. అసత్య, నకిలీ వార్తల ప్రచారాన్ని మానుకోవాలని సూచించారు.

నియంతృత్వం దిశగా బీజేపీ పాలన

- ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎపి షా

న్యూఢిల్లీ : ప్రజాస్వామ్య వ్యవస్థలను ఉపయోగించుకుని బీజేపీ నియంతృత్వం దిశగా పయనిస్తోందని ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎపి షా విమర్శించారు. న్యాయస్థానాలను, మీడియాను నిర్వీర్యం చేయడం, భిన్నాభిప్రాయాలను అణిచివేయడం ఆ ధోరణికి నిదర్శనం అని అన్నారు. మైనారిటీలు భయంతో జీవిస్తుంటే... కోర్టులు చూస్తూ ఉన్నాయని అన్నారు. మనుస్మృతికి మద్దతుగా వాదించే న్యాయమూర్తులు మెజారిటీ భాష మాట్లాడుతున్నారని అన్నారు. బిజెపిని 'ఎన్నికైన నియంతృత్వం'గా అభివర్ణించిన ఆయన, వీడి సావర్కర్ కాలం చెల్లిన హిందుత్వ ఆశయాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు.

సూపర్ 4 వేదికల మార్పు?

- కొలంబోలో వర్ష సూచనలే కారణం
- భారత్, పాక్ మ్యాచ్ ప్రతికూల ప్రభావం

నవతెలంగాణ-కొలంబో


వాతావరణ పరిస్థితులు క్రికెట్‌ను ఎల్లప్పుడూ శాసిస్తున్నాయి. ఎంతో సాంకేతికత అందుబాటులోకి వచ్చినా.. వరుణ గండం నుంచి గట్టెక్కే మార్గం అంతర్జాతీయ క్రికెట్ కమిటీ (ఐసీసీ)కి చిక్కటం లేదు. ఆట, వినోదంతో పాటు వాణిజ్య విలువలు ముడిపడిన క్రికెట్.. అనూహ్య వాతావరణ మార్పులతో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. భారత్, పాకిస్థాన్ ఆసియా కప్ గ్రూప్ దశ మ్యాచ్ ఇందుకు చక్కటి నిదర్శనం. అంచనాల ప్రకారం, మ్యాచ్ ఆరంభానికి ముందు మాత్రమే వర్షం కురిసే సూచనలు కనిపించాయి. మ్యాచ్ సమయంలో ఎటువంటి వర్షం సూచనలు లేవని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. అయినా, భారత ఇన్నింగ్స్‌లో రెండు సార్లు అంతరాయం కలిగించిన వర్షం.. పాకిస్థాన్ ఇన్నింగ్స్ ఆరంభానికి అవకాశమే ఇవ్వలేదు. దీంతో ఉత్కంఠరేపిన దాయాదుల సమరం ఫలితం తేలకుండా ముగిసింది. ప్రసారదారు స్టార్‌స్పోర్ట్స్‌కు ఇది తీరని నష్టం తీసుకొచ్చిందని సమాచారం. సూపర్ 4 దశ మ్యాచులకు సైతం వరుణ గండం ఉండటంతో.. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ తరహా పరిస్థితులు పునరావృతం కాకుండా నివారించేందుకు.. వేదికలను మార్చేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నట్టు తెలుస్తుంది!.


దంబుల్లా అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం


మహీంద్ర రాజపక్స అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

కొలంబోకు వర్షం ముప్పు

సూపర్ 4 దశలో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు కొలంబో వేదిక కానుంది. ఇక్కడి ఆర్. ప్రేమదాస స్టేడియం దాయాదుల సమరానికి ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే, ఆ రోజు సైతం వాతావరణం అనుకూలంగా లేదు. రానున్న వారం రోజుల్లో కొలంబోను వరుణుడు ముంచెత్తనున్నాడు. అదే జరిగితే.. ఆసియా కప్ ప్రసారదారుకు భారీ నష్టాలు మిగల్చటం ఖాయం!. అభిమానులూ తీవ్ర నిరాశకు లోనవుతారు. అందుకే..



సూపర్ 4 దశలో కొలంబోలో జరగాల్సిన మ్యాచులను దంబుల్లా, హంబన్‌టోట స్టేడియాలకు రీ షెడ్యూల్ చేయాలనే ఆలోచన నిర్వాహకుల్లో ఉంది. నాలుగు జట్లకు వసతి, బస సహా ప్రసారదారు, అభిమానుల ఏర్పాట్లు ఇప్పటికిప్పుడు ఖాయం చేయటం అంత సులువు కాదు. కానీ, ప్రసారదారు స్టార్‌స్పోర్ట్స్ వేదికల మార్పుకు పట్టుబట్టినట్టు ఏసీసీ వర్గాలు చెబుతున్నాయి. ఓ టోర్నీ ఆరంభమైన అనంతరం.. షెడ్యూల్‌లో మార్పులు చేసిన దాఖలాలు పెద్దగా లేవు. తొలిసారి ఆసియా కప్‌లో షెడ్యూల్‌ను టోర్నీ మధ్యలో మార్చేందుకు రంగం సిద్ధమవుతోంది.

కాసుల కక్కుర్తి!

భద్రతా కారణాల రీత్యా పాకిస్థాన్‌లో పర్యటించేందుకు భారత జట్టు నిరాకరించగా... గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆసియా కప్‌ను శ్రీలంకలో నిర్వహించేందుకు ఆతిథ్య పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సమ్మతించింది. ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ మెగా మ్యాచ్ ద్వారా ఆదాయం ఆర్జించాలనే దురాలోచన శ్రీలంక క్రికెట్ బోర్డు చేసింది. దీంతో తొలిసారి భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు స్టాండ్స్‌లో కుర్చీలు ఖాళీగా కనిపించాయి. సాధారణ స్టాండ్స్‌కు రూ.10000, గ్రాండ్ స్టాండ్స్‌కు రూ.42500 (శ్రీలంక రూపాయలు) వసూలు చేశారు. శ్రీలంకలో సాధారణ స్టాండ్స్ టికెట్ ధర రూ. 250, గ్రాండ్ స్టాండ్స్ టికెట్ ధర రూ.1250 మాత్రమే. కానీ భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు సుమారు 80 రెట్లు అధిక ధరలకు టికెట్లను అమ్ముకున్నారు. అసలే ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో.. ఈ స్థాయిలో టికెట్ ధరలను నిర్ణయించి అభిమానుల ఆశలపై నీళ్లు చల్లారని శ్రీలంక క్రికెట్ బోర్డుపై విమర్శలు వస్తున్నాయి. శ్రీలంక, బంగ్లాదేశ్ మ్యాచ్‌కు సైతం స్టేడియంలో పెద్దగా అభిమానులు కనిపించలేదు. అందుకు సైతం అధిక టికెట్ ధరలే కారణం.

స్వదేశానికి బుమ్రా

భారత పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా స్వదేశానికి పయనమయ్యాడు. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో తుది జట్టులో నిలిచిన బుమ్రా.. గ్రూప్ దశలో నేపాల్‌తో మ్యాచ్‌కు ముందు ఇంటికి వచ్చాడు. కుటుంబ, వ్యక్తిగత కారణాలతోనే బుమ్రా స్వదేశానికి వచ్చినట్టు టీమ్ ఇండియా వర్గాలు వెల్లడించాయి. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న జశ్‌ప్రీత్ బుమ్రా.. ప్రస్తుతం మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాడని సూపర్ 4 దశకు తిరిగి జట్టుతో చేరుతాడని సమాచారం.

పసికూనతో పోరు

- నేడు భారత్, నేపాల్ మ్యాచ్
- పొంచి ఉన్న వర్షం ముప్పు

మధ్యాహ్నం 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

పాకిస్థాన్ పోరు వర్షార్పణం కాగా.. ఇప్పుడు పసికూనపై పంజా విసిరేందుకు టీమ్ ఇండియా సిద్ధమైంది. అగ్రజట్టు భారత్‌ను తొలిసారి ఎదుర్కొంటున్న నేపాల్ అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలనే తపనలో ఉంది. ఆటకు అంతరాయం కలిగించేందుకు వరుణుడు మరోసారి స్టేడియంలోకి ప్రవేశించేందుకు ఎదురు చూస్తున్నాడు. వర్షం ప్రమాదం నేపథ్యంలో మ్యాచ్‌లో ఫలితం తేలకుంటే టీమ్ ఇండియా నేరుగా సూపర్ 4కు అర్హత సాధించనుంది.

నవతెలంగాణ-పల్లెకల్

ఆటకు అంతరాయం కలిగించేందుకు వరుణుడు ఎదురు చూస్తుండగా.. పసికూనతో పోటీకి టీమ్ ఇండియా సై అంటోంది. నేపాల్ క్రికెట్ చరిత్రలోనే ఆ జట్టు అతిపెద్ద మ్యాచ్‌కు రెడీ అయ్యింది. నేపాల్ క్రికెట్ జట్టు మ్యాచ్‌ను తొలిసారి కోట్లాది మంది వీక్షించనున్నారు. దీంతో అగ్ర జట్టు, సూపర్‌స్టార్ క్రికెటర్లతో పోటీపడేందుకు నేపాల్ క్రికెటర్లు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పాకిస్థాన్‌తో పోరు అసంపూర్తిగా ముగియగా.. నేపాల్‌పై తిరుగులేని విజయంతో సూపర్ 4లో అడుగుపెట్టాలని రోహిత్‌సేన భావిస్తుంది. ఆసియా కప్ గ్రూప్-ఏలో భారత్, నేపాల్ పోరు నేడే.


ప్రాక్టీస్ సెషన్లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి

బుమ్రా లేకుండానే..


నేపాల్ కెప్టెన్ రోహిత్

భారత పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా.. నేడు నేపాల్‌తో మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఐర్లాండ్ పర్యటన అనంతరం నేరుగా వన్డే జట్టులోకి వచ్చిన బుమ్రాకు పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో బంతి అందుకునే అవకాశం రాలేదు. ఇప్పుడిప్పుడే పూర్తి ఫిట్‌నెస్ సాధించిన బుమ్రాను నేపాల్‌తో మ్యాచ్‌కు బెంచ్‌కు పరిమితం చేయనున్నారు. సూపర్ 4 దశకు బుమ్రా అందుబాటులోకి రానున్నాడు. వ్యక్తిగత కారణాలతో బుమ్రా స్వదేశానికి తిరిగి రాగా.. అతడి స్థానంలో మహ్మద్ షమి తుది జట్టులో చోటు సాధించనున్నాడు. తెలుగు తేజం తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్‌లకు అవకాశం ఇవ్వాలని అనుకుంటే తప్పితే.. బ్యాటింగ్ లైనప్‌లో ఎటువంటి మార్పులు ఉండే అవకాశం లేదు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో, ఒత్తిడిని జయిస్తూ పాక్‌పై అద్భుత ఇన్నింగ్స్ నమోదు చేసిన ఇషాన్ కిషన్.. తుది జట్టులో చోటు సుస్థిరం చేసుకునే పనిలో నిమగ్నమయ్యాడు. నేపాల్‌పై విధ్వంసక ఇన్నింగ్స్‌పై కిషన్ గురి పెట్టాడు. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ప్రపంచ శ్రేణి స్పిన్నర్ కుల్దీప్ మాయ ముంగిట నేపాల్ బ్యాటర్లు నిలువటం కష్టమే.

ఉత్సాహం డబుల్

అసోసియేట్ జట్టు నేపాల్.. ఆట పరంగా దేశవాళీలో రంజీ జట్టుతో సైతం పోటీపడలేదు. కానీ ఇటీవల కాలంలో ఆ జట్టు గొప్ప పురోగతి సాధించింది. భారత్ వంటి అగ్రజట్టుతో ఆడటంతో నేపాల్ క్రికెటర్ల ఆత్మవిశ్వాసం రెట్టింపు కానుంది. విజయంపై ఆశ లేకపోయినా.. అగ్ర జట్టు, సూపర్‌స్టార్ క్రికెటర్లతో ఆడే అవకాశం దక్కిందనే ఆనందంలో నేపాల్ శిబిరం కనిపిస్తుంది. యువ క్రికెటర్ రోహిత్ (21) నాయకత్వంలో.. నేపాల్ అతిపెద్ద మ్యాచ్‌కు సిద్ధమైంది. యువ స్పిన్నర్ లలిత్ గొప్పగా రాణిస్తున్నాడు. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో సైతం లలిత్ 33 డాట్ బాల్స్ సంధించాడు. నేడు సందీప్‌తో కలిసి భారత బ్యాటర్లకు సవాల్ విసిరేందుకు లలిత్ సిద్ధమవుతున్నాడు.

వరుణుడు వస్తాడని..!

ముత్తయ్య మురళీధరన్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో వరుసగా రెండో మ్యాచ్‌కు వరుణుడు రానున్నాడు. వర్షం కారణంగా భారత్, పాకిస్థాన్ మ్యాచ్ ఫలితం తేలకుండా ముగియగా.. నేడు భారత్, నేపాల్ మ్యాచ్‌లోనూ అవే పరిస్థితులు పునరావృతం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షం ముప్పు పొంచి ఉన్న తరుణంలో బ్యాటర్లకు ఇటు పిచ్ నుంచి, ఇటు వరుణుడు నుంచి కష్టాలు తప్పకపోవచ్చు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తుంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్.

నేపాల్ : కుశాల్ భుర్తెల్, ఆసిఫ్ షేక్ (వికెట్ కీపర్), రోహిత్ పాడెల్ (కెప్టెన్), ఆరిఫ్ షేక్, సోంపాల్ కామి, దీపేంద్ర సింగ్, గుల్షాన్ , కుశాల్ మల్ల, కరణ్ కెసి, సందీప్, లలిత్ రాజ్‌భన్సీ.

మనోళ్లు ముగ్గురు

- డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు అర్హత
- సెప్టెంబర్ 16,17న పతక వేట







యూజీన్ (అమెరికా) : ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు భారత్ నుంచి ముగ్గురు అథ్లెట్లు అర్హత సాధించారు. సెప్టెంబర్ 16, 17న అమెరికాలోని యూజీన్‌లో జరుగనున్న ఫైనల్స్‌లో భారత్ నుంచి ముగ్గురు అథ్లెట్లు పతక వేటలో నిలువనున్నారు. ప్రపంచ జావెలిన్ త్రో సూపర్‌స్టార్, భారత అథ్లెటిక్స్ హీరో నీరజ్ చోప్రా సహా స్ప్రింటర్ అవినాశ్ సబ్లె, జంపర్ మురళీ శ్రీశంకర్‌లు డైమండ్ లీగ్ ఫైనల్లో పోటీపడనున్నారు. ప్రపంచ అథ్లెటిక్స్‌లో డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు ప్రత్యేకత ఉంది. 14 పోటీల సిరీస్ అనంతరం అగ్రస్థానంలో నిలిచిన అథ్లెట్లు మాత్రమే డైమండ్ లీగ్‌కు అర్హత సాధిస్తారు. ఈ ఏడాది మే నెలలో మొదలైన డైమండ్ లీగ్ పోటీలు.. ఈ సెప్టెంబర్‌తో ముగియనుంది. డైమండ్ లీగ్‌లో 16 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. ప్రతి టోర్నీ (14 టోర్నీలు)లో విజేతలుగా నిలిచిన అథ్లెట్లకు వరుసగా 8, 7, 6, 5, 4, 3, 2, 1 చొప్పున పాయింట్లను కేటాయిస్తారు. చాంపియన్‌కు ఎనిమిది పాయింట్లు దక్కగా.. ఎనిమిదో స్థానంలో నిలిచిన అథ్లెట్‌కు ఒక్క పాయింట్ దక్కుతుంది. 14 టోర్నీలు ముగిసిన అనంతరం సాధించిన పాయింట్ల ఆధారంగా ఫైనల్స్‌కు అర్హత సాధించిన అథ్లెట్లను తేల్చుతారు. ఒలింపిక్, వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా.. దోహా, లాసానె, జ్యూరిచ్‌లలో మాత్రమే పోటీపడ్డాడు. జాకబ్ (చెక్ రిపబ్లిక్) 29, జులియన్ వెబర్ (జర్మనీ) 25 తర్వాత నీరజ్ చోప్రా 23 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు చేరుకున్నాడు. ఇక లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ 14 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. 3000మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో అవినాశ్ సబ్లె ఆరో స్థానంతో ఫైనల్స్‌కు చేరుకున్నాడు. మూడు టోర్నీల్లో పోటీపడిన అవినాశ్ 11 పాయింట్లు సాధించాడు. ఇక ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్‌లో పసిడి పతకం దిశగా సన్నద్ధమవుతున్న నీరజ్ చోప్రా.. విదేశాల్లో శిక్షణ పొందుతుండగా.. అవినాశ్, శ్రీశంకర్ సైతం ఫైనల్లో పతకంపై కన్నేసి సాధన చేస్తున్నారు.

నవచిత్రం

సైమా.. కౌంట్‌డౌన్ షురూ



ప్రతిష్టాత్మక 'సైమా' (సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) 2023 అవార్డ్స్ వేడుక ఈనెల 15, 16 తేదీల్లో దుబాయ్‌లో అంగరంగవైభవంగా జరగనుంది. ఈ వేడుకలకు సంబంధించి ఆదివారం జరిగిన ప్రెస్‌మీట్‌లో రానా దగ్గుబాటి మాట్లాడుతూ,'దక్షిణాది చిత్ర పరిశ్రమలన్నీ కలిసి ఆనందంగా జరుపుకునే వేడుక సైమా. గత 11 ఏళ్ళుగా ఈ వేడుకల్లో భాగమౌతున్నప్పటికీ ఇప్పుడే మొదలుపెట్టిన ఉత్సాహం, ఆనందం ఉంది. గ్లోబల్ ఫ్లాట్ ఫామ్‌కి చేరుకోవడానికి ఇదొక గొప్ప వేదిక. ఈ వేడుకల్లో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. 'సౌత్‌లో పని చేయడం మొదలుపెట్టినప్పటి నుంచి సైమాతో అసోసియేషన్ ఉంది. విష్ణు, బృందాకి థ్యాంక్స్. ఈ వేడుకల్లో లెజెండరీ నటీనటులతో కలిసి వేదిక పంచుకోవడం గొప్ప ఆనందాన్ని ఇస్తుంది' అని హీరోయిన్ నిధి అగర్వాల్ చెప్పారు.

మరో హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ,'సైమా వేడుకల్లో పాల్గొనడం నాకు ఇదే మొదటిసారి. ఇది అవార్డుల వేడుకే కాదు సినిమాని ఒక పండగలా జరుపుకునే వేడుక. అన్ని చిత్ర పరిశ్రమలూ పండగలా జరుపుకునే ఈ వేడుక కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాను' అని తెలిపారు.

సైమా చైర్ పర్సన్ బృందా ప్రసాద్ మాట్లాడుతూ,'సైమా వేడుక అన్ని చిత్ర పరిశ్రమలకు ఒక రీయూనియన్, హోమ్‌కమింగ్ లాంటిది. సైమా వేడుకలకు కౌంట్ డౌన్ మొదలైంది. రానా లేకుండా ఈ వేడుకలను ఊహించుకోలేం. అందరి సహకారంతో ఈ వేడుకల్ని అద్భుతంగా నిర్వహిస్తాం' అని అన్నారు.



టాలీవుడ్ లేటెస్ట్ సూపర్ హిట్ మూవీ 'ఖుషి' కలెక్షన్ల జోరు కొనసాగుతోంది. విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అందరినీ ఆకట్టుకున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తోంది. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా 30.1 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ సాధించిన ఈ సినిమా రెండో రోజుకు రూ. 51 కోట్లను

తమ్ముడికి 'బేబీ', నాకు 'ఖుషి'

\- విజయ్ దేవరకొండ

ఆర్జించింది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మాణంలో దర్శకుడు శివ నిర్వాణ రూపొందించిన ఈ సినిమా యూఎస్ బాక్సాఫీస్ వద్ద కూడా ఇదే జోరులో ఉంది. రెండో రోజునే ఈ సినిమా వన్ మిలియన్ డాలర్స్ ఫీట్ సాధించింది. ఈ సినిమా ఘన విజయం సాధించిన నేపథ్యంలో 'ఖుషి' మూవీ టీమ్‌తోపాటు హీరో విజయ్ దేవరకొండ ఫ్యామిలీ యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, 'ఈ ఏడాది మా ఫ్యామిలీకి చాలా కలిసొచ్చింది. మా బ్రదర్ 'బేబీ' మూవీ, నేను నటించిన 'ఖుషి' రెండు సక్సెస్ అయ్యాయి. అందుకు దేవుడికి కృతజ్ఞతలు తెలిపాం. మా మైత్రీ సంస్థకు కూడా ఈ ఏడాది కలిసొచ్చింది. వాళ్ల రెండు సినిమాలకు నేషనల్ అవార్డ్స్ వచ్చాయి. అలాగే ఇపుడు 'ఖుషి' హిట్ అయ్యింది' అని అన్నారు.

కచ్చితంగా పగ తీర్చుకుంటా..


కంగనా రనౌత్

రాజాధిరాజ.. రాజ గంభీర.. రాజ మార్తాండ.. రాజ కుల తిలక అంటూ వేట్టయ రాజా వేంచేయనున్నారు. 17 సంవత్సరాల క్రితం 'చంద్రముఖి' తన బందీగా ఉంటున్న గది తలుపులు తెరుచుకుని వేట్టయ రాజాపై పగ తీర్చుకోవటానికి ప్రయత్నించి విఫలమైంది. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు తన పగ తీర్చుకోవటానికి వచ్చేస్తోంది. అదెప్పుడు.. ఎక్కడ.. ఎలా అనేది తెలుసుకోవాలంటే ఈనెల 15 వరకు ఆగాల్సిందేనంటున్నారు మేకర్స్. రాఘవ లారెన్స్ హీరోగా బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'చంద్రముఖి 2'.

లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రాన్ని డైరెక్టర్ పి.వాసు తెరకెక్కించారు. వినాయక చవితి సందర్భంగా తెలుగు, తమిళ భాషల్లో ఈనెల 15న ఈ సినిమా విడుదలవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని రాధాకృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ ఉప్పుటూరి, వెంకట రత్నం శాఖమూరి రిలీజ్ చేస్తున్నారు. ఆదివారం చిత్ర యూనిట్ ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసింది.

ఇందులో రాఘవ లారెన్స్ రెండు షేడ్స్‌లో, చంద్రముఖి పాత్రలో కంగనా రనౌత్, బసవయ్య పాత్రలో వడివేలు మెప్పించబోతున్నారని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది.

చలో అమెరికా



నవీన్ పోలిశెట్టి, అనుష్క

'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' కోసం అగ్రెసివ్ ప్రమోషన్స్ చేస్తున్నారు హీరో నవీన్ పోలిశెట్టి. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రమోషన్ టూర్ కంప్లీట్ చేసిన ఆయన అమెరికా వెళ్తున్నారు. డల్లాస్‌లో ఈ నెల 6వ తేదీన ఈ సినిమా ప్రీమియర్ షోస్‌ని ఆయన ఆడియెన్స్‌తో కలిసి చూడబోతున్నారు.

ఆ తర్వాత చికాగో, వర్జీనియా, న్యూ జెర్సీ, సియాటెల్, బే ఏరియా, అట్లాంట తదితర రాష్ట్రాల్లో ప్రమోషన్స్ నిర్వహిస్తారని మేకర్స్ తెలిపారు. నవీన్ పోలిశెట్టి, అనుష్క శెట్టి జంటగా నటించిన ఈ చిత్రం ఈ నెల 7న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది.

మ్యాడ్ రిలీజ్ డేట్ ఫిక్స్



నిర్మాత సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) కుమార్తె హారిక సూర్యదేవర నిర్మాతగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మ్యాడ్'. ఈ చిత్రాన్ని రక్షా బంధన్ రోజున సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా టీజర్ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉంది. వినోదభరితంగా సాగిన టీజర్‌కి వస్తున్న అద్భుతమైన స్పందనతో ఈ సినిమాని ఈనెల 28న థియేటర్లలో విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం ప్రకటించింది.

సూర్యదేవర నాగ వంశీ సమర్పిస్తున్న ఈ చిత్రానికి ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సాయి సౌజన్య సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ఈ చిత్రంతో కళ్యాణ్ శంకర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ వినోదాత్మక చిత్రంలో సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్, శ్రీ గౌరీ ప్రియా రెడ్డి, అనంతిక సనీల్ కుమార్, గోపికా ఉద్యాన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.


శ్వేత అవస్తి, గౌతం కృష్ణ

ఓ మధ్య తరగతి కుర్రాడి కథ


గౌతం కృష్ణ హీరోగా, శ్వేత అవాస్తి, రమ్య పసుపులేటి కథానాయికలుగా సెవెన్‌హిల్స్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం. 3గా ఓ చిత్రం రూపొందుతోంది.

పి.నవీన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం ఇప్పటికే మూడు షెడ్యూళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'స్టూడెంట్ నుంచి కార్పొరేట్ స్థాయికి ఎదిగిన మధ్య తరగతి కుర్రాడి కథ ఇది. యూత్‌కి, ఫ్యామిలీ ఆడియన్స్‌కి, అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ చిత్రం అలరిస్తుంది. త్వరలో టైటిల్‌ను ప్రకటిస్తాం. హీరో గౌతం కృష్ణ 'ఆకాశవీధుల్లో' చిత్రంతో మంచి గుర్తింపు పొందారు. ఈ చిత్రంలో స్టూడెంట్ పాత్రకు వంద శాతం న్యాయం చేశారు' అని అన్నారు.

'విజయవంతంగా మూడు షెడ్యూళ్లు పూర్తి చేశాం. త్వరలో టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేస్తాం. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను విడుదల చేస్తాం' అని నిర్మాత చెప్పారు.

పోసాని కృష్ణమురళి, అనితా చౌదరి, షఫీ, ఆర్కే మామ, ఆనంద్ చక్రపాణి, భద్రం, పింగ్ పాంగ్ సూర్య తదితరులు ఇందులో ఇతర ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు.

విలక్షణ విశాల్‌ని చూడబోతున్నారు


విశాల్

విశాల్ టైటిల్ పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ 'మార్క్ ఆంటోని'. పాన్ ఇండియా మూవీగా రూపొందిన ఈ సినిమాను మినీ స్టూడియో బ్యానర్‌పై అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఎస్.వినోద్ కుమార్ నిర్మించారు.

వినాయక చవితి సందర్భంగా ఈ మూవీ ఈనెల 15న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం ఈ చిత్ర ట్రైలర్‌ను రానా దగ్గుబాటి విడుదల చేశారు.

విశాల్ పాత్రలో ఉన్న వేరియేషన్స్, ఎస్.జె.సూర్య పాత్ర, వీళ్ళిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు, టైమ్ ట్రావెల్ ఫోన్ కాన్సెప్ట్, సునీల్ డిఫరెంట్ లుక్, సెల్వ రాఘవన్ పాత్రతోపాటు 80-90 దశకంలో ఓ ఊపు ఊపిన సిల్క్ స్మిత పాత్రను కూడా ఈ ట్రైలర్‌లో చూపించారు.

చివరిగా ఇది మార్క్ సమస్య .. నా బాబు ఆంటోనీని నేనే చంపుతా అని కొడుకు పాత్రలోని విశాల్ చెప్పటం.. తండ్రి పాత్రలో విశాల్ అక్కడ పగలబడి నవ్వటంతో పాటు గుండు లుక్‌లో స్టైలిష్ విశాల్ లుక్ స్టన్నింగ్‌గా ఉంది. ఇప్పటి వరకు విశాల్ చేసిన సినిమాలన్నీ ఒక ఎత్తైతే ఈ సినిమా మరో ఎత్తు అనిపిస్తోంది. ఇది తండ్రీ కొడుకుల మధ్య సాగే డిఫరెంట్ ఎమోషనల్ మూవీగా ఎంటర్‌టైన్ చేయనుందని ట్రైలర్ చెప్పకనే చెప్పింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

రాజ్యాంగంలోని అతి చిన్న భాగం ఏది?

డాక్టర్ అలీ సార్
భారత రాజ్యాంగ నిపుణులు
9494228002



1. జతపరుచుము.

షెడ్యూల్	వివరణ
ఎ. 8వ షెడ్యూల్	1.రాజ్యాంగ ఉన్నత పదవులు వారి జీతభత్యాలు
బి.2వ షెడ్యూల్	2. అధికార భాషలు
సి.7వ షెడ్యూల్	3. భూసంస్కరణలు మరియు జమీందారు విధానం రద్దు
డి. 9వ షెడ్యూల్	4. కేంద్ర రాష్ట్రాల మధ్య అధికార విభజన.

1.ఎ1,బి2,సి3,డి4 2. ఎ3,బి1,సి2,డి4
3.ఎ2,బి1,సి3,డి4 4. ఎ2,బి1,సి4,డి3

2. భారత రాజ్యాంగమును అర్ధ సమాఖ్యగా అభివర్ణించినవారు?
1. ఐవర్ జెన్నింగ్స్ 2. కె.సి.వేర్
3. అంబేద్కర్ 4. గ్రాన్‌విల్ ఆస్టిన్

3. రాజ్యాంగసవరణ పద్ధతిని ఏ దేశ రాజ్యాంగం నుండి స్వీకరించారు?
1. దక్షిణాఫ్రికా 2. బ్రిటన్
3. ఫ్రెంచి 4. ఆస్ట్రేలియా

4.భారత రాజ్యాంగంలోని క్రింది ఏ భాగం సహకార సంఘాల గురించి తెలియజేస్తుంది?
1. 9(ఎ) 2. 9(బి) 3. 9(సి) 4. 14(ఎ)

5. భారత రాజ్యాంగంలో ఏ షెడ్యూల్ రాజ్యాంగ ఉన్నత పదవుల ప్రమాణ స్వీకారాలు గురించి తెలియజేస్తుంది?
1. 2వ షెడ్యూల్ 2. 3వ షెడ్యూల్
3. 4వ షెడ్యూల్ 4. 5వ షెడ్యూల్

6. ఈ క్రింది వాటిలో అమెరికా రాజ్యాంగం నుండి స్వీకరించిన అంశాలను గుర్తించండి.
ఎ. రిట్లు జారీ చేయడం
బి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తొలగింపు
సి. న్యాయ సమీక్షాధికారం
డి. సర్వ సైన్యాధ్యక్షుడు.
1. ఎ,బి,సి 2. బి,సి,డి
3. ఎ,సి,డి 4. ఎ,బి,సి,డి

7. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ఉమ్మడి జాబితాల లోని అంశాలు.
1.97,66,47 2. 100,61,52
3.98,59,52 4. 59,54,36

8. భారత రాజ్యాంగంలోని ఏ భాగం రాజ్యాంగ సవరణ గురించి తెలియ జేస్తుంది?
1. 21 2. 22 3. 20 4. 19

9. జతపరుచుము.

భాష	రాజ్యాంగ సవరణ చట్టం
ఎ. నేపాలి	1. 71వ రాజ్యాంగ సవరణ చట్టం
బి. సింధి	2. 96వ రాజ్యాంగసవరణ చట్టం
సి. సంతాలి	3. 92వ రాజ్యాంగ సవరణ చట్టం
డి. ఒడియా	4. 21వ రాజ్యాంగ సవరణ చట్టం

1.ఎ4,బి2,సి3,డి1 2. ఎ1,బి2,సి3,డి4
3.ఎ1,బి4,సి2,డి3 4. ఎ1,బి4,సి3,డి2

10. ఏ సంవత్సరం నుండి హిందీ అధికార భాషగా కొనసాగుతుంది?
1. 1971 2. 1956 3. 1950 4. 1965

11. క్రింది వాటిలో బ్రిటీషు రాజ్యాంగం నుండి స్వీకరించిన అంశాలను గుర్తించండి.
ఎ. ద్విసభా విధానం బి. సమన్యాయపాలన
సి. రాజ్యాంగ ప్రవేశిక డి.సభా హక్కులు
1.ఎ,బి,సి 2. ఎ,బి,డి
3. బి,సి 4. ఎ,బి,సి,డి

12. భారత రాజ్యాంగంలోని క్రింది ఏ షెడ్యూల్ రాజ్యసభలో రాష్ట్రాలకు కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయించిన సీట్ల వివరాలు తెలియజేస్తుంది?
1. 2వ షెడ్యూల్ 2. 5వ షెడ్యూల్
3. 4వ షెడ్యూల్ 4. 6వ షెడ్యూల్

13. 1973 తర్వాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన అంశాలు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధంగా ఉంటే వాటిని న్యాయసమీక్ష చేయ వచ్చునని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పునిచ్చింది?
1. కామన్ కాజ్ Vs UOI
2. XLవియర్స్ Vs UOI
3. ఐ ఆర్ కొయల్హో Vs తమిళనాడు
4. కిహెూటో హెూలాహన్ కేసు

14. భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ దేనిని తెలియజేస్తుంది.
1. పంచాయతీ రాజ్
2. పార్టీ ఫిరాయింపు నిషేదం
3. దేశంలో షెడ్యూల్ కులాలు, జాతుల వారి పరిపాలన వివరాలు.
4. ఏదికాదు.

15. ఏ రాజ్యాంగ సవరణ చట్టంద్వారా పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని రాజ్యాంగంలో చేర్చారు?
1. 56వ రాజ్యాంగ సవరణ చట్టం
2. 52వ రాజ్యాంగ సవరణ చట్టం
3. 55వ రాజ్యాంగ సవరణ చట్టం
4. 44వ రాజ్యాంగ సవరణ చట్టం

16.భారత రాజ్యాంగంలో అతి పెద్ద మరియు అతి చిన్న భాగాలు ఏవి?
1. 5వ భాగం, 14వ భాగం 2. 4వ భాగం, 14(ఎ) భాగం
3. 5వ భాగం, 20వ భాగం 4. 4వ భాగం, 20వ భాగం

17. జతపరుచుము.

భాగం	వివరణ
ఎ. 14వ భాగం	1. కేంద్ర పాలిత ప్రాంతాలు
బి. 12వ భాగం	2. అధికార భాష
సి. 17వ భాగం	3. ఆర్థిక తదితర అంశాలు
డి. 8వ భాగం	4. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ సర్వీసులు

1.ఎ1,బి2,సి3,డి4 2. ఎ4,బి3,సి2,డి1
3.ఎ2,బి3,సి4,డి1 4. ఎ4,బి3,సి1,డి2

18.భారత రాజ్యాంగంలోని 7వ భాగాన్ని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా తొలగించారు?
1. 5 వ రాజ్యాంగ సవరణ చట్టం
2. 7 వ రాజ్యాంగ సవరణ చట్టం
3. 97వ రాజ్యాంగ సవరణ చట్టం
4. 42వ రాజ్యాంగ సవరణ చట్టం

19. భారత ప్రభుత్వము జనవరి 25 ను జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకోవాలని ఏ సం.లో ప్రకటించింది?
1. 2015 2. 2010
3. 2009 4. 2011

20. రాజ్యసభ సభ్యులను ఎన్నిక చేసే విధానంను ఏ దేశ రాజ్యాంగం నుండి గ్రహించారు?
1.దక్షిణాఫ్రికా 2.యుఎస్ఎస్ఆర్ రాజ్యాంగం
3. నార్వే 4. జర్మనీ

21. భారత రాజ్యాంగంలో ట్రిబ్యునల్స్ గురించి తెలిపే అధికరణ?
1. ఆర్టికల్ 14 2. ఆర్టికల్ 98
3. ఆర్టికల్ 20 4. ఆర్టికల్ 14ఎ

22. జతపరుచుము.

ఎ. నిర్దేశిక నియమాలు	1.అమెరికా రాజ్యాంగం
బి. ప్రొటెం స్పీకర్	2. ఫ్రెంచి రాజ్యాంగం
సి. ప్రాథమిక విధులు	3. ఐర్లాండ్ రాజ్యాంగం
డి. ప్రాథమిక హక్కులు	4.యుఎస్ఎస్ఆర్ రాజ్యాంగం

1.ఎ1,బి2,సి3,డి4 2. ఎ4,బి3,సి2,డి1
3.ఎ3,బి4,సి2,డి1 4. ఎ3,బి2,సి4,డి2

23. ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారి సభ్యత్వములను సభాధ్యక్షులు రద్దు చేయగలరు?
1. 91వ రాజ్యాంగ సవరణ చట్టం
2. 56 వ రాజ్యాంగ సవరణ చట్టం
3. 42వ రాజ్యాంగ సవరణ చట్టం
4. 44వ రాజ్యాంగ సవరణ చట్టం

24.భారత రాజ్యాంగంలో ఎన్నికలు గురించి తెలిపే భాగం ఏది?
1. 15 2. 17 3. 19 4. 18

25. భారత రాజ్యాంగంలోని ఏక కేంద్ర లక్షణాలు క్రింది వాటిలో గుర్తించండి.
ఎ. సమీకృత న్యాయ వ్యవస్థ బి. న్యాయ సమీక్ష అధికారం
సి. కాగ్ డి. పౌరసత్వము
1. ఎ,బి,సి 2 బి,సి,డి
3. ఎసి,డి 4. ఎ,బి,సి,డి

26. భారత రాజ్యాంగమును బేరమాడే సమాఖ్యగా పేర్కొన్నవారు?
1. ఐవర్ జెన్నింగ్స్ 2. కేసివేర్
3. మేరిస్ జోన్స్ 4.పాల్ ఆపిల్ బి

సమాధానాలు

1.4	2.2	3.1	4.2	5.2
6.4	7.3	8.3	9.4	10.4
11.2	12.3	13.3	14.2	15.2
16.3	17.2	18.2	19.4	20.1
21.4	22.4	23.1	24.1	25.3
26.3				

కరెంట్ అఫైర్స్

- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545



జపాన్‌తో కలిసి మరో చంద్ర మిషన్ : ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) జపాన్ అంతరిక్ష పరిశోధనా సంస్థ (జాక్సా) సహకారం తో మరో చంద్రమిషన్ కు సిద్ధమవుతుంది. 2024 - 25 లో ఎల్‌యుపిఇఎక్స్ (లూనార్ పోలార్ ఎక్స్‌ప్లోరేషన్) గా పిలువబడే ఈ మిషన్ చంద్రుని ఉపరితలంపై పరిశోధన చేయడానికి ఉద్దేశించబడినది. జపాన్ ఏరోస్పేస్ ఏజెన్సీ (జె.ఎ.ఎక్స్.ఎ) ను అక్టోబర్1, 2003 లో స్థాపించారు. దీని ప్రధాన కార్యాలయం చోపు, టోక్యో, జపాన్.



చేపల పెంపకం, ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానం : చేపల పెంపకం, ఉత్పత్తిలో తెలంగాణ మొదటిస్థానంలో వుంది. రాష్ట్రంలో మత్స్య సంపదను 1.98 లక్షల టన్నుల నుంచి 4.24 లక్షల టన్నులకు పెరిగింది. 2023 సంవత్సరానికి ఉచిత చేపలు, రొయ్య పిల్లల పంపిణీ ఆగస్టు 26 నుండి తెలంగాణలో ప్రారంభమవుతుంది. ప్రభుత్వం ఈ సంవత్సరం 26,357 నీటి వనరుల్లో 84,13 కోట్లలో 85.60 కోట్ల చేప పిల్లలను 300 నీటి వనరుల్లో 25.99 కోట్లతో 10 కోట్ల రొయ్య పిల్లలను విడుదల చేయనుంది.

లీటర్ లోపు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను నిషేదించిన అస్సాం : రాష్ట్రంలో 1000 మిల్లీ లీటర్ల కంటే తక్కువ సామర్థ్యం వున్న ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వాడకం ఉత్పత్తిపై నిషేదం విధిస్తున్నట్లు అస్సాం పర్యావరణ అటవీ శాఖ ప్రకటించింది. ఈ నిషేదం అక్టోబర్ 2 నుండి అమలులోకి వస్తుంది. 1 లీటర్ కంటే తక్కువ వాల్యూమ్‌తో పాలిథిలిన్ టెరెఫ్రాలెట్ (పి.ఇ.టి)తో తయారు చేసిన తాగునీటి బాటిళ్ల ఉత్పత్తి, వినియోగాన్ని నిషేదించే ఉద్దేశ్యాన్ని ప్రకటించింది.



ఇ.సి. జాతీయ ఐకాన్‌గా సచిన్ టెండుల్కర్ : భారత మాజీ క్రికెటర్ సచిన్ టెండుల్కర్ ఎన్నికల కమిషన్ (ఇ.సి.) నేషనల్ ఐకాన్‌గా మారి ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల భాగస్వామ్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించనున్నారు. ఎన్నికల సంఘం సంచిన్‌తో 3 సంవత్సరాలు ఒప్పందం కుదుర్చుకుంది. యువతలో సచిన్‌కు వున్న ప్రజాదరణ, పలుకుబడి ఎన్నికల ప్రక్రియపై సానుకూల ప్రభావం చూపడం ఖాయమని ఎన్నికల సంఘం భావిస్తుంది. నటుడు పంకజ్ త్రిపాఠిని జాతీయ ఐకాన్‌గా గత ఏడాది నియమించింది. క్రికెటర్ మహేంద్రసింగ్ ధోని, నటుడు అమిర్‌ఖాన్, బాక్సర్ మేరీకోమ్ జాతీయ ఐకాన్‌లుగా వ్యవహరించినవారే.



థాయ్‌లాండ్ ప్రధానిగా శ్రేతాతవీసిన్: థాయ్‌లాండ్ కొత్త ప్రధానిగా శ్రేతా తవీసిన్ ఎన్నికయ్యారు. అసెంబ్లీలో మూడింట రెండొంతుల మద్దతుతో పార్లమెంటరీ ఓటింగ్‌లో 60 ఏళ్ల తవీసిన్ విజయం సాధించడంతో 100 రోజుల క్రితం జరిగిన ఎన్నికల తర్వాత వారాల తరబడి నెలకొన్న రాజకీయ అనిశ్చితికి తెర పడింది.



క్లీన్ ఎయిర్ సర్వేలో గుంటూరు 3వ స్థానం : భారతదేశంలో పర్యావరణ అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్.సి.ఎ.పి) లో భాగంగా ఇటీవల నిర్వహించిన ఎయిర్ సర్వేలో గుంటూరు 3వ స్థానంలో నిలిచింది. 10 లక్షల జనాభా గల నగరాల విభాగంలో మహారాష్ట్రలోని అమరావతి మొదటిస్థానంలో నిలవగా ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్ 2వ స్థానంలో నిలిచింది. ఈ ఎన్‌సి.ఎపి సర్వేలో 131 నగరాలు పాల్గొన్నాయి. ప్రతిష్టాత్మకమైన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ అవార్డుల వేడుక సెప్టెంబర్ 7న మధ్యప్రదేశ్‌లోని బీహార్‌లో జరగనుంది.



ఒడిశాలో ఉత్కెలా విమానాశ్రయాన్ని ప్రారంభించిన విమానయాన శాఖామంత్రి జ్యోతిరాదిత్య సింధియా : ఆగస్టు 31, 2013 న కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఒడిశాలో ఉత్కెలా విమానాశ్రమాన్ని ప్రారంభించారు. ఇది ప్రతిష్టాత్మక ఉడాన్ (ఉడే దేశ్‌కా ఆమ్ నాగరిక్) పథకంలో భాగంగా ప్రారంభించడం జరిగింది.



సింగపూర్ అధ్యక్షుడిగా భారత్ సంతతికి చెందిన షణ్ముగరత్నం : భారత సంతతికి చెందిన ప్రముఖ ఆర్థిక వేత్త థర్మన్ షణ్ముగరత్నం (66) సింగపూర్ అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించారు. దేశంలో 2011 తర్వాత అధ్యక్ష ఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి. షణ్ముగరత్నంపై ఇద్దరు చైనా సంతతి నాయకులు పోటీకి దిగారు. అయితే ఈయన ఏకంగా 7.4 శాతం ఓట్లలో విజయం సాధించి సింగపూర్ 9వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

నిజమైన విద్యార్థి ఉద్యమకారులకు రాజకీయాల్లో చోటు లేదా?


డా. రేమద్దుల మండ్ల రవి
9177706626

మునుపెన్నడు లేని రాజకీయ చతురతతో నైతిక విలువలు మరచి సామాజిక న్యాయం పాటిం చని పార్టీగా, ఉద్యమ ద్రోహుల పార్టీగా, కమ్యూని స్టులతో మిత్రద్రోహం చేసిన పార్టీగా విద్యార్థి ఉద్యమకారులను మోసం చేసిన నిజమైన దొరల గడిల పార్టీగా పూర్తిస్థాయిలో తన ముఖచిత్రాన్ని ఆవిష్కరించింది బీఆర్ఎస్ పార్టీ. ఏ ఉద్యమమైన ఉవ్వెత్తున ఎగిసిపడాలంటే ఉరకలేత్తే యువరక్తం ఆ ఉద్యమానికి జీవనాడుల్లా పని చేస్తాయి. ఉస్మా నియా యూనివర్సిటీ విద్యార్థుల ఉద్యమంతో ఉవ్వె త్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమమే దానికి నిద ర్శనం కానీ ఆ యువరక్తానికి భవిష్యత్తు రాజకీయా లను నడపడానికి కావలసిన ప్రోత్సాహాన్ని ఇవ్వడం లో రాజకీయ పార్టీలు ఎందుకో భయపడుతున్నాయి. కేసీఆర్ మొదటిసారి ఇచ్చిన ప్రాధాన్యతను ఇప్పుడు విద్యార్థి ఉద్యమకారుల త్యాగాలను, తెలంగాణ కోసం అమరులైన అమరవీరుల త్యాగాలను, మునుగోడులో కమ్యూనిస్టుల మద్దతుతోనే గెలిచి వారిని అవమానిస్తూ పక్కన పెడుతున్న కేసీఆర్ కు విద్యార్థి నిరుద్యోగులు, రైతులు, కార్మికులు, అమరవీరుల కుటుంబాలు తిరగబడే రోజు ఆసన్నమైందనే చెప్పాలి. ప్రధానంగా తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువైన ఓయూ విద్యార్థి ఉద్యమ నాయకుల విషయంలో అది స్పష్టంగా కనబడుతుంది.

ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమంలో, రాజకీ యాల్లో కీలకపాత్ర పోషించి ఎన్నో నిర్బంధాలను, త్యాగాలను, సామాజిక, బహుజన, దళిత, విప్లవ ఉద్యమాలు చేసిన ఉస్మానియా యూనివర్సిటీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల నిజమైన విద్యార్థి ఉద్యమ కారులు ఈసారి రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా తమ పాత్ర ఉండాలని, కోరుకుంటున్నారు. గతంలో అన్ని పార్టీల నుంచి టికెట్లు ఆశించి భంగపడ్డ ఓయూ విద్యార్థి ఉద్యమకారులు. ఈ సారీ ఎలాగైనా ఆయా పార్టీల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉండాలని ఆశిస్తున్న వారు చాలామంది ఉన్నారు. కానీ ముందుగానే బీఆర్ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యే జాబితాలో కొత్తగా ఎవరికి నిజమైన విద్యార్థి ఉద్యమ కారులకు, అమరవీరుల కుటుంబాలకు టికెట్లు రాకపోవడంతో ఆ పార్టీకి సంబంధించిన విద్యార్థి నాయకులే నిరాశలో ఉన్నారు. మిగిలింది తెలంగాణ ఇచ్చిన పార్టీగా, తెలంగాణ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్లు ఆశిస్తు న్నారు. సోనియాగాంధీకి, రాహుల్‌గాంధీకి తెలంగా ణలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారు. వామ పక్ష భావజాలంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఓయూ విద్యార్థి ఉద్యమకారులు ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని, తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక కేసుల్లో జైలుకు వెళ్లి ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగు తున్నారు. కేసీఆర్ ప్రజావ్యతిరేక, నిరుద్యోగ వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ పనిచేసిన నిజమైన ఉద్యమకారులు నేటికీ పోరాడుతూనే ఉన్నారు. వారు కూడా ఈసారి ఎలాగైనా కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇస్తుందనే నమ్మకంతో పని చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా వారి పోరాటాలను గుర్తించి నిజమైన ఉద్యమకారులకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వా లని కోరుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయం లోని కేసులను మాఫీ చేస్తానని చెప్పి చేయని కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని యావత్ విద్యార్థి లోకం ఎదురుచూస్తున్నది. అదేవిధంగా రాహుల్ గాంధీ చెప్పినట్టు యువతకు పార్టీ పద వుల్లో, టికెట్లలో సముచిత స్థానం కల్పిస్తామని ప్రతి పార్లమెంటు పరిధిలో రెండు ఎమ్మెల్యే సీట్లను బీసీలకు ఇస్తానని ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకటనకు కట్టుబడి ఉండాలి. అప్పుడే ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన నిజమైన ఉద్యమకారులకు న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ దేనికోసమైతే తెలం గాణను ఇచ్చిందో అది సార్ధకత అవుతుంది.

కానీ కాంగ్రెస్ పార్టీ చురుకైన మలిదశ విద్యార్థి ఉద్యమకారులకు ఆ అవకాశం కల్పిస్తుందో లేదో వేచి చూడాల్సిందే. కాంగ్రెస్ పార్టీ గత చరిత్ర చూస్తే ఓయూ నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా, జైపాల్‌రెడ్డి, మధు యాస్కీగౌడ్, సంపత్‌కుమార్ లాంటి ఉద్దం డులు, పీవీ నరసింహారావు లాంటి వారు ప్రధాన మంత్రులైన చరిత్ర ఉన్నది. కానీ చాలా సంవత్స రాల వరకు ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమకారు లకు ఆ అవకాశాలు రాలేదు. ఇప్పుడు మళ్లీ అవకా శాలు వస్తాయని ఆశిస్తున్నారు విద్యార్థి ఉద్యమకా రులు. సహజంగానే విద్యార్థి నాయకులకు అన్ని పార్టీలు కూడా అతి తక్కువ సందర్భంలో టికెట్లు ఇచ్చినా పరిస్థితి ఉంది. అది కూడా ఎంతో పోరాడితే తప్పా నిజంగా పోరాడిన విద్యార్థి ఉద్యమకారులకు ఆ అవకాశాలు రావడం లేదు. ఈసారి కాంగ్రెస్ పార్టీలో గతంలో లాగా అన్యాయం జరిగితే ఇప్పుడు విద్యార్థుల మద్దతు ఏవిధంగా అయితే బీఆర్ఎస్ పార్టీ కోల్పోయిందో అలాగే కాంగ్రెస్ కూడా భవి ష్యత్తులో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల మద్దతు కోల్పోయే అవకాశం ఉందని విద్యార్థి ఉద్యమకారులు చర్చించుకుంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి నిరంతరం విద్యార్థి సమస్యలపై, ప్రజా సమస్యలపై కింది స్థాయిలో పోరాడే విద్యార్థి ఉద్యమకారుల అవసరం ఎంతైనా ఉంది. అలాంటి మేధోపరమైన, క్రియాశీలకమైన పోరాటాలు చేసే వారిని గుర్తించి వారిని ప్రోత్స హిస్తే యావత్ విద్యార్థి, నిరుద్యోగలోకం ఆ పార్టీకి సంపూర్ణమైన మద్దతిస్తారనడంలో ఎలాంటి సందే హంలేదు. తెలంగాణ ఉద్యమ సమయంలో లాఠీ లకు, బుల్లెట్లకు, కేసులకు, బెదిరింపులకు, నిర్బం ధాలకు, దాడులకు బెదరని వారు ఇప్పుడు కేసీఆర్ బెదిరింపులకు బెదిరేవారు కాదు ఉస్మానియా విద్యా ర్థులు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈమధ్య ఎవరు ప్రశ్నిం చిన వారిని బెదిరింపులకు పాల్పడడం, నిర్బం ధించడం ప్రతీకారంతో రగిలిపోవడం చేస్తున్నది.



ఈ మధ్యకాలంలో ఓయూలోని 'టీ' పాయింట్ సెంటర్లో రాష్ట్ర రాజకీయాలపై సుదీర్ఘమైన చర్చలు జరుగుతున్నాయి. అన్ని రకాల విద్యార్థి సంఘాల నాయకులు చర్చల్లో పాల్గొంటూ ఈ పదేండ్ల బీఆర్ఎస్ పాలనా గురించి ప్రత్యేక తెలం గాణ ఉద్యమంలో ప్రజలు, నిరుద్యోగులు కోరుకున్నదేంటి? జరుగు తున్నదేంటి? పరిపాలనలో మేకపోతు గంభీర్యాన్ని ప్రదర్శి స్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని అనేక రకాలుగా విశ్లేషణ చేసుకుంటున్నారు. కేసీఆర్ తప్పులను సరి చేసే బాధ్యత ఉస్మానియా విద్యార్థులే తీసుకోవాలని దఢ నిశ్చయంతో ఉన్నారు. ఈ క్రమంలోనే ఆయా పార్టీల నుంచి టికెట్లు ఆశిస్తు న్నామన్నట్టు ప్రచారాలు కూడా జరిగాయి. కానీ ఈసారి కేసీఆర్ ప్రకటించిన జాబితాలో మళ్లీ పాత వారిని, పనిచేయని వారిని కొనసాగించడంతో అన్ని పార్టీల లాగానే బీఆర్ఎస్ కూడా ఓటమి భయంతో ఒత్తిళ్లకు, ప్రలో భాలకు లొంగిపోయారనే ప్రచారం జరుగుతున్నది. దీంతో నిజమైన విద్యార్థి ఉద్యమ కారులకు రాజకీయాల్లో చోటు లేదా అనే సందే హం వ్యక్తపరుస్తున్నారు. ఉస్మానియా యూనివర్సి టీలో ఏ నిరు ద్యోగ విద్యార్థిని కదిలించిన ఈసారి బీఆర్ఎస్ పార్టీని మూడోసారి గెలవనిస్తే సమ స్యలు విన్నవిం చుకోవడానికి కేసీఆర్ అపాయిం ట్మెంట్ కోసం మూడు చెరువుల నీళ్లు తాగాల్సి వస్తుందేమో అని విద్యార్థి నిరుద్యోగులు చెబుతు న్నారు. విద్యార్థుల పోరాటానికి చలించి ప్రత్యేక తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది కానీ కేసీఆర్ కుటుంబం కానీ వారి బానిస బలగం కానీ పోరాడితే రాలేదని ఉస్మానియా విద్యార్థులు చెబుతున్నారు. ఒక్క కేసీఆర్ కుటుంబంలోనే ఐదుగురు ఎమ్మెల్యే లుగా పోటీ చేస్తే దాన్ని ఉద్యమ పార్టీ అంటారా? కుటుంబ పార్టీ అంటారా? వీరేనా కుల సామాజిక న్యాయం పాటించేది? 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చిన సీట్లు ఎన్ని, 7శాతం ఉన్న ఓసీలు తీసుకున్న సీట్లు ఎన్ని, 33 శాతం మహి ళలకు రిజర్వేషన్ ఉండాలని ఢిల్లీ వేదికగా దీక్ష చేసిన కవిత తన తండ్రి మహిళలకు ఇచ్చిన సీట్ల విషయంలో ఏం సమాధానం చెబుతుంది. ఇలాంటి మాయమాటలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు గమనిస్తూనే ఉన్నాయి వచ్చే ఎన్నికల్లో వారి ఓటే బీఆర్ఎస్ ఓటమికి ఆయుధంగా మారబోతుంది.

మిగతా పార్టీలు కూడా జాగ్రత్తపడాలి. యువ రక్తం ఉత్సాహవంతమైన నాయకత్వం ఉద్యమ స్ఫూర్తి కలిగినటువంటి యువకుల అవసరం చాలా ఉంది. అలాంటి నాయకత్వాన్ని పట్టుకోగలిగే దూర దృష్టి ఆయా పార్టీల అధిష్టానానికి ఉన్నదా.. లేదా? అనే సందేహం కూడా కలుగుతుంది. ప్రజా యుద్ధనౌక గద్దర్ చెప్పిన "బానిసల్లారా లేండిరా ఈ భాంచన్ బతుకులు ఎందుకురా" అనే చివరి మాటలే ప్రధానాస్త్రంగా ఎన్నికల యుద్ధక్షేత్రంలోకి వెళ్లాలని అడుగులు వేస్తున్నారు. ప్రొఫెసర్ జయ శంకర్ కలలుగన్న తెలంగాణ కోసం కాకుండా భూ కబ్జాదారుల, అవినీతి కాంట్రాక్టర్ల, విద్యా ప్రయివేటీ కరణ కోసం పాటుపడే నాయకుల కోసమే కేసీఆర్ పనిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మానని 'మణిపూర్' గాయం-మౌనం వీడని మోడీ!

వేదిక


నాదెండ్ల శ్రీనివాస్
9676407140

మణిపూర్‌లో గత కొద్దిరోజులుగా జరుగుతున్న ఆందోళనల్లో నూట ముప్పైకి పైగా సామాన్య ప్రజలు మరణించారు, 50వేల మందికి పైగా నిరాశ్రయుల య్యారు. చాలామంది ఇళ్లు తగలబడ్డాయి, దుకా ణాలు కాలి బూడిదయ్యాయి, ప్రార్థనా స్థలాలు ధ్వంసమయ్యాయి. మూడు నెలలకు పైగా కొనసా గుతున్న ఉద్రిక్తతలు, హింసను కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అదుపు చేయలేకపోవడానికి కారణం ఏమిటి? ప్రధాని నరేంద్రమోదీ మణిపూర్ విష యంలో పాటిస్తున్న భయంకరమైన మౌనం వీడ టానికి ఇద్దరు కుకీ మహిళలను నగ్నంగా ఊరేగించి నట్టు, వారిపైన సామూహిక అత్యాచారం జరిగినట్టే వీడియో సమాచారం వెల్లడి కావలసి వచ్చింది.

మణిపూర్‌లో అలాంటి ఘటనలు వంద జరిగాయి. ఆ ఒక్క ఘటనను వీడియో తీసి వైరల్ చేశారు" ఈ మాట చెప్పింది ఎవరో కాదు.. మణిపూర్ ముఖ్య మంత్రి బీరేన్‌సింగ్. ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ ఏ మాత్రం సిగ్గుపడకుండ చెప్పిన మాట ఇది. ఈ మాట విన్నతర్వాత ఎవరికైనా మనం నాగరిక ప్రపం చంలోనే బతుకున్నామా? అన్న అనుమానం రాక మానదు. మనల్ని పరిపాలిస్తున్నది మనుషులా... డైనోసార్లా అన్న అనుమానం కూడా వస్తుంది. మహి ళలపై ఇంత ఘోరంగా ఆకత్యాలు సహజమేనన్న ట్లుగా చెబుతున్న ఆ సీఎం మానసిక స్థితిలో కూడా తప్పేం లేదు. ఎందుకంటే..ఆయన రాజకీయ నాయ కుడు. ప్రజలు ఎలా పోయినా పర్వాలేదు..తమ సీటు తమకు ముఖ్యం అనుకునే నేత. మహిళలపై అలాంటి అరాచకాలు జరిగినప్పుడు ఏ సీఎం అయినా సిగ్గుతో తలదించుకోవాలి. కానీ ఆయన మాత్రం అవన్నీ కామనే అని జాతీయ మీడియాతో నిర్మోహమాటంగా చెబుతున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలో ఏ దేశం అయినా భారత్‌ను నాగరిక దేశంగా అంగీకరి స్తుందా? బయట దేశమెందుకు.. దేశంలోని ప్రజలు మన దేశం అభివృద్ధి చెందుతున్నామని.. మనం పురో గమిస్తున్నామని ఎవరైనా అనుకుంటారా?. అను కునే ఛాన్స్‌లేదు. ఎందుకంటే ఆ మహిళలపై ఆకృ త్యానికి పాల్పడటానికి కారణం రాజకీయ పార్టీలు పెంచి పోషించిన కులం, మతం, వర్గం, ప్రాంతం అనే విషబీజాలే. అవే నేడు వట వృక్షాలై ప్రజల మధ్య చిచ్చు పెట్టి ఘోరాలకు కారణమవుతున్నాయి. దేశ ప్రజల్లో విభజన తెస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి తెచ్చిన రాజకీయ నేతలే నిస్సిగ్గుగా.. అవన్నీ మామూలేనంటూ ఏ పశ్చాత్తాపం వ్యక్తం చేయ కుండా మాట్లాడేస్తున్నారు. అయితే భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఈ విషయాన్ని సుమోటోగా తీసుకొని తీవ్రమైన వేదననూ, ఆగ్ర హాన్ని వెల్లడిస్తూ మీరు చర్యలు తీసుకుంటారా, మమ్మల్ని తీసుకోమంటారా? అంటూ కేంద్ర ప్రభు త్వాన్ని, మణిపూర్ ప్రభుత్వాన్ని మందలించిన తర్వాతనే మోడీ సుమారు మూడు మాసాల మౌనం వీడారు.

ఈ మౌనం వెనుక మెజారిటీవాదం ఉన్నది. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి మాన భంగం చేసిన ఉదంతం మే 4వ తేదీన జరిగింది. అంతకు ముందు ఏప్రిల్ 14న హైకోర్టు తన పరిధి లో లేని అంశంపైన తీర్పు ఇచ్చింది. మెజారిటీ మైతీ లను ఆదివాసులుగా గుర్తించి వారికి రిజర్వేషన్లు అమలు జరగాలని నిర్ణయించింది. మహిళలపైన అత్యాచారం జరిగిన తర్వాత పక్షం రోజులకు మే 18న ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నోరు తెరిచిన తర్వాతనే ప్రధాని మౌనానికి స్వస్తి చెప్పారు. ప్రధాని ఖండనలో సైతం రాజకీయం దండిగా ఉంది. ఏ రాష్ట్రంలోనైనా, అది రాజస్థాన్ కావచ్చు, ఛత్తీస్‌ఘఢ్ కావచ్చు, మణిపూర్ కావచ్చు.మహిళలను రక్షించ వలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకున్నది. చట్టాలను పకడ్బం దీగా అమలు చేయాలని ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేస్తున్నా అంటూ వ్యాఖ్యానించారు.

మౌనం ప్రధానికి సంబంధించినంత వరకూ ఒక ఆయుధం. ఒక విధానం. ప్రముఖ సంపాదకు రాలు గౌరీలంకేష్‌ను హత్య చేసినా, ముగ్గురు హక్కుల నేతలను చంపివేసినా ప్రధాని మౌనాన్నే ఆశ్రయించారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయా లని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో రైతులు సంవత్సరం పొడుగునా నిరసన ప్రదర్శనలు చేసినా, మహిళా వస్తాదులు న్యాయం కావాలంటూ ఎన్ని మాసాలు జంతర్ మంతర్‌లో ప్రదర్శనలు చేసినా మౌనమే ప్రధాని సమాధానం. మణిపూర్‌లో వంద మందికి పైగా మరణించినా అదే మౌనం. మణిపూర్‌లోని ఇంఫాల్ లోయలో నివసించే మైతీలు మెజారిటీ తెగ.కొండలలో నివసించే కుకీల కంటే తక్కువ, కుకీలు క్రైస్తవులు. వీరు కాకుండా నాగాలు ఇంఫాల్ లోయ పక్కనే ఉంటారు. ఇటీవల నాగా మహిళను ఎవరో ఇంఫాల్ (మణిపూర్ రాజధాని)లో హత్య చేశారు. నాగాలు ఆగ్రహోదగ్రులైనారు. సకాలంలో మణిపూర్ పౌర సమాజం నాగా మహిళ హత్యను ఖండించింది. మైతీల రాడికల్ సంస్థ ఆరంబై టెన్గోల్ హత్యను నిర్ద్వంద్వంగా ఖండించింది.అంతటితో నాగాలు సర్దుకున్నారు. లేకపోతే మైతీ-నాగా ఘర్ష ణలతో ఉత్తర మణిపూర్ రావణకాష్ఠంగా మారేది. దేశీయంగా మంత్రి అమిత్‌షా సైతం కర్నాటకలో ఎన్నికలు ముగిసిన తర్వాతనే మణిపూర్ సందర్శించారు.



ఢిల్లీ నుంచి కుకీలు నివసించే దక్షిణ మణిపూర్ కొండలలో శాంతి భద్రతలతో ముఖ్యమంత్రికి సంబంధంలేదు. ఢిల్లీ నుంచే నేరుగా కుకీల ప్రాంతంలో పరిపాలనను సాగిస్తున్నారు. ఢిల్లీ మద్దతు మైతీలకు ఉన్నది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించమని జూన్ 24న ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్ష నాయకులందరూ ముక్తకంఠంతో కోరారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన బీజేపీ ముఖ్య మంత్రిని తొలగించడానికి మోదీ ససేమిరా అంటున్నారు. అయితే మణిపూర్‌లో ఘర్షణలు జరిగిన తర్వాత 79 రోజులకు మోదీ నోరు తెరిచారు. ఈలోపు ఆయన అమెరికా వెళ్లారు. ఫ్రాన్స్ సందర్శించారు. యునైటెడ్ ఎమిరేట్స్‌లో పర్యటించారు. అమెరికా పార్లమెంట్‌లో మాట్లాడారు. ఫ్రాన్స్‌లో భారత సంతతికి చెందిన ప్రవాస భార తీయులను ఉద్దేశించి అద్భుతంగా ప్రసంగించారు. భారత్ ఔన్నత్యాన్ని పొగుడుతూ వ్యాఖ్యలు చేశారు. చంద్రయాన్-3ని నింగికి పంపిన శాస్త్రజ్ఞులను పారిస్ నుంచే అభినందిం చారు. చిరుత పులులు చనిపోవడం గురించి మాట్లాడారు. ఈలోగా ఎన్ని కలు జరగబోతున్న మధ్యప్రదేశ్, తెలం గాణలో పర్యటించారు. కానీ మణి పూర్ వెళ్ళిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఎద్దేవా చేశారు.

భోపాల్‌లో గంభీరోపన్యాసం చేస్తూ ప్రధాని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపి) నేతలు 70 వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతిపరుల గుట్టులన్నీ రట్టు చేస్తామనీ, అందరి లెక్కలూ తేలుస్తామని భీకర ప్రతిజ్ఞ చేశారు. ఈలోపే అదే ఎన్సీపీ నాయకులను మహారాష్ట్ర ప్రభుత్వంలో చేర్చుకున్నారు. 70 వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్టు ఆరోపించిన అజిత్‌పవార్‌కు మహా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి గౌరవించారు. అవినీతి ఆరోపణలపైన కొన్ని మాసాలు జైలులో గడిపిన ఛగన్ భుజ్‌బల్‌ను మంత్రిగా చేసి ఆదరిం చారు. మోదీ దేశ విదేశాలలో పర్యటిస్తూనే ఉన్నారు. మణిపూర్ మాత్రం సందర్శించడం లేదు. మణిపూర్ లో జరిగినటువంటి ఘోరం రాజస్థాన్‌లో కానీ హిమాచల్ ప్రదేశ్‌లో కానీ, ఛత్తీస్‌గఢ్ కానీ జరిగి ఉన్నట్లయితే అక్కడికి మోదీ, షా, స్మృతి ఇరానీ వెంటనే వెళ్ళేవారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించే వారు. మానవ హక్కుల కమీషన్ నోటీసులు పంపించేది. పార్లమెంటు లో రచ్చ రచ్చ జరిగేది. రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించేవారు. కానీ మణిపూర్ బీజేపీ పాలనలో ఉంది. బీరేన్ సింగ్ బీజేపీకి చాలా ముఖ్యుడు. తనకు మహిళలపైన అత్యాచారం జరిగినట్టు ఎఫ్ఐఆర్ దాఖలయ్యే వరకూ తెలియ దని మొదట అన్నారు. నిజానికి ఇద్దరు కుకీ మహిళలను అల్లరిమూకకు అప్పగించింది పోలీసు లేనని ఆరోపణ. పోలీసులు చేసిన ఘనకార్యం గురించి కూడా తెలియని ముఖ్యమంత్రి అధికారం లో ఉండటానికి అర్హుడా?

పోలీసులలో, సాయుధ పోలీసులలో సైతం తెగ భేదాలు ఉన్నాయి. మైతీ పోలీసులు దక్షిణాదిన కొండలలో కుకీలు నివసించే ప్రాంతంలో పని చేయరు. పోలీసు శిక్షణ కేంద్రం నుంచి, కేంద్ర బెటాలియన్ నుంచీ, మణిపూర్ సాయుధ బెటాలియన్ నుంచీ 6.32 లక్షల బుల్లెట్లూ, 4,537 మర తుపాకులూ మాయమయ్యాయి. వీటిలో అయిదు శాతం మాత్రమే కుకీల చేతుల్లోకి వెళ్ళాయి. తక్కినవి మైతీల చేతుల్లో ఉన్నాయి. మణిపూర్ మహిళలు సాహస వంతులు.మైతీ మహిళలు జైలును ముట్టడించి 12 మంది కాంగ్లీ యేవోల్ కెన్నా లుప్ మిలిటెంట్ గ్రూపుకు చెందిన యోధులను విడుదల చేయించారు.ఈ ఉదంతంలో చర్యలు లేవు.నిర్బంధాలు లేవు.విచారణ లేదు. 12 మంది